# CLASS - 7

## LANGUAGES SEMESTER - 1


| S. No. | SUBJECT | Page No. |
|---|---|---|
| 1. | తెలుగు – తెలుగు సౌరభం | 01-102 |
| 2. | हिंदी – कुसुम | 103-212 |
| 3. | ENGLISH – HONEY BLOOM | 213-378 |


APSCERT

**© Government of Andhra Pradesh, Amaravati**

*Telugu, Hindi First Published 2020*
*New Impression - 2021, 2022, 2023, 2024, 2025, 2026*
*English First Published 2023*
*New Impression - 2024, 2025, 2026*

**DISCLAIMER**
Any form of copying of the content, information and illustrations from this textbook is a punishable offence.

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published. Without a similar condition including this condition being imposed on the subsequent purchaser. The copyright holder of this book is the Commissioner of School Education, Amaravati, Andhra Pradesh.

This book has been printed on 70 GSM, SS Maplitho, Title Page 220 GSM, and White Art Card.

**Published by Samagra Shiksha & SCERT - Government of Andhra Pradesh, Amaravati.**



https://amaravathiteacher.com

# మా తెలుగు తల్లి

- శంకరంబాడి సుందరాచారి

మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు
కడుపులో బంగారు కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి
గలగలా గోదారి కదలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి
అమరావతీ నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై, నిఖిలమై నిలిచియుండేదాక
రుద్రమ్మ భుజశక్తి, మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి, కృష్ణరాయల కీర్తి
మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక
నీ ఆటలే ఆడుతాం - నీ పాటలే పాడుతాం
జై తెలుగు తల్లీ ! జై తెలుగు తల్లీ! జై తెలుగు తల్లీ!



AP SCERT

Printed in India
at the A.P. Govt., Textbook Press,
Amaravati, Andhra Pradesh.



https://amaravathiteacher.com

# వందే మాతరం

– బంకించంద్ర ఛటర్జీ



వందే మాతరం వందే మాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం వందే మాతరం
శుభ్రజ్యోత్స్నాపులకిత యామినీం
ఫుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం వందే మాతరం.


## Vande Mataram

**Vande Mataram!**
**Sujalam, suphalam, malayaja shitalam,**
**Shasyashyamalam, Mataram!**
**Vande Mataram!**
**Shubhrajyotsna pulakitayaminim,**
**Phullakusumita drumadala shobhinim,**
**Suhasinim sumadhura bhashinim,**
**Sukhadam varadam, Mataram!**
**Vande Mataram, Vande Mataram!**

**- Bankimchandra Chatterji**

AP SCERT

## జాతీయ జెండా రూపకర్త



**పింగళి వెంకయ్యగారు** 1876 ఆగస్టు 2న కృష్ణా జిల్లాలోని భట్లపెనుమర్రు గ్రామంలో జన్మించారు. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశానికి తగిన జాతీయ జెండా అవసరాన్ని గుర్తించిన పింగళి వెంకయ్య గారు అనేక నమూనాలను రూపొందించారు. 1921లో విజయవాడలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో మహాత్మాగాంధీకి ఆయన జెండా నమూనాను సమర్పించారు. గాంధీజీ సూచనల మేరకు జెండాలో మార్పులు చేసి, త్రివర్ణ పతాకాన్ని రూపొందించారు.


https://amaravathiteacher.com

# Our National Anthem | జాతీయ గీతం

Jana-gana-mana-adhinayaka jaya he
Bharata-bhagya-vidhata
Panjaba-Sindhu-Gujarata-Maratha
Dravida-Utkala-Banga
Vindhya-Himachala-Yamuna-Ganga
uchchala-jaladhi-taranga
Tava Subha name jage,
tava subha asisa mage,
gahe tava jaya-gatha.
Jana-gana-mangala-dayaka jaya he
Bharata-bhagya-vidhata.
Jaya he, Jaya he, Jaya he,
jaya jaya jaya jaya he.

- Rabindranath Tagore

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్యవిధాతా!
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కళ, వంగా!
వింధ్య, హిమాచల, యమునా, గంగా!
ఉచ్ఛల జలధి తరంగా!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాంగే
గాహే తవ జయగాథా!
జనగణ మంగళదాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!!

– రవీంద్రనాథ్ ఠాగూర్

AP SCERT

# Pledge | ప్రతిజ్ఞ

*India is my country. All Indians are my brothers and sisters.*
*I love my country and I am proud of its rich and varied heritage.*
*I shall always strive to be worthy of it.*
*I shall give my parents, teachers and all elders respect,*
*and treat everyone with courtesy. I shall be kind to animals.*
*To my country and my people, I pledge my devotion.*
*In their well-being and prosperity alone lies my happiness.*

*- Pydimarri Venkata Subba Rao*

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం.
దీనికి అర్హత పొందడానికై సర్వదా నేను కృషి చేస్తాను.
నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.
జంతువులపట్ల దయతో ఉంటాను.
నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.
వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

– పైడిమర్రి వెంకట సుబ్బారావు


https://amaravathiteacher.com

## జాతీయ విద్యా విధానం 2020

జాతీయ విద్యా విధానం 2020 సమగ్రమైనది, సౌలభ్యమైనది మరియు విద్యార్థి-కేంద్రీకృత విద్యా వ్యవస్థను నిర్మిస్తుంది. ఇది సామర్థ్యాధారిత అభ్యసనం మరియు అనుభవాత్మక విధానాలను బలంగా నొక్కి చెబుతుంది, దీనివల్ల విద్య ఆకర్షణీయంగా మరియు అర్థవంతంగా ఉంటుంది.

జాతీయ విద్యా విధానం 2020 ప్రస్తుత 21వ శతాబ్దపు నైపుణ్యాలపై దృష్టి సారిస్తుంది.

- విమర్శనాత్మక ఆలోచన
- సృజనాత్మకత
- సమాచారం
- సమస్య పరిష్కారం ముఖ్యమైనవి.

ఇది నిజ జీవిత అభ్యసనం ఆవిష్కరణలు, సాంకేతికతాధారిత బోధనా విధానాలను ప్రోత్సహిస్తుంది. స్థూలంగా, ఈ విధానం సమ్మిళిత విద్యను మరియు భవిష్యత్తుకు సిద్ధమైన విద్యా వ్యవస్థ నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇది వేగంగా మారుతున్న ప్రపంచంలో ప్రతి విద్యార్థి విజయవంతం కావడాన్ని శక్తివంతం చేస్తుంది. ఇది భారతదేశ విద్యా రంగంలో ఒక పెద్ద మార్పు తీసుకొచ్చే దిశగా అడుగులు వేస్తోంది.

## राष्ट्रीय शिक्षा नीति 2020 (NEP 2020)

राष्ट्रीय शिक्षा नीति 2020 एक समग्र लचीली और विद्यार्थी केंद्रित शिक्षा प्रणाली की परिकल्पना करती है। यह क्षमता - आधारित अधिगम(Competency - based learning) और अनुभवात्मक दृष्टिकोण पर जोर देती है, जिस से शिक्षा अर्थपूर्ण और रोचक बनती है। NEP 2020 में 21 वीं सदी के कौशलों जैसे अलोचनात्मक सोच (Critical Thinking), सृजनात्मकता (Creativity), संप्रेषण कौशल (Communication Skill) और समस्या समाधान कौशल (Problem Solving Skill) के महत्व को प्रमुख रूप से रेखांकित किया गया है।

यह वास्तविक जीवन से जुड़े अधिगम, नवाचार और प्रौद्योगिकी - सक्षम शिक्षण पद्धतियों के समन्वय को प्रोत्साहित करती है। कुल मिलाकर, यह नीति एक ऐसी समावेशी और भविष्य के लिए तैयार शिक्षा प्रणाली के निर्माण का लक्ष्य रखती है, जो तेजी से बदलती दुनिया में प्रत्येक शिक्षार्थि को सफल होने के लिए सशक्त बनाती है।

## The National Education Policy 2020 (NEP 2020)

The National Education Policy 2020 (NEP 2020) envisions a holistic, flexible, and learner-centred education system. It emphasizes competency-based learning and experiential approaches that make education meaningful and engaging. NEP 2020 highlights the importance of 21st-century skills such as critical thinking, creativity, communication, and problem-solving. It encourages the integration of real-life learning, innovation, and technology-enabled pedagogies. Overall, the policy aims to build an inclusive and future-ready education system that empowers every learner to thrive in a rapidly changing world.

AP SCERT



https://amaravathiteacher.com

## సాధించాల్సిన సామర్థ్యాలు

### 1. అవగాహన ప్రతిస్పందన :

విన్న, చూసిన, చదివిన వాటిని అర్థం చేసుకొని ప్రతిస్పందించడం :

పిల్లలు తమ స్థాయికి తగిన ముద్రిత, అముద్రిత అంశాలలోగల పరిచిత, అపరిచిత గేయాలు, కథలు, సంభాషణలు, ఉపన్యాసాలు, చర్చలు వంటివి శ్రద్ధగా విని అర్థంచేసుకొని వాటితో తమ పూర్వజ్ఞానంతో మేళవించుకోగలగాలి. అడిగిన ప్రశ్నలకు సరైనరీతిలో క్రమపద్ధతిలో జవాబులు చెప్పగలగాలి.

### 2. వ్యక్తీకరణ – సృజనాత్మకత :

విన్న, చూసిన, చదివిన విషయాలను సొంతమాటల్లో రాయడం.

పాఠ్యాంశాలలోని, అభ్యాసాలలోని అంశాలకు విషయాలను సొంతమాటల్లో సంక్షిప్తీకరించటం, విశదీకరించటం, వివరించడం, తాత్పర్యాలు, సారాంశాలు రాయడం పాత్రలస్వభావాలు, సంఘటనలు, కవులు, రచయితలగురించి సొంతమాటల్లో రాయడం. రాసేటప్పుడు – అక్షర దోషాలు లేకుండా, క్రమపద్ధతిలో విరామ చిహ్నాలు ఉపయోగించి సొంతంగా రాయడం.

స్వీయ అనుభవాలను సృజనాత్మకంగా వ్యక్తపరచడం.

అ) ప్రక్రియను ఒక రూపం నుంచి మరొకరూపంలోకి మార్చడం, సమీక్షలు, వ్యాసాలు, ఇంటర్వ్యూలు, కరపత్రాలు, నివేదికలు రాయడం, దరఖాస్తులు రాయడం, ఆత్మకథలు రాయడం, నాటకీకరణ, నినాదాలు, భాషాసంఘాలు ఏర్పాటుచేయడం, సాహిత్యసమావేశాలు నిర్వహించడం.

ఆ) ఇతరుల సంస్కృతి సంప్రదాయాలు, పండుగలు, ఆచార వ్యవహారాలపట్ల (అన్ని అంశాలలో) సహానుభూతి కలిగి ఉండటం. కవులు, వారి రచనలు ప్రశంసించడం, వివిధ సాహితీ ప్రక్రియలను చదవటం, ఆనందానుభూతి, రసానుభూతి పొంది, కవులను, పాఠంలోని మంచి విషయాలను ప్రశంసించడం.

ఇ) ప్రత్యేక అవసరాలు గల పిల్లల/బాలికలు పట్ల సహానుభూతి కలిగిఉండి, సహాయసహకారాలు అందించడం.

### 3. భాషాంశాలు (పదజాలం వ్యాకరణాంశాలు) :

పద స్వరూప స్వభావాలను తెలుసుకోవడం, తార్కికశక్తిని, దోషరహిత భావప్రకటన సామర్థ్యాన్ని పెంపొందించడం.

అ) భాషాబోధనలో పిల్లల్లో సుసంపన్నమైన పదజాలాభివృద్ధికి ప్రాధాన్యతనివ్వడం. పదాలకు అర్థాలకు నిఘంటువును వినియోగించడం, వ్యతిరేక పదాలు, ప్రకృతి–వికృతి, జాతీయాలు వంటి వాటిని అర్థంచేసుకుని నిత్యజీవితంలో సందర్భోచితంగా ఉపయోగించటం.

ఆ) విద్యార్థి భాషాభాగాలు, విభక్తులు పదాలను కలపడం, విడదీయడం మొదలైనవి చేస్తున్నప్పుడు జరిగే మార్పులను గుర్తించడం, సంధులను సూత్రీకరించటం, పదాలలో ఉండే సమాసాలను గుర్తించగలగటం.

ఇ) సాహిత్యంలో ఉన్న వివిధ ప్రక్రియల యొక్క స్వరూప, స్వభావాలను గుర్తించగలగటం, సొంతంగా రాయగలగడం.

ఈ) వాక్యనిర్మాణం, వాక్యంలోని అంతర్భాగాలను, వాక్యాలలోని రకాలను గ్రహించగలగడం.

ఉ) వ్యాకరణాంశాలలో వర్ణమాలలోని అచ్చులు, హల్లులు, ఉభయాక్షరాలు, భాషాభాగాలు, కర్త, కర్మ, క్రియలు మొదలైన భాషకు సంబంధించిన ప్రాథమిక అంశాలను తెలుసుకోవడం ద్వారా భాషపై అధికారాన్ని సంపాదించడం.

AP SCERT


https://amaravathiteacher.com

# తెలుగు సౌరభం - 7

## ఏడవ తరగతి (ప్రథమ భాష)

## సెమిస్టర్ - 1


| క్ర.సం. | పాఠం | ప్రక్రియ | ఇతివృత్తం | కవి / రచయిత | మాసం | పుట |
|---|---|---|---|---|---|---|
| | పాఠ్య ప్రణాళిక లక్ష్యాలు | | | | | 02 |
| | సంసిద్ధత కార్యక్రమం | | | | జూన్ | 04 |
| 1. | అక్షరం | వచన కవిత | చదువు విశిష్టత | రావినూతల ప్రేమకిషోర్ | జూలై | 31 |
| 2. | మాయాకంబళి | జానపదకథ | మానవ స్వభావం | కలువకొలను సదానంద | ఆగస్టు | 42 |
| 3. | చిన్నిశిశువు | పదకవిత | శైశవ వర్ణన | తాళ్ళపాక అన్నమయ్య | ఆగస్టు | 53 |
| 4. | మర్రిచెట్టు | స్వగతం/ స్కెచ్ | సహానుభూతి | త్రిపురనేని గోపీచంద్ | సెప్టెంబర్ | 63 |
| 5. | పద్య పరిమళం | శతకం | నైతికవిలువలు | శతక కవులు | అక్టోబర్ | 78 |
| 6. | మన విశిష్ట ఉత్సవాలు (ఉపవాచకం) | వ్యాసం | సంస్కృతి – సంప్రదాయాలు | రచయితల బృందం | | 91 |
| | 1. సిరిమానోత్సవం | | | | జూలై | |
| | 2. గుణదల మేరీమాత ఉత్సవం | | | | జూలై | |
| | 3. కోటప్పకొండ ప్రభల తిరునాళ్ళు | | | | ఆగస్టు | |
| | 4. రొట్టెల పండుగ | | | | ఆగస్టు | |
| | 5. అహోబిలం పార్వేట ఉత్సవం | | | | సెప్టెంబర్ | |
| | 6. లేపాక్షి ఉత్సవాలు | | | | అక్టోబర్ | |
| | పదవిజ్ఞానం | | | | | 98 |
| | భావనా పటం | | | | | 101 |


Teacher Corner H6R9U8

Student Corner R5S7N1

సంస్కృతం కాంపోజిట్‌కోర్సుగా చదివేవారు ఉపవాచకం మినహా అన్ని పాఠ్యాంశాలను చదవాలి.

✶ నక్షత్రం గుర్తుఉన్న పద్యాలను విద్యార్థులు కంఠస్థం చేయాలి.

AP SCERT

https://amaravathiteacher.com

## పాఠ్య ప్రణాళిక లక్ష్యాలు

**పాఠ్య ప్రణాళికా లక్ష్యం-1 :**

- వివరణ, విశ్లేషణ ప్రతిస్పందనల కోసం భాషానైపుణ్యాలను అభివృద్ధి చేయడం.
- ముఖ్యాంశాలను గుర్తించి, సంక్షిప్తంగా వివరించడం.
- తగిన భాషతో సందర్భానికి తగిన ప్రశ్నలను చదివి అవగాహన చేసుకోవడం.
- వివిధ రకాల లేఖలు, వ్యాసాలు, నివేదికల గురించి తెలుసుకుని చదవడం.
- అవసరానికి తగిన విధంగా ఆడియో, వీడియో, పోస్టర్ వంటి ముద్రిత రూపాలు గుర్తించి తెలుసుకోవడం.

**పాఠ్య ప్రణాళికా లక్ష్యం-2 :**

- సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని అన్వేషణ ద్వారా అభినందించడం.
- కథలు, గేయాలు, కవిత్వాలు, నాటకాలు వంటి ప్రక్రియల శైలులను గుర్తించి, అభినందించడం.
- భిన్నమైన సామాజిక, సాంస్కృతిక కోణాలలో భావాలు వ్యక్తపరచడం.

**పాఠ్య ప్రణాళికా లక్ష్యం-3 :**

- భాషా నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక అంశాలను వినియోగించడం.
- విరామ చిహ్నాలు, భాషాభాగాలు, లింగం, వచనం, కాలం, వాక్య నిర్మాణం అవగాహనతో వినియోగించడం

**పాఠ్య ప్రణాళికా లక్ష్యం-4 :**

- కథలు, పుస్తకాలపై సమీక్ష చేయడం, గ్రంథాలయ సద్వినియోగం.
- సాహిత్యంలోని అన్ని ప్రక్రియలు చదివి సమీక్ష చేయడం.
- ప్రాజెక్టులు, మరియు నివేదికలు వంటి కార్యకలాపాలకు గ్రంథాలయాన్ని ఉపయోగించడం.

**పాఠ్య ప్రణాళికా లక్ష్యం-5 :**

- భాష యొక్క ప్రత్యేక లక్షణాలను గుర్తించి, అభినందించడం మరియు వినియోగించడం.
- పదాలకు అర్థాలు, సమానార్థక పదాలు, నానార్థాలు, ప్రకృతి, వికృతులు అర్థం చేసుకుని వినియోగించడం.
- భాషలో ఉన్న అక్షరాలు, స్వరాలు ఉచ్చారణ, పారిభాషిక పదాలు అర్థం చేసుకోవడం, అభినందించడం.
- పద ప్రయోగాలు, అనుప్రాసలు పూరించడం, రూపొందించడం.
- పదక్రీడలు, వాక్య పూరణలు, అంత్యాక్షరి పూరించడం, రూపొందించడం.
- సమాసం, సంధి, క్రియ రూపాలు అర్థం చేసుకోవడం, వినియోగించడం.

AP SCERT



https://amaravathiteacher.com

# సంసిద్ధత కార్యక్రమం

AP SCERT

# 7వ తరగతి - సంసిద్ధత కార్యక్రమము - (జూన్ - 2026)

| సంసిద్ధత కార్యాచరణ | 1వ రోజు | (ఉపాధ్యాయ కృత్యములు) |
|---|---|---|

**అభ్యసన ఫలితాలు :** వర్ణమాలలోని అక్షరాలను గుర్తించగలరు.
రెండు, మూడు, నాలుగు అక్షరాల సరళ పదాలను చదవగలరు.

**సంభాషణ :** తరగతి ప్రారంభించే ముందు ఏదైనా అంశాలపై పిల్లలతో సంభాషించండి. వర్ణమాల చార్టులోని అక్షరాలను చూపిస్తూ నిత్య జీవితంలో ఉపయోగించే సరళ పదాలను చెప్పించండి.

U3D4J4

### కృత్యం -1: వర్ణమాలలోని అక్షరాలను గుర్తింప చేయడం.

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ
ఎ ఏ ఐ ఒ ఓ ఔ అం అః
క ఖ గ ఘ ఙ
చ ౘ ఛ ౙ జ ఝ ఞ
ట ఠ డ ఢ ణ
త థ ద ధ న
ప ఫ బ భ మ
య ర ల వ శ ష స హ ళ క్ష ఱ

గమనిక : ప్రస్తుతం ఌ ౡ ౘ, ౙ వినియోగంలో లేవు.

AP SCERT

### కృత్యం -2 : వర్ణమాలలోని అక్షరాలతో ఏర్పడే సరళ పదాలను విద్యార్థులచే చదివించండి.

| రెండక్షరాల పదాలు | | మూడక్షరాల పదాలు | | నాలుగక్షరాల పదాలు | | 'ం'తో కూడిన పదాలు | |
|---|---|---|---|---|---|---|---|
| కల | అల | అరక | చరక | అలమర | ఆచరణ | అందం | ఇంధనం |
| ఇల | పగ | మసక | పడక | ఇవతల | పడమర | రణం | పవనం |
| తల | వల | కలక | గడప | తలగడ | వదలక | నయనం | పంజరం |
| జడ | ఓడ | పడవ | తబల | సహచర | నరహర | నరకం | కంకణం |
| దయ | వడ | వరద | శనగ | దశరథ | కదలక | పంతం | నందనం |
| నవ | మన | మడమ | తపన | ఆచరణ | పరంపర | సగం | బలగం |
| పర | క్షమ | దవడ | ఇతర | పరవశం | కలవరం | జగడం | కంకర |
| లత | లయ | రచన | రక్షణ | అవసరం | మడవడం | సంబరం | అందరం |

### కృత్యం -3 : సరళ పదాలను విద్యార్థులచే చదివించండి.

| | | | | |
|---|---|---|---|---|
| గణగణగంట | చకచకనడక | ఉడతలజంట | పరమతసహనం | ఊదలఊయల |
| టకటకపనులు | ఉమపలక | నందనవనం | మడతమంచం | అలకలసంబరం |



https://amaravathiteacher.com

**కృత్యం -1 : కింది అక్షరాలను చదువుదాం. అక్షరాలతో పదాలు రాద్దాం.**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఉ | ______ | ర | ______ | న | ______ | త | ______ |
| క | ______ | స | ______ | బ | ______ | జ | ______ |
| శ | ______ | ల | ______ | డ | ______ | గ | ______ |
| అ | ______ | ప | ______ | వ | ______ | మ | ______ |

**కృత్యం -2 : కింది అక్షరాలను కలిపి చదవండి, రాయండి.**

జ — లజ ______
జ — నం ______
జ — డ ______
జ — గడం ______

వ — డ ______
ఆమ — డ ______
తలగ — డ ______
రగ — డ ______

**కృత్యం -3 : కింది పదాలను చదవండి. ఈ, ద, గ, ట, డ, త అక్షరాలను గుర్తించి ◯ చుట్టండి.**

1. ఈగలు
2. చందమామ
3. దయామయుడు
4. ఆట
5. తడబాటు
6. పండగ

**కృత్యం -4. కింది పదాలను జతపరచండి. వాక్యాలుగా రాయండి.**



చక చక - వణకడం ..................................
గజ గజ - నమలడం ..................................
కర కర - ఏడవడం ..................................
వలవల - నడవడం ..................................

**కృత్యం -5. రెండక్షరాల, మూడక్షరాల పదాల ఉక్తలేఖనం రాయండి.**

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______

APSCERT



https://amaravathiteacher.com

**అభ్యసన ఫలితాలు :** వర్ణమాలలోని అక్షరాలను గుర్తించగలరు.

రెండు, మూడు, నాలుగు అక్షరాల సరళ పదాలను చదవగలరు.

**కృత్యం -1 : వర్ణమాలలోని కింది అక్షరాలను గుర్తింప చేయండి**

ల, ర, జ, క, ఉ, త, న, మ, వ,శ, స, ధ, ఫ, ఈ, ఏ,య

**కృత్యం -2 కింది పదాలను పిల్లలతో చదివించండి.**

| రెండక్షరాల పదాలు | | మూడక్షరాల పదాలు | | నాలుగక్షరాల పదాలు | |
|---|---|---|---|---|---|
| దడ | గడ | కడప | పడక | కలకల | వలవల |
| నగ | పగ | నడక | నడత | కరకర | పరపర |
| ఊక | ఊత | ఆపద | అటక | అలసట | అవతల |
| ఓడ | ఔర | గడప | పడగ | దడదడ | గరగర |
| లయ | జయ | దవడ | ఆవడ | ఎగరటం | ఎదగడం |

**కృత్యం -3: కింది వాక్యాలను పిల్లలతో చదివించండి.**

చకచక నడవడం అవసరం

గబగబ చదవడం అవసరం

ఈ పలక వనజ పలక

ఆ పలక అమల పలక

మనం కరకర నమలగలం

మనం గలగల పలకగలం



**కృత్యం – 4: నిన్నటి వరకు నేర్పిన పదాలపై ఉక్తలేఖనం నిర్వహించాలి.**

1. ______ 6. ______

2. ______ 7. ______

3. ______ 8. ______

4. ______ 9. ______

5. ______ 10. ______

AP SCERT



https://amaravathiteacher.com

**కృత్యం -1: కింది గళ్ళలోని అక్షరాలను చదువుదాం. అక్షరాలతో ఏర్పడే పదాలను రాద్దాం.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| క | ల | స | అ | ర | న |
| ఊ | త | బ | చ | క | గ |
| ఈ | ఆ | ప | మ | జ | డ |
| ఐ | స | య | ఏ | ఖ | వ |
| ద | ఫ | ఋ | ట | శ | ఇ |

______________________

______________________

______________________

______________________

______________________

**కృత్యం -2 : కింది పదాలను చదువుదాం. అక్షరాలతో మొదలయ్యే పదాలను రాద్దాం.**

ఊక  పడవ  కడప  ఊతం  పనస  ఊయల  పగ  కలప

వడ  జలజ  వస  జనం  కరకర  వండడం  జగడం

| జ | ప | క | ఊ | ద |
|---|---|---|---|---|
| | | | | |

**కృత్యం -3 : కింది అక్షరాలను కలిపి రాద్దాం.**

న, మ, త, ప — డక

______________________

______________________

______________________

______________________

అర, పర, పల, అల — క

______________________

______________________

______________________

______________________

కడ — వ, లి, ప, కు

______________________

______________________

______________________

______________________

ఊ — క, డ, ట, చ

______________________

______________________

______________________

______________________

AP SCERT



https://amaravathiteacher.com

**అభ్యసన ఫలితాలు :** గుణింత అక్షరాలను గుర్తించగలరు.

గుణింత అక్షరాల పదాలను చదవగలరు.

**ఉపాధ్యాయులు : పొల్లు అక్షరం గురించి వివరించి, హల్లు నేర్పడం చేయాలి.**

| ✓ | ా | ి | ీ | ు | ూ | ృ | ౄ |
|---|---|---|---|---|---|---|---|
| క్ + అ | క్ + ఆ | క్ + ఇ | క్ + ఈ | క్ + ఉ | క్ + ఊ | క్ + ఋ | క్ + ౠ |
| క | కా | కి | కీ | కు | కూ | కృ | కౄ |

**కృత్యం -1: గేయం లోని గుణింతాక్షరాల కింద గీత గీయండి.**

ఊరు వాడ తిరగండి
పూలు కాయలు ఏరండి
వీరికి వారికి పంచండి

ఆటలు బాగా ఆడండి
పాటలు బాగా పాడండి
చదువులు బాగా చదవండి

**కృత్యం -2: కీలక పదాలు చదవండి.**

| ✓ | ా | ి | ీ | ు | ూ | ృ |
|---|---|---|---|---|---|---|
| మడత | పానకం | కిటికి | కీటకం | గురువు | బూర | కృష్ణుడు |
| దవడ | దారం | చిలక | చీకటి | కుడుము | కూర | కృషి |
| రమణ | గాయం | పిలక | దీపం | తుపాకి | పూజారి | మృగం |
| పలక | జాగారం | నివాసం | నీరసం | పులి | చూరు | గృహం |
| వరద | తామర | సింహం | మీగడ | ముడుపు | మూర | కృప |

AP SCERT

**కృత్యం -3 : గేయాన్ని చదవండి.**

ఆటలు మనమూ ఆడుదాం
పాటలు బాగా పాడుదాం
ఆటల పాటలతో పాటు
అందరు కలిసి చదువుదాం.



**కృత్యం -4 : గేయాన్ని చదవండి.**

పూజకు పూలు కోసుకుని
గుడిలో దేవుని ముందుంచి
వానలు బాగా కురవాలి
పంటలు బాగా పండాలి
అందరు కలసి కృషి చేసి
ఆనందంగా ఉండాలని కోరుదాం.



https://amaravathiteacher.com

## కృత్యం -1 : పదాలు చదవండి.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| కలం | - | కాలం | చిలిపి | - | చీలిక | కనుక | - | కానుక |
| జిలకర | - | జీతం | గడ | - | గాలం | దినం | - | దీనం |
| జడ | - | జాము | నివాసం | - | నీరసం | తల | - | తాత |
| తిండి | - | తీరం | దడ | - | దారం | కిటికీ | - | కీటకం |
| పగ | - | పాట | గింజ | - | గీతం | మగ | - | మామ |
| పిలక | - | పీట | | | | | | |

## కృత్యం -2 : పదాలను చదివి జతపరిచి రాయండి .

| | | |
|---|---|---|
| అరటి | పాలు | ______________________ |
| ఆవు | గంట | ______________________ |
| బడి | మంట | ______________________ |
| చలి | సీసా | ______________________ |
| పాల | మీసం | ______________________ |
| పాడి | పంటలు | ______________________ |
| తాత | కాయ | ______________________ |

## కృత్యం -3 : పట్టిక చూసి వాక్యాలు చదవండి రాయండి.

| | | |
|---|---|---|
| నాకు | కాయ | కావాలి |
| | మామిడికాయ | |
| | జామకాయ | |
| | చింతకాయ | |
| | బీరకాయ | |
| | మిరపకాయ | |

## కృత్యం - 4 : క్రింది పదాలలోని గుణింతాక్షరాలను గుర్తించి గీత గీయండి.

ఉదా : <u>మి</u> <u>రి</u> <u>యా</u> ల <u>చా</u> <u>రు</u>

1. గడసరి వదిన
2. ముదిరిన రోగం
3. పెరుగు పులుపు
4. మందారం ఎరుపు
5. కాకి అరిచింది

## కృత్యం - 5 : అక్షరాలకు గుణింతాన్ని రాయండి.

| ✓ | క | జ | మ | ట | త | ప | య | ర | ళ | డ | ద |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ా | | | | | | | | | | | |
| ి | | | | | | | | | | | |
| ీ | | | | | | | | | | | |
| ు | | | | | | | | | | | |
| ూ | | | | | | | | | | | |
| ృ | | | | | | | | | | | |
| ౄ | | | | | | | | | | | |

AP SCERT



https://amaravathiteacher.com

**అభ్యసన ఫలితాలు :** గుణింత అక్షరాలను గుర్తించగలరు.
గుణింత అక్షరాల పదాలను చదవగలరు.

**కృత్యం -1 : కింది గేయం చదవండి. గుణింత అక్షరాల క్రింద గీత గీయండి.**

కుందేలు, తాబేలు
పందెమేసుకుని
చెరువు నుండి కొండ దాకా
పరుగెడుతుంటే
కుందేలు చెంగుచెంగున ఎగిరి
ముందుగా ముందుకు సాగింది.
వెనుకకు తిరిగి చూసింది
తాబేలు ఇంకా రాలేదని
కాసేపు కునుకు తీసింది
కాసేపటికి మేలుకుని
ఉలికిపడి లేచింది
ముందుకు సాగే కుందేలును చూసింది
ఇంకేముంది! ఇంకేముంది!
తాబేలు ముందుకు నడిచింది
పందెంలోన గెలిచింది

**కృత్యం - 2 : కింది అక్షరాలను తేడా గుర్తిస్తూ చదవండి.**

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| కె | కే | చె | చే | టె | టే | తె | తే | పె | పే | యె | యే |
| ఖె | ఖే | ఛె | ఛే | ఠె | ఠే | థె | థే | ఫె | ఫే | రె | రే |
| గె | గే | జె | జే | డె | డే | దె | దే | బె | బే | లె | లే |
| ఘె | ఘే | ఝె | ఝే | ఢె | ఢే | ధె | ధే | భె | భే | వె | వే |

**కృత్యం -3 : కింది వాక్యాలు చదవండి.**

కొంగ, కోడి కలిశాయి
కోతీ, మేకను పిలిచాయి
ఊరు చివరకు చేరాయి
బొంగరాలాట ఆడాయి
తోటలోన తొండ ఉంది
కొండమీద కోతి ఉంది
చెరువులోన కొంగ ఉంది
మడుగులోన మొసలిఉంది.



AP SCERT



https://amaravathiteacher.com

**కృత్యం -1 : కింది అక్షరాలకు ఐత్వం ( ై ), ఔత్వం ( ౌ ) లను చేర్చి రాయండి.**

| ✓ | బ | గ | చ | త | న | స |
|---|---|---|---|---|---|---|
| ఐత్వం(   ) | | | | | | |
| ఔత్వం(   ) | | | | | | |

**కృత్యం -2 : కింది పదాలను చదవండి.**

మైదానం    కౌరవులు    మైసూరు    చౌకబేరం    దైవబలం

కౌతవరం    నైలునది    మౌనవతనం    కైకలూరు    నైషధం

**కృత్యం -3 : ఐత్వం ( ై ), ఔత్వం ( ౌ ) వచ్చే అక్షరాలతో పదాలను రాయండి.**

కైక    గౌను    ________    ________

________    ________    ________    ________

________    ________    ________    ________

________    ________    ________    ________

**కృత్యం -4 : కింది పేరాను చదవండి. ఖాళీలను పూరించండి.**

అనగనగా ఒక రైతు. ఆ రైతుకు ఐదు ఎకరాల పొలం ఉంది. పొలంలో ఆ రైతు బాగా పనిచేసే వాడు. పంటలు బాగా పండించేవాడు. గౌరవంగా నివసించేవాడు.

1. పొలంలో .................... బాగా పనిచేసేవాడు.
2. ....................... బాగా పండించేవాడు.
3. రైతు ........................... గా నివసించేవాడు.



AP SCERT



https://amaravathiteacher.com

**అభ్యసన ఫలితాలు :** గుణింత అక్షరాలను గుర్తించగలరు.
గుణింత అక్షరాల పదాలను చదవగలరు.

## కృత్యం – 1 : గేయాన్ని చదివి గుణింత అక్షరాల క్రింద గీత గీయించండి.

ఎగిరెదవెందుకే చిలుకాచిలుక
లోకం చూడగ కోరిక కనుక
పలికెదవెందుకే చిలుకా చిలుక
ఊహలు చెప్పగ మనసగు కనుక
అలిగెదవెందుకే చిలుకా చిలుక
కాయలు పండ్లు ఈయడు గనుక




## కృత్యం – 2 జంట పదాలు చదివించండి.

| | | | | |
|---|---|---|---|---|
| అందచందాలు | చీటికిమాటికి | ఇంచుమించు | చీకటి వెలుగు | ఊరువాడ |
| పాడిపంట | ఎండ వాన | వెండి బంగారం | కలిమిలేమి | మాట మంతి |

## కృత్యం – 3. కింది వాక్యాలు చదివించండి.

ఊరు వాడ తిరగండి
పూలు కాయలు ఏరండి
వీరికి వారికి పంచండి
ఆటలు బాగా ఆడండి
పాటలు బాగా పాడండి
చదువులు బాగా చదవండి



## కృత్యం–4: నిన్నటి వరకు నేర్చిన పదాలపై ఉక్తలేఖనం నిర్వహించాలి.

AP SCERT



https://amaravathiteacher.com

**కృత్యం 1: కింది అక్షరాలకు గుణింతాలు రాయండి.**

క : ..................................................................................................

చ : ..................................................................................................

ట : ..................................................................................................

త : ..................................................................................................

ప : ..................................................................................................

**కృత్యం – 2 : కింది పదాలను చదవండి. పట్టికలో అడిగిన విధంగా వేరు చేసి రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| కాకర | పిలక | ముడత | బాలిక | తిలకం |
| నూరు | జాతర | చూరు | కిరణం | వారం |
| సూచన | గునపం | బుడగ | దూరం | కురచ |

| ా తో మొదలయ్యే పదాలు | ి తో మొదలయ్యే పదాలు | ు తో మొదలయ్యే పదాలు | ూ తో మొదలయ్యే పదాలు |
|---|---|---|---|
| | | | |

**కృత్యం–3 : పట్టిక చూసి వాక్యాలు చదవండి రాయండి.**

| | | |
|---|---|---|
| నాకు | ఐదు రూపాయలు | కావాలి |
| | బంతిపూలు | |
| | టీవి | |
| | పావురం | |
| | మురుకులు | |
| | టపాసులు | |

1) ..................................................

2) ..................................................

3) ..................................................

4) ..................................................

5) ..................................................

**కృత్యం – 4 : కథ చదవండి జవాబులు చెప్పండి (పూర్ణ బిందువు(ం) పరిచయం కొరకు).**

గోపాల్ టోపీలు తీసుకుని పోతూ ఉంటాడంట. ఎండ బాగా వుందట. ఎండకు బాగా అలసి పోయాడంట. తోటలో కునుకు తీశాడంట. టోపీల గంపని ఒక కోతి చూసిందంట. టోపీలు తీసుకుని పోయిందంట.

మిగతా కోతులకు పంచిందంట. గోపాల్ లేచి టోపీల కోసం వెతికాడంట. కోతుల వంక చూసి టోపీలు నావని అడిగాడంట. కోతులు టోపీలు వదలక చూశాయంట. కోపంతో తన టోపీని విసిరేసాడంట. కోతులు కూడా టోపీలు విసిరేసాయంట. గోపాల్ టోపీలు ఏరుకొని పోయాడంట.

1. టోపీలు ఎవరివంట?
2. కోతి టోపీలు ఏం చేశాయంట?
3. గోపాల్ నిద్రలేచి ఏం చేశాడంట?
4. కోపంతో గోపాల్ ఏం చేశాడు?
5. కోతులు ఏం చేశాయి?

AP SCERT



https://amaravathiteacher.com

**అభ్యసన ఫలితాలు :** గుణింత పదాలను, వాక్యాలను చదవగలరు.

**కృత్యం - 1 : గుణింత పదాలు చదివించండి.**

అమరావతి  ఆటపాటలు  ఈదురుగాలి  ఉసిరికాయ  ఏకదంతుడు  కూరగాయలు
గాలిగోపురం  కైలాసగిరి  చెరుకు రసం  దేశముదురు  మేనకోడలు  యమునా నది
సోమరితనం  మామిడి పూత  హైదరాబాదు

**కృత్యం -2 : కింది వాక్యాలను చదివించండి.**

కాయ కాయ వంకాయ
ఈ సీసా పాలసీసా
కుసుమ పూలజడ బాగుంది
కొండమీద కోతి ఉంది
విమల పాఠం చదివింది
దొంగను ఖైదు చేశారు
కుందేలు పెంపుడు జంతువు
రైతును అందరూ గౌరవించాలి

పంచదార తింటే ఎలా ఉంటుందో!
పనస కాయ తింటే అలా ఉంటుందా?
ఊరగాయ తింటే ఎలా ఉంటుందో!
ఉసిరికాయ తింటే అలా ఉంటుందా?

**కృత్యం-3 : కింది గేయాన్ని పాడించండి.**

అమ్మా! అమ్మా! మా అమ్మ
చల్లని మనసు నీదమ్మా
చందమామను చూపిస్తావు
గోరుముద్దలు తినిపిస్తావు
బుడిబుడి నడకలు నడిపిస్తావు
కమ్మని కథలను వినిపిస్తావు
మాటలు ఎన్నో నేర్పిస్తావు
పాటలు ఎన్నో పాడిస్తావు
అమ్మా! అమ్మా! మా అమ్మ
చల్లని మనసు నీదమ్మా!



**కృత్యం-4 : నిన్నటి వరకు నేర్పిన పదాలపై ఉక్తలేఖనం నిర్వహించాలి.**

AP SCERT



https://amaravathiteacher.com

**కృత్యం -1 : కింది మహా ప్రాణాక్షరాలను గుణింతాలుగా రాయండి.**

ఖ : ..........................................................................................................

ఘ : ..........................................................................................................

ఛ : ..........................................................................................................

ఝ : ..........................................................................................................

ఠ : ..........................................................................................................

**కృత్యం-2 : కింది పదాలను చదవండి ప్రతి పదానికి 'ఉంది' , ' లేదు' చేర్చి రాయండి.**

ఉదాహరణ: బడి ఉంది, బడి లేదు.

పని తడిగా పొడిగా ఆకలిగా చలిగా పాలసీసా ఎండగా తలనొప్పిగా వేడిగా

**కృత్యం -3 : జతపరచండి చదవండి రాయండి.**

| | | |
|---|---|---|
| భోగి | దేశం | ______________________ |
| తెలుగు | జయంతి | ______________________ |
| గాంధీ | భాష | ______________________ |
| వన | మంట | ______________________ |
| భారత | భోజనం | ______________________ |

AP SCERT

**కృత్యం -4 : కింది పదాలను సరైన ఖాళీలలో ఉంచండి.**

| | | | |
|---|---|---|---|
| సమాధానం | భీముడు | తెలుగు భాష | భూకంపం |

1. భూమి కనిపించడాన్ని ......................................అంటారు.

2. ............................ ను జవాబు అని కూడా అంటారు.

3. బకాసురుడి కోసం ........................................బండిలో భోజనం తీసుకొచ్చాడు.

4. ................................................ ఎంతో మధురం.



https://amaravathiteacher.com

**అభ్యసన ఫలితాలు :** ద్విత్వాక్షర పదాలను, వాక్యాలను చదవగలరు.

**కృత్యం - 1 : కింది పదాలలో క గ చ జ ట డ ప ద న ద్విత్వాక్షర పదాలను గుర్తించండి.**

లెక్కలు దగ్గర ముచ్చట సజ్జలు అట్ట గుడ్డ విత్తనం జగ్గు కుక్క

సిద్ధం నాన్న వెన్నెల అద్దం నత్త గొడ్డలి జుట్టు బజ్జి నిచ్చెన

**కృత్యం - 2 : చదవండి. పలికించండి.**

తక్కువ ముగ్గులు కుచ్చులు బుజ్జాయి కోడిపెట్ట కబడ్డీ ఇత్తడి బొద్దింక సున్నం

కన్ను హద్దు మొత్తం పచ్చగడ్డి బొట్టు గజ్జెలు పిచ్చుక మొగ్గ ఎక్కాలు

రచ్చబండ బుజ్జి పాప

**కృత్యం-3 : వాక్యాలను చదివించండి.**



1. టక్కరి నక్క నక్కినక్కి చూసింది.
2. మచ్చల ఆవు మీద పిచ్చుక వాలింది.
3. బాబు బొజ్జనిండా మజ్జిగ తాగాడు.
4. చెట్టు కింద పుట్ట ఉంది.
5. రోడ్డు మీద పడ్డారు.
6. అత్త ఉత్తరం చదివింది.
7. పెద్దల మాట చద్ది మూట.
8. వెంకన్న జొన్న పంట వేశాడు.

**కృత్యం-4 : నిన్నటి వరకు నేర్పిన పదాలపై ఉక్తలేఖనం నిర్వహించాలి.**

AP SCERT



https://amaravathiteacher.com

**కృత్యం-1 : కింది పదాలలో ద్విత్వాక్షర పదాలు గుర్తించి ◯ చుట్టండి.**

చక్కదనం  రగ్గు  రచ్చ  మజ్జిగ  చిట్టెలుక  లడ్డు  కొత్త  ఖద్దరు  చిన్నవాడు  బెత్తము.

**కృత్యము -2 : కింది అక్షరాలను కలుపుతూ పదాలు చదవండి రాయండి.**

పి, పు, అ, గి, కొ → ట్ట

................
................
................
................
................

అ, ఉ, పు, చి, గ → చ్చు

................
................
................
................
................

**కృత్యము-3 : కింది పదాలను చదవండి. జతపరిచి రాయండి.**

1. ఎద్దుల  మోత
2. మద్దెల  బండి
3. పప్పు  జత
4. చెప్పుల  చారు

**కృత్యం-4 : కింది వాక్యాలలో కొన్ని అక్షరాలకు ఒత్తులు లేవు. సరైన ఒత్తులను చేర్చి రాయండి.**

1. చెటు తొరలో పాలపిట
2. ఎదుల బండి పోతుంది
3. పెదల మాట చదిమూట
4. ఉపులేని పపు చపగా ఉంటుంది.
5. అపు ఎపటికి ముపు.
6. అమ మాటలు కమని మాటలు.

AP SCERT



https://amaravathiteacher.com

**అభ్యసన ఫలితాలు :** ద్విత్వాక్షర పదాలను, వాక్యాలను చదవగలరు.

**కృత్యం – 1 : కింది పదాలలో ప బ మ య ర ల వ స అక్షరాల ఒత్తులు గుర్తించండి.**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| అప్పడం | అబ్బాయి | అమ్మాయి | రామయ్య | మర్రి | తల్లి | గవ్వ |
| బస్సు | దుప్పటి | కొబ్బరి | దానిమ్మ | తియ్యగ | కర్ర | నీళ్లు |

**కృత్యం – 2 : కింది పదాలు చదవండి.**

చెప్పులు ఇబ్బంది తొమ్మిది. రెబ్బలు బొమ్మ రొయ్య నిస్సారం

**కృత్యం – 3 : కింది వాక్యాలను చదవండి.**



1. గుళ్ళో పెళ్ళికి వెళ్ళి రండి
2. నవ్వుల పువ్వులు విరియాలి
3. ఇల్లాలు ఇల్లు అలుకుతుంది
4. మర్రి తొర్రలో పుర్రె ఉంది
5. ముందు నుయ్యి వెనుక గొయ్యి
6. అమ్మ చేతి వంట కమ్మగా ఉంటుంది
7. డబ్బాలో డబ్బులు దాచారు
8. ఎప్పుడు పడితే అప్పుడు చప్పుడు చేయకు

**కృత్యం – 4 : నిన్నటి వరకు నేర్పిన పదాలపై ఉక్తలేఖనం నిర్వహించాలి.**

AP SCERT



https://amaravathiteacher.com

**కృత్యం -1 : కింది పదాలలో గీత గీసిన అక్షరాల్లో తేడాలు గుర్తిస్తూ చదవండి.**

| | | |
|---|---|---|
| 1. కన తలి - కన్నతల్లి | 2. నాన - నాన్న | 3. గనేరు - గన్నేరు |
| 4. రొాయ - రొయ్య | 5. అనం - అన్నం | 6. ఎదు - ఎద్దు |
| 7. మరి - మర్రి | 8. అబుర - అబ్బుర | 9. అలరి - అల్లరి |
| 10. గువ - గువ్వ | 11. కుక - కుక్క | 12. మలి - మల్లి |

**కృత్యం - 2 : కింది క్రియా పదాలను చదవండి. సరి అయిన పదాన్ని ఉపయోగించి ఖాళీలు పూరించి వాక్యాన్ని రాయండి.**

పెట్టింది  వెళ్ళింది  తెచ్చింది  అల్లింది  ఇచ్చింది

1. వనజ పూల తోటకు ______________
2. మల్లెపూలను ఇంటికి ______________
3. పూలను అమ్మకు ______________
4. అమ్మ మల్లెపూలను ______________
5. వనజ జడలో ______________

**కృత్యం-3 : పదాలు జతపరచండి. వాక్యాలు రాయండి.**

| | | |
|---|---|---|
| 1. పూల సజ్జలో | గాలి తుస్సుమంది | 1. ______________ |
| 2. బస్సు టైర్లలో | ముద్దబంతి పూలు ఉన్నాయి | 2. ______________ |
| 3. పంట చేలో | పట్టుచీర ఉంది | 3. ______________ |
| 4. అట్టపెట్టెలో | పైరు వేశారు | 4. ______________ |

**కృత్యం - 4 : ఇలాంటి వాక్యాలు రాయండి.**

ఉదా : మల్లెపువ్వు తెల్లన

1. ______________ తెల్లన
2. ______________
3 . ______________

ఉదా : ముద్దబంతి పచ్చన

1. ______________
2. ______________
3. ______________

AP SCERT



https://amaravathiteacher.com

**అభ్యసన ఫలితాలు :** సంయుక్తాక్షరాలను గుర్తించగలరు. పదాలను, వాక్యాలను చదవగలరు.

**కృత్యం - 1 : కింది పదాలలోని సంయుక్తాక్షరాలను గుర్తింపచేయండి.**

స్కేలు - సర్కస్ - మార్గం - ఖడ్గం - కుర్చీ - లాల్చి - జడ్జి - దర్జ - ఇష్టం - చార్టు


వార్డు - బోర్డు - వర్ణం - చూర్ణం - నేస్తం - హస్తం - స్థానం - స్థిరం - నష్టం - కార్డు

**కృత్యం - 2 : కింది వాక్యాలను చదివించండి.**

1. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు
2. పవన్ కథల పుస్తకం లాస్యకు ఇచ్చాడు
3. ఆరోగ్యమే మహాభాగ్యం
4. అపర్ణ వర్ణమాల రాసింది
5. ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకం రాశాడు

**కృత్యం - 3 : గేయం చదివించండి.**

పొద్దున నిద్రలేవాలి - శ్రద్ధగా చదువులు చదవాలి
పళ్ళను బాగా తోమాలి - ముఖం శుచిగా కడగాలి
స్నానం చక్కగా చేయాలి - ఉతికిన బట్టలు తొడగాలి
తలను నున్నగా దువ్వాలి - పప్పు అన్నం తినాలి
గ్లాసుడు పాలు తాగాలి - వేళకు బడికి వెళ్ళాలి
గురువుకు దండం పెట్టాలి - పాఠం శ్రద్ధగా వినాలి
బడిలో చక్కగా చదవాలి - ఆడుతు పాడుతు చదవాలి
పరీక్ష బాగా రాయాలి - అమ్మకు పాఠం చెప్పాలి
అమ్మానాన్న మెచ్చాలి - అందరు బాగా పొగడాలి.




**కృత్యం - 4 : నిన్నటి వరకు నేర్పిన పదాలపై ఉక్తలేఖనం నిర్వహించాలి.**

AP SCERT



https://amaravathiteacher.com

**కృత్యం – 1: కింది పదాలలో సంయుక్తాక్షరాలను గుర్తించి ◯ చుట్టండి.**

ఉల్క పద్మ పుస్తకం సూర్యుడు కర్పూరం పర్వతం వస్తువు

రుక్మిణి ప్రభ కట్లపాము ఖడ్గం బల్బు సర్పం అర్థం.

**కృత్యం – 2 : సంయుక్తాక్షర పదాలు గుర్తించే విధానం తెలుసుకోండి.**

ప్ ర .............. ప్రభ జట్ కా .............. జట్కా రుక్ మిణి .............. రుక్మిణి

వ్ రతం .............. వ్రతం పర్ వతం .............. పర్వతం తూర్ పు .............. తూర్పు


**కృత్యం – 3 : కింది కథను చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ఒక ఊరి చివర పచ్చని మైదానంలో నాలుగు ఆవులు ఎంతో సఖ్యంగా స్నేహంగా ఉండేవి. అవి కలిసి గడ్డి మేయటం కలిసి తిరగటం చేసేవి. ఎప్పుడూ కలిసిమెలిసి గుంపు గానే ఉండేవి కాబట్టి పులులు, సింహాలు వీటిని చంపి తినలేకపోయేవి. కొంతకాలానికి ఏదో ఒక విషయంలో వాటి మధ్య దెబ్బలాట జరిగి నాలుగు ఆవులు నాలుగు వైపులా విడివిడిగా గడ్డి మెయ్యడానికి వెళ్లాయి. ఇదే సరైన సమయం అని పులి పొదల్లో దాక్కుని ఒక్కొక్క ఆవును చంపేశాయి.

ప్రశ్నలు :

1. ఊరిలో ఎన్ని ఆవులు ఉండేవి?
2. ఆవులన్నీ ఎలా ఉండేవి?
3. పులులు, సింహాలు ఆవులను ఎందుకు చంపి తినలేకపోయేవి?
4. ఈ కథలోని నీతి ఏమిటి?






AP SCERT



https://amaravathiteacher.com

**అభ్యసన ఫలితాలు :** పదాలను చదవగలరు, వాక్యాలను రాయగలరు.

**కృత్యం- 1 : కింది పదాలను చదివించండి. సరైన పదాలను ఖాళీలలో రాయించండి.**

| | | | | |
|---|---|---|---|---|
| వజ్రం | పొలం | ఫలితం | అజ్ఞాని | వివేకి |

సాన పెడితేనే ..................... కాంతి ఇస్తుంది. చక్కగా దున్నితేనే ..................... పంటనిస్తుంది. బాగా కష్టపడితేనే ..................... అందుతుంది. అలాగే భూమి మీద ఎంత ..................... అయినా చదువుకుంటే ..................... అవుతాడు.

**కృత్యం - 2 : కింది వాక్యాలు చదివి సరైన క్రమంలో రాయించండి.**

1. పాఠశాలకు ఉదయం 9 గంటలకు వెళ్లాను — 1) ______________
2. 7:30 నిమిషములకు ఉప్మా తిన్నాను. — 2) ______________
3. నేను ఉదయాన్నే 5 గంటలకు లేచాను — 3) ______________
4. ఏడు గంటల వరకు చదువుకున్నాను — 4) ______________
5. 7:15 నిమిషములకు స్నానం చేశాను — 5) ______________

**కృత్యం - 3 : కింది పదాలను ఉపయోగించి వాక్యాలు రాయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| చిన్న | పెద్ద | కొత్త | పాత | మంచి | నల్లని |

ఉదా : ఆకాశంలో నల్లని మబ్బులు కమ్మాయి.

.............................................................................................................

.............................................................................................................

.............................................................................................................

.............................................................................................................

.............................................................................................................

**కృత్యం - 4 : నిన్నటి వరకు నేర్చిన పదాలపై ఉక్తలేఖనం నిర్వహించాలి.**

AP SCERT



https://amaravathiteacher.com

**కృత్యం- 1 : కింది పదాలను చదవండి సంయుక్తాక్షరాలను ◯ చుట్టి గుర్తించండి.**

1. పగ్గం  2. పుణ్యం  3. అల్లం  4. చంద్రుడు  5. కీర్తి

**కృత్యం - 2 : కింది సూచనల ఆధారంగా 'కారం' తో అంతమయ్యే పదాలు రాయండి.**

1. ఎదుటి వారికి మేలు చేయడం..................కారం
2. ఎదుటివారిని గేలిచేయడం ...................కారం
3. దట్టమైన చీకటి...................... కారం
4. గర్వం అహంభావం......................... కారం

**కృత్యం - 3 : పేరాను చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.**

నాకు తెలుసు నువ్వు రాజు మామవని. పొద్దున్న నాన్న ఆల్బమ్ లో నీ ఫోటో చూపించి నువ్వు అనంతపురం నుంచి ఇక్కడికి వచ్చినావని చెప్పినాడని అన్నాడు. నవ్వు మొహంతో తొణుకు బెణుకు లేకుండా, వాడు అట్లా మాట్లాడుతూ ఉంటే నాకు ఒకటే ఆశ్చర్యం. అంతకన్నా ఆశ్చర్యం కేవలం మిత్రుడిని మాత్రమే అయినా నన్ను మామను చేయడం. వాళ్ళ పేర్లను అడిగాను చెరొక బిస్కెట్ ప్యాకెట్ అందిస్తూ..... పెద్దోడు బుజ్జి అని, చిన్నోడు చిన్న అని చెప్పాడు.

1. పిల్లలు రచయితను ఎలా గుర్తుపట్టారు?
2. పిల్లలు రచయితను ఏమని సంబోధించారు?
3. పిల్లల పేర్లు ఏవి?
4. రచయిత పిల్లలకు ఏమి బహుకరించారు?

**కృత్యం - 4 :ఉక్తలేఖనం రాయండి.**

| | | |
|---|---|---|
| 1. ________ | 6. ________ | 11. ________ |
| 2. ________ | 7. ________ | 12. ________ |
| 3. ________ | 8. ________ | 13. ________ |
| 4. ________ | 9. ________ | 14. ________ |
| 5. ________ | 10. ________ | 15. ________ |

AP SCERT



https://amaravathiteacher.com

**అభ్యసన ఫలితాలు :** గేయాన్ని సొంతంగా చదివి పాడగలరు. కథను చదివి అర్థం చేసుకోగలరు.

**కృత్యం – 1 : గేయాన్ని పాడండి. చెప్పించండి.**

పావురం సుందరం
ప్రేమింతుము అందరం
పావురం కాపురం
దేవుని గుడి గోపురం.




అమ్మలాంటి ఆవు
నమ్ముము ఇది నీవు.
గుమ్మ పాలను త్రావు
గుమ్మడి పండు అవుతావు.



దొండ తీగపై ఉడతుంది.
దోరకాయలను కొడుతుంది
హుషారుగా కనబడుతోంది
'హుత్' అంటే పరిగెడుతుంది.



మురుగులోన పంది
తిరుగుతూనే ఉంది
ఇందులోనే ఉంది
ఎంతో సుఖం అంది.



AP SCERT

**కృత్యం – 2 : కింది కథను చదివించండి. చెప్పించండి.**

రామయ్య పొలం దున్నటానికి వెళ్ళాడు. వలలో చిక్కిన రాబందును చూసాడు. జాలితో దానిని వదిలేశాడు. తరువాత రామయ్య భోజనం చేసి అలసటగా ఉందని, ఒక చెట్టు నీడలో నిద్రించాడు. ఇంతలో చెట్టు తొర్రలో ఉన్న ఒక పాము రామయ్యను కాటు వేయబోయింది. రాబందు గమనించింది. ఆ పామును ఒక్కసారిగా కాళ్లతో తన్నుకు పోయింది. ఈ అలజడికి రామయ్య నిద్రలేచాడు. రాబందు చేసిన సహాయానికి ఆశ్చర్యపోయాడు.

**నీతి :** ఒక మంచి పని మరో మంచి పనికి ప్రోత్సహిస్తుంది.

**కృత్యం – 3 : నిన్నటి వరకు నేర్పిన పదాలపై ఉక్తలేఖనం నిర్వహించాలి.**

________ ________ ________ ________

________ ________ ________ ________



https://amaravathiteacher.com

**కృత్యం - 1 : కింది గేయాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

పన్నెండు దేశాలు పండుచున్నా గాని
పట్టెడన్నమె లోపమండి
ఉప్పు ముట్టుకుంటే దోషమండి
అయ్యో! కుక్కలతో పోరాడి కూడు తినమంటాడు

**ప్రశ్నలు :**

1. ఎన్ని దేశాల్లో పంటలు పండుచున్నాయి? ______________________
2. దేనిని ముట్టుకుంటే తప్పు అనేవారు? ______________________
3 ఎవరితో పోరాడి కూడు తినమన్నారు? ______________________
4 పట్టెడన్నం ఎవరికి లోపమని కవి చెప్పాడు? ______________________

**కృత్యం - 2 : కింది చమత్కార పద్యం చదివి, పొడుపు కథకు జవాబు రాయండి.**

కరయుగంబు కలదు చరణంబులా లేవు
కడుపు నడుము వీపు మెడయుగలవు
శిరము లేదు గాని నరుల బట్టుక మ్రింగి
సొగసు గూర్చు దీని సొగసు గనుడి. జవాబు : ................................................

**కృత్యం - 3 : కింది పేరాను చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.**

పంచవటం అనే ప్రాంతంలో ఒక మర్రిచెట్టు తొర్రలో రోమశుడు అనే పిల్లి నివసిస్తోంది. ఆ చెట్టు క్రింద కన్నంలో పలితుడు అనే ఎలుక కాపురం ఉంటుంది. ఒకనాటి రాత్రి వేటగాడు అక్కడికి వచ్చి ఆ చెట్టు చుట్టూ వలపన్నాడు. అది తెలియని రోమశుడు తెల్లవారుతూనే మసక చీకటిలో ఆహార అన్వేషణకు బయలుదేరి ఆ వలలో చిక్కుకున్నాడు. ఇది చూసిన పలితుడు ఆహా ఎంత అదృష్టము, నా శత్రువు వలలో చిక్కుకున్నాడు. ఈనాటితో వాడి పీడ వదిలింది అనుకున్నాడు.......

1. మర్రిచెట్టు ఏ ప్రాంతంలో ఉంది?
______________________
______________________
2. పిల్లి ఎక్కడ నివసిస్తోంది?
______________________
______________________
3. రోమశుడు ఎలా వలలో చిక్కుకున్నాడు?
______________________
______________________
4. రాత్రి వేటగాడు వచ్చి ఏమి చేశాడు?
______________________
______________________

AP SCERT



https://amaravathiteacher.com

**కృత్యం - 4 : కింది లేఖను చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

గుంటూరు,

తేది. ......................

గౌరవనీయులైన గాయత్రి పబ్లికేషన్స్, అద్దంకి.

మేనేజర్ గార్కి నమస్కారాలు,

అయ్యా !

మా పాఠశాలలో విద్యార్థులకు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి, పఠనాభిరుచిని కలిగించడానికి, గ్రంథాలయానికి అవసరమగు క్రింది పుస్తకాలను నా చిరునామాకు పంపగలరని మనవి. అందులకు సంబంధించిన నగదును మీకు ఆన్‌లైన్ ద్వారా పంపగలను. ధన్యవాదాలు.

| | | |
|---|---|---|
| పంచతంత్ర కథలు | - | 10 కాపీలు. |
| పెద్దబాలశిక్ష | - | 12 కాపీలు. |
| శబ్దరత్నాకరం | - | 15 కాపీలు. |
| బాలసాహిత్య కథలు | - | 20 కాపీలు. |

ఇట్లు,
తమ విధేయుడు,
టి. శ్రీనివాసరావు,
మహాకవి తిక్కన వీధి,
గుంటూరు.

చిరునామా :
మేనేజర్,
గాయత్రి పబ్లికేషన్స్, అద్దంకి.

**ప్రశ్నలు :**

1. పై లేఖలో పబ్లికేషన్స్ పేరేమిటి?

2. మొత్తం ఎన్ని పుస్తకాలు కావాలన్నారు?

3. పై లేఖను ఎవరు రాశారు?

4. పై లేఖకు తగిన ప్రశ్నను తయారు చేయండి.

AP SCERT



https://amaravathiteacher.com

**అభ్యసన ఫలితాలు :** వాక్యాలను చదవగలరు, రాయగలరు, వ్యాకరణం లోని విశేషణ పదాలమీద అవగాహనను పొందగలరు.

**కృత్యం – 1 : కింది వాక్యాలను చదివించండి. విశేషణ పదాలు రాయించండి.**

1. పాలు తెల్లగా ఉంటాయి. ______
2. మామిడి తియ్యగా ఉంటుంది. ______
3. రాముడు మంచి బాలుడు. ______
4. మంగళగిరి కొండ ఎత్తుగా ఉంది. ______
5. ఏనుగు చాలా పెద్ద జంతువు. ______

**కృత్యం – 2 : కింది విశేషణ పదాలను ఉపయోగించి వాక్యాలు రాయించండి.**

నల్లగా ______

అందమైన ______

చక్కని ______

వేగంగా ______

చేదుగా ______

**కృత్యం – 3 : కింది గేయాన్ని చదివించండి.**

కట్టెలకు పోరా తిమ్మప్పా
కడుపునొప్పే మాయమ్మా
గడ్డికి పోరా తిమ్మప్పా
కాలు నొప్పే మాయమ్మా
నీళ్ళకు పోరా తిమ్మప్పా
కీళ్ళునొప్పే మాయమ్మా
బొచ్చు తెచ్చుకో తిమ్మప్పా
అట్టా చెప్పే మాయమ్మ.

**కృత్యం – 4 : కింది వాక్యాలను చదవండి. క్రియా పదానికి ముందు విశేషణం చేర్చండి.**

ఉదా: అనన్య పాట పాడింది. అనన్య పాట చక్కగా పాడింది.

1. ఈశ్వర్ పరుగెత్తాడు ______
2. అభిజ్ఞ నాట్యం చేసింది ______
3. సింహం గర్జించింది ______

AP SCERT



https://amaravathiteacher.com

**కృత్యం – 1 : ఇచ్చిన అక్షరాలకు ఒత్తులు చేర్చి పదాలు రాయండి.**

| హల్లు | ఒత్తు | పదాలు |
|---|---|---|
| బ | | |
| మ | | |
| య | | |
| ర | | |
| ల | | |

**కృత్యం – 2 : కింది అక్షరాలకు అవసరమైనచోట సున్నా (0) చేర్చి సరైన పదాలు రాయండి.**

1. దత ________
2. రగ ________
3. సగ ________
4. జగ ________
5. అహ ________
6. జయ ________
7. అనద ________
8. ఇధన ________
9. అగన ________
10. చదన ________

**కృత్యం – 3 : మీ పాఠశాల గొప్పతనం తెలిపేలా గేయాన్ని పొడిగించండి.**

అందమైనది మా బడి
తెలివి నేర్పే ________
________
________
________
________
________



**కృత్యం – 4 : కింది సంభాషణ చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

(నూతిలో పడిన నక్కను మేక చూసింది)

మేక : నక్క బావ! నక్క బావ! ఏంటి నూతిలో ఉన్నావు?

నక్క : (మేకను మోసం చేయాలని) ఇక్కడ తాగడానికి మంచి నీరు ఉంది. అందుకే నూతిలో దిగా.

మేక : నిజమా!

నక్క : అవును నీరు ఎంత రుచిగా ఉందో! నువ్వూ చూడు.

మేక : సరే ఇప్పుడే వస్తున్నా (అంటూ మేక నూతిలో దూకింది)

నక్క : భలే వచ్చావులే (అంటూ మేక మీద ఎక్కి నూతి బయటకు వచ్చింది).

మేక : అయ్యో! ఈ జిత్తులమారి నక్క నన్ను మోసం చేసింది (అంటూ ఏడ్చింది.)

1. నూతిలో మంచి నీరు ఉందని ఎవరన్నారు?
2. నక్క మేకను ఏం చేయాలనుకుంది?
3. మనం ఎవరికి దూరంగ ఉండాలి?

AP SCERT



https://amaravathiteacher.com

**అభ్యసన ఫలితాలు :** గద్యాన్ని చదివి అవగాహనను పొంది, ప్రశ్నలు తయారు చేయగలరు.

**కృత్యం - 1 : కింది కరపత్రం చదవండి ప్రశ్నలకు జవాబులు చెప్పించండి.**

వాళ్ళు మన మిత్రులే!

ప్రత్యేక అవసరాలున్న వాళ్ళు మనవాళ్లే. వాళ్లకు చేయూతనివ్వండి. వాళ్ళు వేగంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించండి. ధైర్యం చెప్పండి. సహాయం చేయండి మన సమాజాభివృద్ధిలో వారు భాగస్వాములు అవుతారు వాళ్లు మనవాళ్లే, వాళ్లు మన సోదరులే, మన మిత్రులే.

స్థలం : అమరావతి, ఇట్లు,

తేదీ: 17-06-2026. ప్రత్యేక అవసరాలు ఉన్న వారి ప్రోత్సాహక కమిటీ,

అమరావతి.

1. పై కరపత్రం ఎవరు విడుదల చేశారు?
2. ప్రత్యేక అవసరాలు ఉన్నవారు దేనిలో భాగస్వాములు కావాలి?
3. వాళ్లు మనవాళ్లే అన్నారు కదా! వాళ్ళు ఎవరు?
4. పత్రం ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి?

**కృత్యం - 2 : పేరాను చదవండి. కింది పదాలను సరైన చోట రాయించండి.**

(జంటలు - పురుషులు - ఎడమచేతి - గిరిజనులకు)

.............. ప్రత్యేక రీతులు ఉంటాయి. వారు...........గా కలిసి నృత్యం చెయ్యరు. నృత్య ప్రాంతం దగ్గర .............వాలుగా చుట్టూ తిరుగుతారు. సామూహిక నృత్యం చేస్తారు. నృత్యం చివరి వరకు స్త్రీ .............వేరు వేరుగానే నృత్యం చేస్తారు..

**కృత్యం - 3 : పేరాలు చదవండి. ప్రశ్నలు తయారు చేయించండి.**

ఆపదలో ఉన్న వారిని తమ ధైర్య సాహసాలతో రక్షించిన బాలబాలికలు మన దేశంలో ఎందరో ఉన్నారు. అలాంటి వారిని గుర్తించి భారత ప్రభుత్వం మరియు ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ జాతీయ బాలల పురస్కారాలు అందిస్తారు.

1. ______________________________
2. ______________________________
3. ______________________________
4. ______________________________
5. ______________________________

AP SCERT



https://amaravathiteacher.com

**కృత్యం – 1 : మీ పాఠశాల నిర్వహణకు ఏ ఏ సూచనలు చేయాలనుకుంటున్నారో రాయండి.**

ఉదా : చిత్తు కాగితాలను చెత్త బుట్ట లోనే వేయాలి.

1. 
2. 
3. 
4. 
5. 
6. 
7. 
8. 

**కృత్యం – 2 : కింది పద్యం చదవండి భావం వ్రాయండి.**

చంపదగిన యట్టి శత్రువు తన చేత
చిక్కనేని గీడు చేయరాదు
పొసగ మేలు చేసి పొమ్మనుటే చాలు
విశ్వదాభిరామ వినురవేమ!

**భావం :**

**కృత్యం – 3 : మీకు తెలిసిన చిన్న కథను రాయండి.**

AP SCERT




https://amaravathiteacher.com

# 1 అక్షరం

I3W2B2

**అభ్యసన ఫలితాలు :**

- వచన కవిత గురించి తెలుసుకొని, పాఠ్యభాగ కవి గురించి చెప్పగలరు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం -1)
- అక్షరం గొప్పతనాన్ని, అమ్మ ప్రేమను సొంతమాటల్లో చెప్పగలరు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం -1)
- అక్షరం కవితను చదివి, వచన కవితను గుర్తించి అభినందించగలరు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం -2)
- చదువు విలువను గురించి చెప్పగలరు, రాయగలరు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం -3)
- అమ్మ గురించి, అక్షరాల గురించి గేయం, పాట, కవిత మొదలైనవి సేకరించి ప్రదర్శిస్తారు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం -4)
- హల్లులలో రకాలను గుర్తిస్తారు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం -5)



**వినడం - ఆలోచించి మాట్లాడడం**

1. చిత్రంలో ఎవరెవరున్నారు ?
2. తల్లి ఏం చేస్తోంది?
3. పిల్లలు ఏం చేస్తున్నారు?

**ఉద్దేశం :** అక్షరజ్ఞానం అందించిన ఆదిగురువు అమ్మ. ఆమెను గౌరవిస్తూ, అక్షరం యొక్క గొప్పతనాన్ని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

**కవి పరిచయం**

**రావినూతల ప్రేమకిషోర్**

**(01.08.1965 - 07.10.2019)**




రావినూతల ప్రేమకిషోర్ ప్రకాశం జిల్లాలోని కొండపి గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు మరియమ్మ, అంకయ్యలు. శ్రమవద్గీత, అజమాయిషి, నిశి, రెక్కల పుడమి, ఇంకుచుక్క, నిశ్శబ్ద గాయం, టామి, కల్లం దిబ్బ మొదలైన రచనలు చేశారు. వీరు రాసి నటించిన అనేక నాటికలకు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రదేశాలలో ఉత్తమ అవార్డులు, ప్రశంసలు లభించాయి. ఈ పాఠ్యాంశం 'నలుగురమవుదాం' అనే కవితా సంపుటిలోనిది.



https://amaravathiteacher.com

# అక్షరం




నా గుండె గవాక్షాల్లోనే కాదు
మూసిన నా కనురెప్పలపై కూడా
అక్షరాలు కవాతు చేస్తుంటాయ్
నిరంతరం నిద్రాభంగం చేస్తుంటాయ్

కలలు రాలని రాత్రి
అక్షరాలంటని తావు
నా కంటికి, ఒంటికి లేవుగా...
ఎంతైనా
పంతులమ్మగారి బుజ్జోణ్ణి
ఆ మాత్రం అక్షరానుబంధం ఉండదా...!?
నిద్ర పోయేటప్పుడు
అమ్మ అచ్చరాల కంబళి కప్పిందేమో.



చిన్నప్పుడు అన్నప్రాసననాడు
తలావొకటి నా చుట్టూరేసి
పట్టుకోమన్నప్పుడు
ఎర్రగా బాగుందని పెన్ను పట్టుకుంటే
అమ్మ అక్కున చేర్చుకుని
కలంపట్టిన బిడ్డ ఇలను దున్నుతాడని
ఆనందంతో
ఒళ్ళంతా ముద్దుల్తో నింపిందట



అమ్మ ముద్దులో
అక్షరాల ముద్దర్లున్నట్టుంది
ఒంటినిండా అచ్చరాల సుద్దలే...
ఇప్పుడు
ప్రతి అక్షరంలోనూ అమ్మే కన్పిస్తుంది
నన్నే అక్షరాల పుట్టని చేసిన
అమ్మకు అక్షరాన్నవ్వడం మినహా
మరేమివ్వగలను?

**బాల్యంలో మనకు అమ్మ ఎన్నో సేవలు చేసింది కదా! ఇప్పుడు మీరు అమ్మకు ఎలాంటి సేవలు చేయగలరో చర్చించండి?**

AP SCERT



https://amaravathiteacher.com

## సారాంశం

(కవి అక్షరాలతో తనకున్న అనుబంధాన్ని గురించి ఇలా చెబుతున్నాడు.)

నేను బాగా చదువుకుని ఈ ప్రపంచాన్ని మరింత మెరుగుపరచాలన్న అమ్మ ఆశ నా గుండె చప్పుడయింది. ఇప్పుడు నాకు కళ్ళు మూసినా తెరచినా అక్షరాలే కనిపిస్తుంటాయి. నేను బాగా చదివి గొప్ప ప్రయోజకుడిని కావాలనే అమ్మ కోరిక నన్ను నిద్రపోనివ్వడం లేదు. అమ్మ ఆశలు నన్ను ఒళ్లంతా కళ్లు చేసుకుని శ్రద్ధగా చదువుకునేలా చేశాయి. అందుకే ఆ అక్షరాలు కలలో కూడా నన్ను వదిలి పెట్టడం లేదు.

మా అమ్మే నా పంతులమ్మ. నేను ఆమెకు బుజ్జోడిని. కాబట్టి పడుకునేటప్పుడు కూడా నాకు అక్షరాలను నూరిపోసింది. అందుకేనేమో చదువుపట్ల నాకు ఆసక్తి పెరిగింది.



అన్నప్రాశన రోజు నా ముందు పెట్టిన అన్ని వస్తువుల్ని వదిలేశాను. ఎర్రని కలాన్ని పట్టుకున్నాను. కలం పట్టిన నేను లోకానికి మేలు చేస్తానని ఆనందంతో అమ్మ మురిసిపోయింది. అమ్మ మాటల్లోనే కాదు ముద్దుల్లోను అక్షరాల గుర్తులు ఉన్నాయి. అందుకే నేను అమ్మను ప్రేమించినంతగా అక్షరాన్ని ప్రేమిస్తాను. అమ్మ కోసం బాగా చదువుకుని అమ్మ కోరిక తీరుస్తాను. అమ్మను గుర్తు చేసుకొంటూ అమ్మ ప్రేమను తెలిపే అక్షరంగా మారుతాను.

AP SCERT

## ఇవి చేయండి

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

గవాక్షం – కవాతు – నిద్రాభంగం – కంబళి – అన్నప్రాసన – అక్షరాలు – దున్నుతాడు

## అవగాహన - ప్రతిస్పందన

1. ఈ వచనకవితను భావయుక్తంగా చదవండి.
2. మీరు తల్లిదగ్గర ఏమి నేర్చుకున్నారు?
3. మీ చిన్నప్పటి అనుభవాలను తెల్పండి.



https://amaravathiteacher.com

**4. కింది దేశభక్తి గేయాన్ని ఆలపించండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**



జయము జయము భరతమాత జయము నీకు జగన్మాత
ఈ జగాన సాటి ఎవ్వరే ఓ యమ్మ నీకు

గంగ యమున గోదారీ సింధు కృష్ణ కావేరీ
బ్రహ్మపుత్ర తుంగభద్ర తపతీ నర్మద పెన్నా
పొంగి పొరలె తరంగాలు నీ మెడలో హారాలు
జీవనదుల కన్నతల్లివే ఓయమ్మ నీవు ॥ జయము జయము ॥

హిమ వింధ్యా పర్వతాలు దేవతలకు నిలయాలు
దట్టమైన అరణ్యాలు మహామునుల స్థావరాలు
పసిడి పంట క్షేత్రాలు పంచలోహ ఖనిజాలు
నిజముగ నువు రత్న గర్భవే ఓయమ్మ నీవు ॥ జయము జయము ॥

లోకమంత చీకటిలో తల్లడిల్లుతున్నప్పుడు
నాగరికత లేక నరులు పామరులై ఉన్నప్పుడు
వేదాలను వెతికితెచ్చి జ్ఞాన భిక్ష పెట్టినావు
నిజముగ నీవు జగద్గురువువే ఓయమ్మ నీవు ॥ జయము జయము ॥

ప్రశ్నలు

అ) మన జీవనదులు ఏవి?

ఆ) మహామునుల స్థావరాలు ఏవి?

ఇ) ఎవరికి జయము పలకాలి?

ఈ) పై గేయం ఆధారంగా ఒక ప్రశ్నను తయారుచేయండి?



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. జ్ఞానానికి మూలమైన అక్షరం గొప్పతనాన్ని తెలిపే కవిని గురించి రాయండి?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుంచి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. 'అక్షరం' గేయం సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
2. నీవు ఎప్పుడైనా మీ తరగతి గదిలో చదువు రాని విద్యార్థిని/ విద్యార్థులకు సాయం చేశావా వాటి వివరాలు రాయండి.
3. చదువు విలువను ప్రశంసిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

AP SCERT




https://amaravathiteacher.com

## భాషాంశాలు

### i. పదజాలం

**అ) కింది పదాలకు అర్థాలను జతపరచండి.**



| | | | |
|---|---|---|---|
| 1. | గవాక్షం | ( ) | అ) నేల |
| 2. | తావు | ( ) | ఆ) హృదయం |
| 3. | గుండె | ( ) | ఇ) కిటికీ |
| 4. | ఇల | ( ) | ఈ) స్థానం |

**ఆ) కింద ఇచ్చిన పదాలకు సమానార్థకపదాలు(పర్యాయపదాలు) వాక్యాలలో గుర్తించి రాయండి.**



1. శరీరం శుభ్రంగా ఉంచుకుంటే తనువు ఆరోగ్యంగా ఉంటుంది.

   కాయం: ..................... , ...............................

2. నేత్రాలు సురక్షితంగా ఉంచుకోవాలి. నయనాలు లేనిదే లోకాన్ని చూడలేము.

   కన్నులు/ కళ్ళు : ..................... , ...............................

3. అమ్మను మించిన దైవం లేదు. తల్లిని పూజించాలి.

   మాత : ..................... , ...............................

**ఇ) ప్రకృతులు - వికృతులు**

ఉదా : నేను నిదురపోని రాత్రులను ఎన్నో గడిపాను. (గీత గీసిన పదానికి ప్రకృతి పదాలను రాయండి.

**అమ్మ, రాత్రి, ముద్దర, అంబ, అక్కరము, రాతిరి, అక్షరము, ముద్ర**

| | ప్రకృతి | వికృతి |
|---|---|---|
| 1 | నిద్ర | నిదుర |
| 2 | .............................. | .............................. |
| 3 | .............................. | .............................. |
| 4 | .............................. | .............................. |
| 5 | .............................. | .............................. |

AP SCERT



https://amaravathiteacher.com

**ఈ) కింది ఖాళీలను సరైన పదాలతో పూరించండి.**



1. నేను తల్లిదండ్రులను ..............................
   ఎల్లప్పుడూ గౌరవిస్తాను / కొంచెం గౌరవిస్తాను.
2. నేను కష్టపడి ..............................
   చదువుతాను / చదవను.
3. చేతులు శుభ్రంగా ..............................
   కడుగుతాను / కడగను.
4. మంచి వాళ్ళతో స్నేహం ..............................
   చేస్తాను / చేయను.

**ఉ) కింది పదాలకు సొంత వాక్యాలు రాయండి.**



ఉదా: అక్షరాలు

మన జీవితానికి అక్షరాలు మార్గదర్శకాలు

1. నిరంతరం ..................................
2. అనుబంధం ..................................
3. కంబళి ..................................
4. నిద్రాభంగం ..................................
5. అక్కునచేర్చుకొను ..................................

**ఊ) కింది వాక్యాలు ఆధారంగా మన బంధుత్వాలను గళ్ళలో నింపండి.**

**అడ్డం**

1. తల్లికి ఇంకొక పేరు (2)
2. తల్లిగారి చెల్లిని ఏమని పిలుస్తారు. (3)
3. తల్లిగారి అక్కను ఏమని పిలుస్తారు. (3)

**నిలువు**

1. తల్లిగారి తల్లిని ఏమని పిలుస్తారు. (3)
2. తండ్రిగారి తల్లిని ఏమని పిలుస్తారు. (3)
3. తండ్రిగారి అక్క/చెల్లిని ఏమని పిలుస్తారు (తిరగబడింది) (3)

| | | | | |
|---|---|---|---|---|
| 1 | | ● | 2 | ● |
| | ● | 2 | | |
| | ● | ● | | |
| ● | ● | ● | ● | 3 |
| ● | 3 | | | ● |

AP SCERT



https://amaravathiteacher.com

## ii. వ్యాకరణాంశాలు

**కింది తరగతి వ్యాకరణ పునశ్చరణ**

మనం కింది తరగతిలో నేర్చుకున్న కొన్ని ముఖ్యమైన వ్యాకరణాంశాలను ఈ పాఠంలో ఒకసారి గుర్తుచేసుకుందాం. భాషకు మూలం "అక్షరం". కాబట్టి, ఈ పాఠం లో మనం 'వర్ణమాల' మరియు 'సంధుల'ను పునశ్చరణ చేద్దాం.

**విభాగం-1 : వర్ణమాల పునశ్చరణ**

మనం కింది తరగతిలో నేర్చుకున్నట్లు, అక్షరాలు 3 రకాలు : 1 అచ్చులు 2. హల్లులు 3. ఉభయాక్షరాలు

1. **అచ్చులు (ప్రాణములు / స్వరములు):**

   స్వయంగా పలకబడేవి.

   - **హ్రస్వాలు :** అ,ఇ,ఉ,ఋ,ఌ,ఎ,ఒ
   - **దీర్ఘాలు :**ఆ,ఈ,ఊ,ౠ,ౡ,ఏ,ఐ,ఓ,ఔ

2. **హల్లులు (వ్యంజనాలు, ప్రాణులు) :**

   అచ్చుల సహాయంతో పలకబడేవి.

   - పరుషాలు (కఠినంగా పలుకబడేవి) – 5) : క, చ, ట, త, ప
   - సరళాలు (తేలికగా పలుకబడేవి – 5) : గ, జ, డ, ద, బ
   - వర్గయుక్కులు, (మహా ప్రాణాలు) (ఒత్తు హల్లులు – 10) : ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ
   - అనునాసికాలు (ముక్కు సహాయంతో పలికేవి – 5): ఙ, ఞ, ణ, న, మ
   - అంతస్థాలు (మధ్యస్థమైనవి – 4): య, ర, ల, వ
   - ఊష్మాలు (గాలి ఊదుతూ పలికేవి – 4): శ, ష, స, హ

3. **ఉభయాక్షరాలు (అచ్చులు, హల్లులు రెండింటితో చేరేవి):**

   సున్న (ం), అరసున్న (ఁ), విసర్గ (ః)

**విభాగం 2 : తెలుగు సంధుల పునశ్చరణ**

6వ తరగతిలో మనం 3 ముఖ్యమైన తెలుగు సంధులను గమనించాం

1. **ఉత్వ సంధి (ఉ + అచ్చు):**

   రాముడు + అతడు = రాముడతడు

   - **వివరణ :** మొదటి పదం (పూర్వపదం) చివర ఉన్న 'ఉ' (డ్ + ఉ), రెండవ పదంలోని మొదట అచ్చు 'అ' (అతడులో) రెండు అచ్చుల స్థానంలో పరస్వరమే ఏకాదేశం అయింది.

2. **అత్వ సంధి (అ + అచ్చు):**

   మేన + అత్త = మేనత్త

AP SCERT



https://amaravathiteacher.com

- **వివరణ :** పూర్వస్వరమైన 'అ' (న్ + అ) పరస్వరం (అత్తలో) 'అ' రెండింటి స్థానములో పరస్వరమే ఏకాదేశం అయింది.

### 3. ఇత్వ సంధి (ఇ + అచ్చు):

**గమనిక :** ఏమి + అంటివి = ఏమంటివి

- **వివరణ :** మొదటి పదం చివర ఉన్న 'ఇ' (మ్ + ఇ) , రెండవ పదం మొదట ఉన్న అచ్చు (అంటివి) రెండింటి స్థానంలో పరస్వరమే ఏకాదేశం అయింది.

## విభాగం 3: అభ్యాసాలు

**అభ్యాసం 1 :** హల్లుల రకాలను గుర్తిద్దాం!

కింద పట్టికలో ఇవ్వబడిన అక్షరం ఏ రకమైన హల్లు అనేది (పరుషం, సరళం, అనునాసికం, అంతస్థం, ఊష్మం) గుర్తించి రాయండి.

| పాఠంలోని పదం | అక్షరం | హల్లు రకం (పరుషం / సరళం / ....) |
|---|---|---|
| ఉదా : కవాతు | క | పరుషం |
| 1. గవాక్షం | గ | |
| 2. నిరంతరం/మూసిన | న | |
| 3. పంతులమ్మ | ప | |
| 4. అనుబంధం | బం | |
| 5. రచయిత | చ | |
| 6. రచనలు | ర | |
| 7. ప్రశంసలు | శ | |
| 8. తలావొకటి | త | |

**అభ్యాసం 2 : సంధులను విడదీద్దాం!**

**పాఠంలోని ఈ పదాలలో 6వ తరగతిలో మనం నేర్చుకున్న సంధులు దాగిఉన్నాయి. వాటిని విడదీసి, సంధి పేరు రాయండి.**

| సంధి పదం (పాఠం 1 నుండి) | విడదీసిన రూపం (పూర్వపదం + పరపదం) | సంధి పేరు (ఉత్వ / అత్వ / ఇత్వ) |
|---|---|---|
| ఉదా: అంతైనా | అంత + ఐనా | అత్వ సంధి |
| 1. ఒళ్ళంతా | + | |
| 2. అక్షరాన్నవ్వడం | + | |
| 3. ఏమివ్వగలను | + | |
| 4. కప్పిందేమో | + | |
| 5. నింపిందట | + | |
| 6. దున్నుతాడని | + | |

AP SCERT




https://amaravathiteacher.com

**అభ్యాసం 3: సంధులను కలుపుదాం!**

**ఈ పదాలను కలిపి, సంధి పేరు రాయండి.**

1. ముద్దర్లు + ఉన్నట్టు = ......................../........................
2. ఉన్నట్టు + ఉంది = ......................../........................
3. మెరుగుపరచాలి + అన్న = ......................../........................
4. అక్కడ + ఉన్న = ......................../........................
5. అప్పటికి + అప్పుడు = ......................../........................
6. కావాలి + అనే = ......................../........................
7. అక్షరాలు + ఏవి = ......................../........................
8. చిన్న + అప్పుడు = ......................../........................






## ప్రాజెక్టుపని

అక్షరం / అమ్మకు సంబంధించిన పాటలను సేకరించండి. తరగతి గదిలో పాడండి.



## నీతి పద్యం

ఆ॥వె॥ అమ్మయనెడి రెండు అక్షరములె గాని
అందులోని మహిమకంతు లేదు
అమ్మ మాట మధురమానంద భరితమౌ!
అంతు లేని ప్రేమ అమ్మ ప్రేమ.





## మీకు తెలుసా?



**కవాతు** : సైనికులు బృందంగా క్రమశిక్షణతో లయబద్ధంగా నడిచే పద్ధతిని 'కవాత్' అని కూడా అంటారు (కవాత్–హిందీపదం). ఒక మార్గంలో అందరూ కలిసి ఒకేసారి కదలడం (పాద విన్యాసం). కవాతు నిర్వహించడం ద్వారా సైనికుల నిబద్ధత తెలుస్తుంది.



**అన్న ప్రాశన :** శిశువుకు మొదటిసారి అన్నం తినిపించే తంతు. దీని వలన శిశువుకు ఆయువు, తేజస్సు అభివృద్ధి చెందుతాయి. అన్నప్రాశన రోజు శిశువు ముందు బంగారు నగలు, డబ్బు, పుస్తకాలు, పెన్ను, కత్తి, పూలు మొదలైన వస్తువులను పెడతారు. శిశువు ఏ వస్తువును తాకుతాడో ఆ వస్తు సంబంధమైన జీవనోపాధి లభిస్తుందని ఒక నమ్మకం.



https://amaravathiteacher.com
AP SCERT



## నేనివి చేయగలనా?

| | |
|---|---|
| 1. పాఠం అర్థం చేసుకుని సొంత మాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. పాఠాన్ని ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. పాఠంలోని పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 4. అమ్మప్రేమ గురించి నా మాటలలో రాయగలను. | ఔను / కాదు |



## ఉపాధ్యాయులకు సూచనలు

కన్నబిడ్డలను కంటికి రెప్పలాగా కాపాడుకొనే అమ్మను ఎలా గౌరవించాలో, వృద్ధాప్యంలో ఎలా చూసుకోవాలో విద్యార్థులకు వివిధ రూపాలలో వివరించగలరు.






## చదవండి - ఆనందించండి

### నిరంతరం నేర్చుకో....

సోక్రటీస్ గ్రీకు దేశానికి చెందిన తత్వవేత్త. తన ఉపన్యాసాలతో యువకుల్ని నాశనం చేస్తున్నాడనే నెపంతో రాజు మరణశిక్ష విధించాడు. శిక్షలో భాగంగా తనకుతాను విషం తాగి మరణించవలసి ఉంది. ఆయన్ని జైల్లో పెట్టారు. పేరుకు జైల్లో పెట్టారే కానీ అందరూ వచ్చి చూసి వెళుతున్నారు. శిష్యులు మాత్రం అక్కడే ఉండి బాధ పడుతున్నారు. సోక్రటీస్ ఇవేమీ పట్టనట్లు నవ్వుతూ అందరినీ పలకరిస్తూ కబుర్లు చెబుతూ ఉండేవాడు. మరణించబోతున్నాననే భయంలేకుండా ఉన్న అతన్ని చూసి అందరూ ఆశ్చర్యపోతూ ఉండేవారు.

సోక్రటీస్ జీవితంలో చివరి రోజు రానే వచ్చింది. మరణశిక్ష అమలు కావడానికి ఇంకా రెండు గంటల సమయం ఉంది. అక్కడ శిష్యులతో పాటు అందరి ముఖాల్లో ఆందోళన దిగులు ఎక్కువయింది. సోక్రటీస్ ముఖంలో మాత్రం ప్రశాంతత, ఆనందం, వెలుగు కనిపిస్తున్నాయి.



సోక్రటీస్ కిటికీలో నుంచి బయటికి చూస్తూ కూర్చున్నాడు. బయట ఒక చెట్టు కింద బిచ్చగాడు కూర్చుని ఒక వాద్యం వాయిస్తూ పాటలు పాడుతున్నాడు. అది సోక్రటీస్ మనసును ఆకట్టుకుంది. ఆనందంతో కళ్ళు మూసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత మెల్లగా కళ్ళుతెరిచి జైలర్‌ని పిలిచాడు. జైలర్ గౌరవభావంతో దగ్గరికి వచ్చి ఏమి కావాలన్నాడు.

AP SCERT




https://amaravathiteacher.com

సోక్రటీస్ కిటికీలో నుంచి చూపిస్తూ " మీకు అభ్యంతరం లేకుంటే ఆ బిచ్చగాడిని తీసుకువస్తారా" అని అడిగాడు. అలానే అంటూ జైలర్ వెళ్లి ఆ బిచ్చగాడిని తీసుకొచ్చాడు. సోక్రటీస్ బిచ్చగాడితో తనకు ఆ పాట నేర్పమన్నాడు. అతని దగ్గర నుంచి వాద్యం తీసుకున్నాడు. ఆ బిచ్చగాడు పాట పాడాడు. సోక్రటీస్ పాటపాడుతూ వాద్యం వాయించాడు. ఇలా అరగంట సాధన తర్వాత బిచ్చగాడి సాయం లేకుండానే సోక్రటీస్ ఆ పాట పాడాడు. అతనికి కృతజ్ఞతలు చెప్పి పంపించాడు.

ఇదంతా చూస్తున్న శిష్యులు, జైలర్ మరింతగా ఆశ్చర్యపోయారు. అప్పుడు శిష్యులు "గురువుగారు ఇక గంటలో విషపాత్ర మీ చేతికి వస్తుంది. మీరు ఈ లోకాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోతున్నారు. కానీ ఆఖరిక్షణాల్లో మీరు ఆ వాద్యం మీద అభ్యాసం చేసి పాడటం నేర్చుకున్నారు. ఎందుకు? అని అడిగారు. సోక్రటీస్ నవ్వి "జీవితం అంటే నేర్చుకోవడం. మరణం గురించి ఆలోచించడం కాదు. నేను, నువ్వు ఇక్కడున్న అందరూ ఎప్పుడో ఒకప్పుడు చనిపోతాం. కానీ జీవించినంత కాలం ప్రతిక్షణం విలువైనదే.

ఎప్పటికప్పుడు తెలియంది తెలుసుకోవడంలోనే ఆనందం ఉంది. గంట క్రితం నాకు ఆ పాట తెలీదు. ఇప్పుడు నేర్చుకున్నాను ఇంకా నా జీవితంలో గంట సమయం ఉంది. అంటే ఇప్పటికీ నేర్చుకోటానికి నాకు అవకాశం ఉంది" అన్నాడు. అక్కడున్న వారి నోట మాట రాలేదు.




"అభ్యాసం కూసు విద్య"

AP SCERT



https://amaravathiteacher.com

# 2 మాయాకంబళి

F3Y6Z5

**అభ్యసన ఫలితాలు :**

- కథను వినడం, జానపద కథలు గురించి తెలుసుకొని ఆనందిస్తారు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం-1)
- జానపద కళలను అవగాహన చేసుకుని, అద్భుత కల్పనలను తెలుసుకొని, భిన్నమైన భావాలు వ్యక్త పరచగలరు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం-2)
- కథా సారాంశాన్ని సొంత మాటల్లో చెప్పగలరు, రాయగలరు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం -3)
- లింగము, వచనము, భాషాభాగాలు, విభక్తులు తెలుసుకొని అభినందిస్తారు. (పాఠ్య ప్రణాళిక లక్ష్యం -5)
- అద్భుత కథలలో పదప్రయోగాలను, పదాల వాడుకను మౌఖిక, లిఖితభాష ద్వారా ఆకర్షణీయంగా వినియోగిస్తారు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం -5)

## వినడం - ఆలోచించి మాట్లాడడం

1. చిత్రం ద్వారా మీరేమి గమనించారో చెప్పండి?
2. మీరు చదివిన కథల పుస్తకాల పేర్లు చెప్పండి?
3. కథల పుస్తకాలు చదవడం మీకు ఇష్టమా? ఎందుకు?





AP SCERT

**ఉద్దేశం :** అద్భుతం ఆశ్చర్యాన్ని పుట్టిస్తుంది. ఆనందాన్ని కలిగిస్తుంది. ఊహా శక్తిని పెంచుతుంది. తార్కిక ఆలోచనను కలుగజేస్తుంది. ప్రవర్తనలో మార్పు తీసుకువస్తుంది. ఇలాంటి లక్షణాలను విద్యార్థులలో జానపద కథ ద్వారా పెంపొందించడమే పాఠ్యాంశ ఉద్దేశం.

### కవి పరిచయం



**కలువకొలను సదానంద**

**(22.02.1939 - 25.08.2020)**

కలువకొలను సదానంద చిత్తూరు జిల్లా పాకాలలో జన్మించారు. 1992లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పిల్లలకథలు-శివానందలహరి, విందుభోజనం, చల్లని తల్లి, నీతి కథామంజరి, తుస్సన్న మహిమలు, పరాగ భూమి మొదలైన రచనలు చేశారు. చందమామ కథలు, వార్తాపత్రికల్లో కథానికలు రాశారు. 1966 లో 'బంగారు నడచిన బాట' నవలకు కేంద్రప్రభుత్వ విద్యాశాఖ బహుమతి, 1976 లో "నవ్వే పెదవులు - ఏడ్చే కళ్ళు" కథా సంపుటికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అవార్డు, 2010 లో "అడవితల్లి" పిల్లల నవలకు కేంద్ర సాహిత్య బాలసాహితీ అవార్డు లభించాయి. ఈ పాఠ్యాంశం 'మాయాకంబళి' సంపుటినుండి గ్రహించబడింది.



https://amaravathiteacher.com

# మాయాకంబళి

పూర్వం హిమాలయ పర్వతాల్లో ఆత్మానందుడనే వృద్ధయోగి ఉండేవాడు. ఆయన గొప్ప మహిమలు గలవాడని తెలిసి చుట్టుపక్కల వాళ్లు తరచుగా చూడవచ్చి, తమకు గల సమస్యలను ఏకరువుపెట్టి పరిష్కార మార్గాలు చూపమని ఆయన ఏకాగ్రతను, చెడగొట్టుతూ ఉండేవారు. అందుచేత ఆయన తన పాత కంబళి మీద మంత్రజలం చల్లి, దానికొక మహిమను కలుగజేసాడు. ఆయన దాన్ని కప్పుకుంటే ఎవరికీ కనిపించేవాడు కాడు. ఈ రహస్యం మాత్రం ఎవరికీ తెలియదు.

ఒకరోజు ఆత్మానందుడు తన కంబళి భుజాన వేసుకుని, ఒక శిల మీదుగా దాటుతూ కాలుజారి, శిలకు అవతలఉన్న లోయలోకి దొర్లి పడిపోయి, స్పృహ కోల్పోయాడు. అతని కంబళి శిలకు ఇవతలిపక్క పడిపోయింది.

మరికొంత సేపటికి ఆ కనుమ దారిన పాత దుస్తులు అమ్మే ఒక చిల్లరవ్యాపారి సంతకు పోతూ, కంబళిని చూశాడు. అది చాలా పాతది ఎవరైనా ఏదో ధరకు దాన్ని కొనక పోతారా అనుకుని ఆ మనిషి దాన్ని మడిచి మూటలో పెట్టి, సంత జరిగే శోభావతీ నగరానికి వెళ్లాడు. శోభావతిలో ఓ ముసలి బిచ్చగాడు చలితో బాధ పడుతూ, పాత కంబళిని చౌకగా కొనుక్కుని వెంటనే దాన్ని కప్పుకున్నాడు. చూస్తుండగానే, బిచ్చగాడు అదృశ్యం కావటం గమనించి అందరూ ఆశ్చర్యపోయారు.

ఈ వింత వార్త క్షణాల మీద నగరమంతా పాకింది. ఆ కాలంలో శోభావతిలో దొంగతనాలు,అవినీతి, స్పర్ధలు పెచ్చుమీరి ఉన్నాయి. శోభావతి రాజయిన చండీదత్తుడు ఎంత ప్రయత్నించినా వాటిని అదుపులో పెట్టలేకపోయాడు. ఈ సమయంలో కంబళి మహత్తు గురించి అందరికీ తెలియటంతో, దురాశాపరులు, బిచ్చగాడి కోసం వెతక సాగారు. అలాంటి అదృశ్యకరణితో దొంగతనాలు చేయవచ్చు. యధేచ్ఛగా అవినీతి కొనసాగించవచ్చు. పట్టుబడకుండా ప్రత్యర్థులను దెబ్బతీయవచ్చని వారి ఆలోచన.

కంబళి సహాయంతో అదృశ్యంగా తిరుగుతున్న బిచ్చగాడు నలుగురు అనుకునేమాటలు విని మరికొంత సేపటికి, తనకు రానున్న ప్రమాదాన్ని గ్రహించి, తన చేతికర్రను ఒక పొదలో పెట్టి, ఎలాంటి చప్పుడూ చేయకుండా మసలసాగాడు. ఆ కంబళి వల్ల వాడికి అడుక్కు తినటానికి కూడా లేక పోయింది. నగరంలో ఇక తనకెక్కడా భద్రతలేదనుకున్న ముష్టివాడు, ఊరి బయట ఉన్న పాడుబడిన దేవాలయం దగ్గరికి చేరుకున్నాడు. కొంతసేపటికి అక్కడికి నలుగురు దొంగలు వచ్చారు. వాళ్ళు కూడా బిచ్చగాని కంబళి గురించే మాట్లాడుకున్నారు.



ఆ రాత్రంతా వాడు ఆలోచించి, తన కంబళి కోసం దేశంలో హేమా హేమీలు తహతహ లాడుతున్నారనీ, అది తనకు ఎందుకూ పనికి రాదని రూఢి చేసుకుని మర్నాడు తెల్లవారగానే తాను వాళ్ల కంటపడకుండా కంబళి కప్పుకుని అదృశ్యంగా రాజసభకు వెళ్లి, తాను కప్పుకున్న కంబళి తీసి, రాజు ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

AP SCERT



https://amaravathiteacher.com

"మహాప్రభూ ! ఈ కంబళి వల్ల నాకు ప్రాణహాని తప్ప, శాంతిగాని, సుఖంగాని లేదు" దీనిని మీ వద్దనే ఉంచండి, అని బిచ్చగాడు కంబళిని రాజుకు ఇచ్చాడు. రాజు దాన్ని స్వయంగా పరీక్షించి, దాని మహత్తును తెలుసుకుని బిచ్చగాడికి జీవితం సుఖంగా గడిచే ఏర్పాటు చేసి, కంబళి తాను తీసుకున్నాడు. ఈలోపల కొండమీద పడిపోయిన ఆత్మానందుడు కోలుకుని, తన కంబళి చండీదత్తుడి వద్ద ఉన్నదని తెలుసుకుని శోభావతీ నగరానికి వచ్చి రాజును ఏకాంతంగా కలుసుకుని, తన కంబళి తనకియ్యమని అడిగాడు. రాజు అందుకు అభ్యంతరం చెబుతూ, "రాజ్య శ్రేయస్సు దృష్ట్యా, ఇది నా దగ్గర ఉండటమే మంచిది," అన్నాడు.

"రాజా! నేనుకూడా రాజ్యశ్రేయస్సు కోసమే చెబుతున్నాను. అసాధారణ శక్తులవల్ల మంచికంటే చెడు జరగటానికి ఎక్కువ అవకాశాలున్నాయి. ఇలాంటి మహిమాన్వితమైన వస్తువు మనిషిని పాప కార్యాలకు, నీతి బాహ్యమైన పనులకూ పురికొల్పుతుంది. ఉత్తముడివైన నువ్వు భ్రష్టుడివి కావటం నాకిష్టం లేదు," అన్నాడు ఆత్మానందుడు.

శతవిధాల చెప్పినా, రాజు తన వాదంతో ఏకీభవించక పోయేసరికి, "స్వానుభవంలో తప్ప నీకు ఈ విషయం బోధపడదు" అంటూ నిట్టూర్చాడు. తన కంబళిని రాజు వద్ద ఉంచటానికి ఒప్పుకుని, ఎందుకైనా మంచిదని చెప్పి, రాజు చేతికి ఒక రక్షాబంధం కట్టి వెళ్లిపోయాడు.

కంబళి సహాయంతో రాజు దొంగల ముఠాలను, అనేక మంది అవినీతిపరులను కఠినంగా శిక్షించడంతో నగరంలో నేరాలు, అక్రమాలు పూర్తిగా తగ్గిపోయాయి. చండీదత్తుడి మనస్సుకు కొంత ప్రశాంతత చేకూరింది.

ఒకనాడు రాజు సభా మందిరంలో రాజనర్తకి అయిన చంచల నాట్యానికి ఆనంద భరితుడై నర్తకిని ఏం కావాలని అడిగాడు. చంచల మాయాకంబళిని రెండు రోజుల పాటు తనవద్ద ఉండనియ్యమని రాజును కోరింది. ఆమె ముచ్చటను రాజు నిరాకరించలేక శయన మందిరంలో ఉన్నదని వచ్చి తీసుకొని వెళ్లు అన్నాడు.


రాజు శయన మందిరానికి చంచల వచ్చి, కంబళి కప్పుకుని తిరుగుముఖం పట్టింది. వెళ్లిపోతున్న ఆమెను చూసి రాజు ఆశ్చర్యచకితుడైనాడు. ఆమె అతనికి స్పష్టంగా కనిపిస్తున్నది దానికి కారణం ఆత్మానందుడు తన చేతికి కట్టిన రక్షాబంధం అయి వుంటుందని రాజుకు తోచింది.

చంచల తిన్నగా తన మందిరానికి వెళ్ళక, మరొక దిక్కుగా, కోశాధికారి విక్రముడి మందిరానికి వెళ్ళటం చండీదత్తుడు చూశాడు. చంచల అతని వద్దకు ఎందుకు వెళ్ళి వుంటుందని ఆలోచిస్తూ, చండీదత్తుడు శయనాగారానికి వెళ్ళి పడుకున్నాడు, కానీ అతనికి నిద్ర పట్టలేదు.

ఆ రాత్రివేళ విక్రముడు కంబళి కప్పుకొని, చేత కత్తిపట్టుకుని తన శయనాగారానికి ప్రవేశించడం రాజు చూసి, తనను చంపడానికి వస్తున్నాడని గ్రహించి లేచి చివాలున కత్తిదూసి, విక్రముడి మీద పడ్డాడు. రాజు నిద్ర పోతుంటాడని, మేలుకుని వున్నా కంబళి మూలాన తనను చూడలేడని నమ్మిన విక్రముడు ఇలాంటి పరిణామానికి సిద్ధంగా లేక, రాజు చేతిలో తేలికగా చచ్చిపోయాడు.

రాజాజ్ఞ ప్రకారం భటులు చంచలను బంధించి తెచ్చారు. రాజును హత్య చేసి వాళ్ళ వారసులను బంధించి తాను రాజు కావాలని విక్రముడు అనుకున్నాడని, చంచల కంబళి ఇచ్చి చేసిన సహాయానికి ఆమెను పట్టపురాణి చేస్తానని ప్రలోభపెట్టాడని ఆమె అందుకు ఒప్పుకున్నదని భటులు తెలియజేశారు. చండీదత్తుడు ఆమెను దేశం నుంచి బహిష్కరించాడు. ఆ మర్నాడే రాజు హిమాలయాలలో ఆత్మానందుడున్న చోటికి వెళ్లి, "స్వామీ, మీ కంబళిని మీరే ఉంచుకోండి, దీనివల్ల మంచి ఆలోచనతో మంచి చేయవచ్చని అనుకున్నాను. కాని దీనివల్ల మనుష్యులలో స్వార్థం, నీచత్వం, చెడు ఆలోచనలు పెరిగి ప్రాణాలకే ముప్పు కలుగుతుందని ఇచ్చేశాడు.


https://amaravathiteacher.com



ఆ కంబళి దుష్టుల చేతికి పోతే రాజుకు ఎంత ప్రమాదమో ఆత్మానందుడికి తెలుసు. కాబట్టే ఆయన శోభావతి నగరానికి వెళ్లి రాజును కంబళి ఇమ్మని అడిగాడు, రాజుకు రక్షాబంధనం కట్టాడు. రాజు కూడా దీనివల్ల వచ్చే ప్రమాదం గ్రహించగానే కంబళిని ఆత్మానందుడికి తిరిగి ఇచ్చేశాడు. ఆత్మానందుడు "నీ వద్ద ఈ కంబళి ఉందనే భయం ప్రజల్లో ఉంటే చాలు" అని నవ్వుతూ దానిని తీసుకున్నాడు.

AP SCERT

## ఇవి చేయండి

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

మహత్తు, రాజ్యశ్రేయస్సు, ఆశ్చర్యచకితుడు, శయనాగారము, ప్రలోభపెట్టడం, అదృశ్యకరణి, రాజాజ్ఞ

## అవగాహన - ప్రతిస్పందన

1. పాఠంలోని మాయాకంబళి వలే మానవ జీవితంలో చరవాణి (సెల్‌ఫోన్), సమయం, సంపద, మాటలు వంటివి విలువైనవే. వీటిని గురించి మీ సొంత మాటలలో చెప్పండి.
2. కథలోని మాయాకంబళి మీకు లభిస్తే దానిని ఏ విధంగా ఉపయోగిస్తారో చెప్పండి.
3. మీరు చదివిన ఏదైనా కథను మీ సొంత మాటలలో చెప్పండి.




https://amaravathiteacher.com

4) **కింది గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు గుర్తించండి.**

మనం ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను విస్మరించకుండా ఉండాలి. భాష నిత్యం ప్రవహించే స్రవంతి. జీవనదిలా ప్రవహించే గోదావరి. నన్నయ కాలం నాటి గోదావరే ఇప్పుడూ ఉన్నా అందులో నీరు నిత్యం మారుతూనే ఉంటుంది. పాతనీరు పోయి కొత్తనీరు వచ్చి చేరుతూనే ఉంటుంది. భాష కూడా మార్పులకు గురవుతూనే ఉంటుంది. భాష నిలువ నీటి మడుగుగా మారితే అది సజీవ భాష కాదు అనే చెప్పాలి. అటువంటి పరిస్థితి ఏ భాషకు కలుగకూడదని గిడుగు రామ్మూర్తి గారు అన్నారు.

**ప్రశ్నలు:**



1) మనం ఏ భాషను విస్మరించకూడదు? ( )
   అ) మరాఠీ   ఆ) మాతృభాష
   ఇ) ఆంగ్ల భాష   ఈ) పర భాష

2. భాష యొక్క స్వభావం ఏమిటి? ( )
   అ) మార్పు   ఆ) చేర్పు
   ఇ) కూర్పు   ఈ) తీర్పు

3. భాషలో జరిగే మార్పును దేనితో పోల్చారు? ( )
   ఆ) పాత నీరు   ఆ) కొత్త నీరు   ఇ) మురికినీరు   ఈ) నీటి మడుగు

APSCERT



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. మాయా కంబళి రచయితను గురించి రాయండి.
2. ఆత్మానందుడు రాజ్యశ్రేయస్సు కొరకు రాజుతో ఏమని చెప్పాడు?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుంచి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. మాయాకంబళిని రాజు మొదట ఎందుకు కావాలనుకున్నాడు? తరువాత ఎందుకు తిరిగి ఇచ్చేశాడు?
2. మాయాకంబళి కథా సారాంశాన్ని మీ సొంతమాటలలో రాయండి.
3. విద్యార్థులూ! మీరు మీ ఊహాశక్తితో ఒక కథను రాయండి.
4. గ్రంథాలయంలోని అద్భుత కథలను చదివి, ప్రశంసిస్తూ ఒక చిన్న కవిత రాయండి.



## భాషాంశాలు

### i. పదజాలం

**అ) కింద గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.**



1. పక్షులు <u>యథేచ్ఛగా</u> ఆకాశంలో తిరుగుతున్నాయి.

   ఉదా : యథేచ్ఛగా = స్వేచ్ఛగా
   మనం స్వేచ్ఛగా మనసులోని భావాలు చెప్పాలి.



https://amaravathiteacher.com

2. బియ్యం <u>చౌక</u> ధరకు అమ్ముతున్నారు.

..........................................................................................

3. చెడ్డ పనులు ఎవరైనా చేస్తే <u>అభ్యంతరం</u> చెప్పాలి.

..........................................................................................

4. చలి వేసినప్పుడు <u>గొంగళి</u> కప్పుకుంటాను.

..........................................................................................

**ఆ) కింది వాక్యాలలో సమానార్థక పదాలు గుర్తించి రాయండి.**

1. పర్వతాలు ఎత్తుగా ఉన్నాయి. ఆ ఎత్తైన శైలముల మీద చెట్లు ఉన్నాయి. ఆ గిరులు మంచుతో కప్పబడి ఉన్నాయి.

..........................................................................................

2. ఆ పట్టణంలో రాజు ఎంతో ఉత్తముడు. అందుకే ఆ భూపాలుడ్ని అందరూ నరేంద్రుడు అని పిలుస్తారు.

..........................................................................................

3. రాజు కరవాలంతో యుద్ధం చేస్తాడు. ఆ యుద్ధంలో ఖడ్గం శత్రువుల తలలను ఖండిస్తుంది.

..........................................................................................

**ఇ) కింది ప్రకృతికి వికృతిని జతపరచండి.**

**(ఉదాహరణ : పెరుగుతున్న నాగరికతను చూసి నేను <u>అచ్చెరువొం</u>దాను. (గీతగీసిన పదానికి ప్రకృతికి –వికృతి రాయండి.) జవాబు : ఆశ్చర్యము – అచ్చెరువు**

| | | | |
|---|---|---|---|
| 1. | రాత్రి | ( ) | అ) మొగము |
| 2. | రాజు | ( ) | ఆ) ఱేడు |
| 3. | ముఖము | ( ) | ఇ) సుకం |
| 4. | సుఖం | ( ) | ఈ) రాతిరి |

**ఈ) కింది పదాలను సొంతవాక్యాలలో ప్రయోగించండి.**

**ఉదా :** ఏకాగ్రత : ఏ విషయం మీదైనా <u>ఏకాగ్రత</u> పెట్టినట్లయితే విజయం సాధిస్తారు.

1) ప్రశాంతత : ..........................................................................

2) తిరుగుముఖం : ..........................................................................

3) ప్రలోభ పెట్టడం : ..........................................................................

4) శ్రేయస్సు : ..........................................................................

5) దురాశాపరులు : ..........................................................................

6) కంటపడకుండా : ..........................................................................

AP SCERT



https://amaravathiteacher.com

**ఉ) ఎటునుంచి చదివినా ఒకే పదంలా వచ్చే కచిక / భ్రమక పదాలకు (పద భ్రమణం) వాక్యాల ఆధారంగా జవాబులు రాయండి.**

భ్రమక పదాలు : ఎటునుంచి చదివినా ఒకటే





ఉదాహరణ : నటులు చేసేది – నటన

1. చింతకాయ రుచి ------------
2. శరీరాన్ని కప్పే వస్త్రానికి మరొక పేరు ------------
3. గాలి, వెలుతురు కోసం ఇంటికి పెట్టేది. ------------
4. ఇది తీయడమంటే నిద్రపోతున్నాడని అర్థం ------------
5. సముద్రపు ఆల్చిప్పలో వుండేది ------------

**ఇలాంటి మరికొన్ని పదాలను సేకరించి రాయండి.**

1. ------------ 4. ------------
2. ------------ 5. ------------
3. ------------ 6. ------------

## ii. వ్యాకరణాంశాలు




### విభాగం 1 : కింది తరగతి వ్యాకరణ పునశ్చరణ

**మనం కింది తరగతిలో ఈ అంశాలను నేర్చుకున్నాం :**

**1. లింగము మరియు వచనం (గుర్తుచేసుకుందాం!)**

మహద్వాచకము (పుంలింగము), మహతీ వాచకము (స్త్రీలింగము), అమహద్వాచకము (నపుసంక లింగము)లు అని మూడు రకాలుగా ఉంటాయని తెలుసుకున్నాం కదా!

**ఉదా :** రాజు – **మహద్వాచకము**, చంచల – **మహతీవాచకము**, కంబళి – **అమహద్వాచకము.**

**వచనం :** సంఖ్యను (ఒకటి లేదా ఎక్కువ) సూచిస్తుంది. (**ఉదా:** యోగి – ఏకవచనం, దొంగలు – బహువచనం).

**2. భాషాభాగాలు (గుర్తుచేసుకుందాం!)**

వాక్యంలో ప్రతి పదం ఒక ప్రత్యేకమైన 'ఉనికిని' కలిగి ఉంటుందని తెలుసుకున్నాం కదా. దీని ఆధారంగా భాషా భాగాలు 5 రకాలు అని కూడా తెలుసుకున్నాం.

- **నామవాచకం :** ఇది ఒక వ్యక్తి, వస్తువు, లేదా ప్రదేశం మొదలైన వాటి యొక్క 'పేరు'ను తెలుపుతుంది. (నామం అనగా పేరు అని అర్థం)
- **సర్వనామం :** ఇది 'నామవాచకమున'కు బదులుగా వాడే పదం (ఉదా: అతడు, ఆమె, అది, వారు).
- **విశేషణం :** నామవాచకం/సర్వనామం యొక్క లక్షణాన్ని (**ఉదా:** రంగు, గుణం, సంఖ్య మొదలైనవి) తెలుపుతుంది.
- **క్రియ :** ఇది వాక్యంలో జరిగిన 'పని'ని లేదా 'స్థితి'ని తెలుపుతుంది.
- **అవ్యయం :** ఇది లింగ, వచన, విభక్తులు చేరని పదం (**ఉదా:** అక్కడ, కానీ, మీద).



AP SCERT
https://amaravathiteacher.com

### 3. విభక్తులు (గుర్తుచేసుకుందాం!)

వాక్యంలో పదాల మధ్య 'సంబంధాన్ని' కలిపే 'ప్రత్యయాలను' విభక్తులు అంటారు. 6వ తరగతిలో మనం నేర్చుకున్న పూర్తి పట్టిక :

| విభక్తులు | ప్రత్యయాలు | వాడే సందర్భం / అర్థం | ఉదాహరణ వాక్యం |
|---|---|---|---|
| ప్రథమా | డు, ము, వు, లు | పేరును (కర్తను) సూచిస్తుంది | ఆత్మానందుడు ఉండేవాడు. |
| ద్వితీయా | నిన్, నున్, లన్, కూర్చి, గురించి | దేనిని? ఎవరిని? (కర్మ) | రాజు కంబళిని తీసుకున్నాడు. |
| తృతీయా | చేతన్, చేన్, తోడన్, తోన్ | దేనితో? ఎవరితో? (సాధనం) | బిచ్చగాడు చలితో బాధపడుతూ... |
| చతుర్థీ | కొఱకున్,కై (కోసం) | ఎవరి కోసం? దేని కోసం? ఉద్దేశించబడింది | రాజ్యశ్రేయస్సు కోసం చెబుతున్నాను. |
| పంచమీ | వలనన్, కంటెన్, పట్టి (నుండి) | ఎక్కడ నుండి? దేనికంటే? విడిపోయే స్థానం | దేశం నుండి బహిష్కరించాడు. |
| షష్ఠీ | కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్ | ఎవరిది? దేనిది? (సంబంధం) | రాజుకు ఇచ్చాడు. |
| సప్తమీ | అందున్, నన్, | ఎక్కడ? ఎప్పుడు? (స్థలం/సమయం) | వాడియందు మంచితనం ఉన్నది. |
| సంబోధనా ప్రథమా విభక్తి | ఓ, ఓయీ, ఓరీ, ఓసి | పిలుపు | "ఓ రాజా!" అని పిలిచాడు. |

## విభాగం 2 : అభ్యాసాలు

### అభ్యాసం 1: లింగము మరియు వచనం

పాఠం నుండి ఈ పదాలను గమనించి, అవి ఏ వాచకమో (లింగమో), ఏ వచనమో పట్టికలో రాయండి.

| | పదం | వాచకం (మహత్తు/మహతీ/అమహత్తు) | వచనం (ఏక/బహు) |
|---|---|---|---|
| ఉదా : | వృద్ధయోగి | మహద్వాచకం | ఏకవచనం |
| 1. | రాజు | | |
| 2. | కంబళి | | |
| 3. | పర్వతాలు | | |
| 4. | చంచల | | |
| 5. | ఆత్మానందుడు | | |
| 6. | నర్తకి | | |

AP SCERT



https://amaravathiteacher.com

**అభ్యాసం 2 : భాషాభాగాలు (గుర్తుచేసుకుందాం!)**

**పాఠంలోని ఈ వాక్యాన్ని పరిశీలించండి. ప్రతి పదానికి అది ఏ భాషాభాగమో (నామవాచకం, సర్వనామం, విశేషణం, క్రియ, అవ్యయం) రాయండి.**

"ఆయన తన పాత కంబళి మీద మంత్రజలం చల్లాడు."

1. ఆయన = ................ 4. కంబళి = ................ 7. చల్లాడు = ...........
2. తన = ................ 5. మీద = ................
3. పాత = ................ 6. మంత్రజలం = ................

**అభ్యాసం 3 : విభక్తులు**

**పాఠంలోని ఈ వాక్యాలలో, విభక్తి ప్రత్యయాలను గుర్తించి, గీత గీసి, ఆ విభక్తి పేరు రాయండి.**

1. ముదుసలి బిచ్చగాడు చలి**తో** బాధపడుతున్నాడు. విభక్తి : ..........................
2. చండీదత్తుడి మనస్సు**కు** కొంతప్రశాంతత చేకూరింది. విభక్తి : ..........................
3. నేను కూడా రాజ్య శ్రేయస్సు **కోసమే** చెబుతున్నాను. విభక్తి : ..........................
4. "స్వామీ, మీ కంబళిని మీరే ఉంచుకోండి" విభక్తి : ..........................
5. **ఓ** మహాప్రభూ! విభక్తి : ..........................
6. ఈ కంబళి **వల్ల (వలన)** నాకు ప్రాణహాని తప్ప శాంతిలేదు. విభక్తి : ..........................
7. "దేశం **నుండి** బహిష్కరించాడు." విభక్తి : ..........................
8. "హిమాలయ పర్వతాల**లో** ఆత్మానందుడనే యోగి ఉండేవాడు." విభక్తి : ..........................

**అభ్యాసం 4: తెలుగు సంధులు**

**కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.**

| సంధి పదం | విడదీసిన రూపం (పూర్వపదం + పరపదం) | సంధి పేరు (ఉత్వ/అత్వ/ఇత్వ) |
|---|---|---|
| **ఉదా :** నగరమంతా | నగరము + అంతా | ఉత్వ సంధి |
| 1. ఎవరైనా | ............. + ............. | ....................... |
| 2. మంచిదని | ............. + ............. | ....................... |
| 3. పోతుంటాడని | ............. + ............. | ....................... |
| 4. ఒప్పుకున్నదని | ............. + ............. | ....................... |
| 5. పనికిరాదని | ............. + ............. | ....................... |
| 6. నాకిష్టం | ............. + ............. | ....................... |
| 7. ఎందుకైనా | ............. + ............. | ....................... |
| 8. ఆత్మానందుడున్న | ............. + ............. | ....................... |

AP SCERT



https://amaravathiteacher.com

## నీతి పద్యం

తే॥గీ సర్వ తీర్థాభిగమనంబు సర్వవేద
సమధిగమము సత్యంబుతో సరియుగావు
ఎఱుగు మెల్ల ధర్మంబుల కెందు పెద్ద
యంద్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు.




**భావం :** పుణ్య నదులలో స్నానం చేయడం, సమస్త వేదాలు అధ్యయనం చేయడం ఒక్క సత్యానికి సాటిరావు. అన్ని ధర్మాల కంటే నిజం పలకడమే గొప్ప ధర్మం అని మునులు చెపుతారు. నన్నయ ఈ చిన్న పద్యంలో సత్యాన్ని దాని ప్రాధాన్యతను గురించి ఎంతో చక్కగా చెప్పాడు.

అశ్వమేధం వంటి యాగాలు చేయడం రాజులకే సాధ్యం. పుణ్యక్షేత్రాలు దర్శించడానికి ధనం ఉండాలి. నిజం చెప్పడానికి మాత్రం ఏమీ ఖర్చు లేదు. అయితే దాని ఫలితం ఎంతో విలువైనది. ఒక్క సత్యవాక్కు ఎంతటి పుణ్యాన్ని కలిగిస్తుందో, ఒక అబద్ధం అంతకంటే ఎక్కువ పాపాన్ని, నష్టాన్ని కలిగిస్తుందని గ్రహించాలి.

## మీకు తెలుసా?

**శతవిధాల** : శతవిధాలుగా అంటే వంద విధాలుగా చెప్పడం. ఏదైనా ఒక విషయాన్ని అనేక రకాలుగా తెలియజేస్తున్నారని తెలిపే పదబంధం.

**స్వానుభవం** : తనకు తాను ఏదైనా చేయడం ద్వారా అలవడే నేర్పు.

## నేనివి చేయగలనా?

1. పాఠంలోని కథను సొంత మాటల్లో చెప్పగలను. — ఔను/ కాదు
2. పాఠంలోని కథను నేను సొంతంగా చదవగలను. రాయగలను. — ఔను/ కాదు
3. పాఠంలోని పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించగలను. — ఔను/ కాదు.
4. కథను ఊహించి రాయగలను. — ఔను/ కాదు

## ఉపాధ్యాయులకు సూచనలు

1. విద్యార్థుల చేత పాఠాన్ని చక్కగా చదివించాలి.
2. విద్యార్థులకు కథలపట్ల ఆసక్తి కల్గించేలా మరిన్ని కథలు సేకరించి చదివించండి.
3. రచయిత కలువకొలను సదానంద కథలను సేకరించండి. పిల్లలకు పరిచయం చేయండి

**"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ"**
**జన్మనిచ్చిన తల్లి, జన్మనిచ్చిన భూమి స్వర్గం కంటే గొప్పవి.**

AP SCERT



https://amaravathiteacher.com

## చదవండి - ఆనందించండి

# మనిషి

యూనాను (గ్రీకు) దేశంలో జాంథస్ అనే పేరుగల ఒక ధనవంతుడు ఉండేవాడు.

ఈసఫ్ అనేవాడు అతనికి బానిసగా ఉండేవాడు. ఈసఫ్ తెలివితేటలు గలవాడు. జాంథస్ ఈసఫ్ ను ఒకనాడు ఇట్లా ఆదేశించాడు – 'పోయి చూచిరా, నీటి తొట్టి (బాత్ టబ్) వద్ద ఎందరు మనుషులు ఉన్నారు? అక్కడకు వెళ్ళి నేను స్నానం చేసి రావాలి.' తిరిగివచ్చి అతడు యజమానితో చెప్పాడు – 'అయ్యా నీటి తొట్టివద్ద ఒకేఒక మనిషి ఉన్నాడు. జాంథస్ ఈసఫ్ ను వెంట పెట్టుకొని స్నానాలగది దగ్గరకు వెళ్ళాడు. వెళ్ళి చూస్తే అక్కడ అడుగుతీసి అడుగుపెట్టటానికి కూడ చోటులేదు. ఆయనకు కోపం వచ్చింది. ఏమిరా అబద్ధం చెప్పావు. సిగ్గులేదా? వ్యర్థుడా! నీవు ఏమని చెప్పావు? స్నానాలతొట్టి దగ్గర ఒకేఒక మనిషి ఉన్నాడన్నావు. మరి ఈ గుంపు ఎక్కడనుండి వచ్చింది?



ఈసఫ్ వినయపూర్వకంగా ఇలా జవాబు చెప్పాడు. అయ్యా! నేను సరిగా ఉన్న విషయమే చెప్పాను. నేను ఇక్కడికి వచ్చేటప్పుడు త్రోవలో ఒక పెద్దరాయి పడివుంది. వచ్చేపోయేవాళ్ళకు అది తగులుతోంది. అది తగిలి వారు క్రింద పడుతున్నారు. దానిని తొలగిద్దామన్న ఆలోచన ఏ ఒక్కరికీ కలుగలేదు. కొంచెం సేపటి తరువాత ఒక వ్యక్తి అక్కడికి వచ్చాడు. అతడు తన శక్తి అంతా ఉపయోగించి త్రోవలోనుండి దానిని తొలగించాడు. స్నానాలగది వద్దకు వెళ్ళాను. అక్కడ ఒక నిరుపేద బిచ్చగత్తె నిలుచునివుండగా చూశాను. ఆమె చాలాసేపటినుండి అక్కడే నిలుచొనివుంది. స్నానం చేస్తున్నవారిని ఆమె నీరు అడిగింది. కాని ఏ ఒక్కరు ఆమెవైపు చూడలేదు. త్రోవలో రాయి తొలగించిన వ్యక్తే బిచ్చగత్తెకు మంచినీళ్ళు ఇచ్చాడు.

అయ్యా! ఇప్పుడు మీరే చెప్పండి. స్వార్థపరులు, తమకోసం తాము జీవించేవాళ్ళు ఇతరుల కష్టాన్ని తొలగించనివారు వీరు మనుషులుగా పిలవబడటానికి యోగ్యులా? నాకు మాత్రం అక్కడ ఆ ఒకేఒక వ్యక్తి కనిపించాడు. అతనిలో మానవత్వం వుంది. అందుకే నేను చెప్పాను అక్కడ ఒకే ఒక మనిషి ఉన్నాడు, అని. జాంథస్ కు ఇదంతా వినేసరికి ఎంతో సంతోషం వేసింది.

"నీవు నీకోసం బ్రతికితే అది పశు ప్రకృతి. నీవు ఇతరుల కోసం జీవిస్తే అది మానవ సంస్కృతి"

AP SCERT



https://amaravathiteacher.com

# 3 చిన్ని శిశువు

N8Q2V8

**అభ్యసన ఫలితాలు :**

- పదకవుల గురించి తెలుసుకొని, ఈ పాఠ్యభాగ కవిని గురించి తెలుసుకుంటారు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం -1)
- సంకీర్తనను అభినయిస్తూ, రాగయుక్తంగా పాడగలరు. (పాఠ్య ప్రణాళిక లక్ష్యం -2)
- చిన్ని శిశువు సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలరు, రాయగలరు. (పాఠ్య ప్రణాళిక లక్ష్యం -3)
- పద కవితలను సేకరించి ప్రదర్శిస్తారు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం -4)
- ఆగమ, వైకల్పిక సంధులను గురించి నేర్చుకుంటారు.(అత్వ, ఇత్వ సంధులు) (పాఠ్యప్రణాళిక లక్ష్యం -5)



## వినడం - ఆలోచించి మాట్లాడడం



1. పై చిత్రాలు చూడండి. చిత్రాల గురించి మాట్లాడండి.
2. పిల్లలు ఎవరెవరు ఏమి చేస్తున్నారో ఊహించి చెప్పండి.

**ఉద్దేశం :** తల్లిదండ్రులు తమకు పుట్టిన శిశువును చూసి ఆనందిస్తారు. ఆ చిన్నారిని కన్నా! చిన్నా! నాన్నా! బుజ్జీ! అని రకరకాల ముద్దు పేర్లతో పిలుస్తుంటారు. ఆ శిశువు నవ్వులు, చేష్టలు చూసి మురిసిపోతుంటారు. అలా అన్నమయ్య బాల కృష్ణుని బాల్యాన్ని ఊహించాడు. దానిని వర్ణించిన తీరును చెప్పడమే పాఠ్యాంశ ఉద్దేశం.

### కవి పరిచయం



**తాళ్ళపాక అన్నమాచార్యులు**

**(09.05.1408-23.02.1503)**

అన్నమాచార్యులు కడపజిల్లా, తాళ్ళపాక గ్రామంలో జన్మించారు. తల్లి లక్కమాంబ, తండ్రి నారాయణసూరి. అన్నమయ్య క్రీ.శ. 1408-1503 మధ్యకాలంలో జీవించాడు. అన్నమయ్య తెలుగులో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ 32 వేల సంకీర్తనలు రచించిన వాగ్గేయకారుడు. అవేగాక 12 శతకాలు, ద్విపదరామాయణం, సంకీర్తనలక్షణం, శృంగారమంజరి, వేంకటాచలమాహాత్మ్యం మొదలైనవి కూడా రచించారు. ఇందులో కొన్ని అలభ్య రచనలున్నాయి. అన్నమయ్య తన రచనలను శ్రీ వేంకటేశ్వర స్వామికి అంకితం చేశాడు. అన్నమయ్యకు 'పదకవితా పితామహుడు' అనే బిరుదు ఉంది.

AP SCERT



https://amaravathiteacher.com

# చిన్ని శిశువు



ప॥ చిన్ని శిశువూ చిన్ని శిశువూ
ఎన్నడుం జూడమమ్మ యిటువంటి శిశువూ ॥

చ॥ తోయంపు గురులతోడ దూగేటి శిరసు, చింత
కాయల వంటి జడలగముల తోడ
మ్రోయుచున్న కనకపు మువ్వల పాదాలతోడ
పాయక యశోదవెంట పాఱాడు శిశువూ ॥ ॥చిన్ని॥

చ॥ ముద్దుల వ్రేళ్ళతోడ మొరవంక యుంగరాల
నిద్దపుం జేతుల పైడి బొద్దుల తోడ
అద్దపుం జెక్కులతోడ అప్పలప్పలని నంత
గద్దించి యశోదమేను కౌగిలించు శిశువూ ॥ ॥చిన్ని॥

చ॥ బలుపైన పొట్టమీది పాలచారలతోడ
నులివేడి వెన్న దిన్న నోరి తోడ
చెలగి నేడిదె వచ్చి శ్రీవేంకటాద్రిపై
నిలిచి లోకములెల్ల నిలిపిన శిశువూ ॥ ॥చిన్ని॥

## సారాంశం

అన్నమయ్య భక్తిభావంతో చిన్నికృష్ణుని బాల్య చేష్టలను కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు. అమ్మలారా! ఇలాంటి చిన్ని శిశువును ముందెన్నడూ చూడలేదు. ఈ చిన్ని శిశువు తన శిరస్సును మాటిమాటికి ఊపుతున్నాడు. అతని జడలు చింతకాయల వలె వంకరలు తిరిగి ఊగుతున్నాయి. తన లేలేత పాదాలకు ఉన్న బంగారు గజ్జెలకు ఉన్న మువ్వలు ఘల్లు ఘల్లుమని మ్రోగుతున్నాయి. అలా ముద్దు లొలికే శిశువు తల్లి యశోదను విడవకుండా అంటి పెట్టుకొని తిరుగుతున్నాడు.

చిన్నికృష్ణుని మృదువైన చేతివేళ్ళు ముద్దొస్తున్నాయి. ఆ శిశువు చేతి వేళ్ళకు మెరిసే ఉంగరాలున్నాయి. అతని చెక్కిళ్ళు అద్దం వలె మెరుస్తున్నాయి. చిన్నతండ్రీ ! చిన్నతండ్రీ ! అనగానే చిన్నికృష్ణుడు ఆనందంతో అరుస్తూ కేరింతలు కొడుతున్నాడు. యశోద దగ్గరకు వెళ్ళి ఆమెను గట్టిగా కౌగిలించుకున్నాడు.

చిన్నికృష్ణుడు కడుపునిండా పాలు తాగాడు. తన బొజ్జ మీద కట్టిన పాలచారలు కనిపిస్తున్నాయి. నోటిలో నులివెచ్చని వెన్న ఉంది. అలాంటి చిన్ని శిశువు నేడు వేంకటాచలంపై నిలిచి వేంకటేశ్వరునిగా దర్శనమిస్తున్నాడు. ఈ లోకాలన్నింటినీ కాపాడుతున్నాడని అన్నమయ్య వివరించాడు.

AP SCERT



https://amaravathiteacher.com



## ఇవి చేయండి

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

శిశువు, శిరసు, మువ్వలు, పైడి, మేను, కురులు, గద్దించి, కీర్తన, వెన్న, కౌగిలించు, వాగ్గేయకారుడు, చెక్కులు, తోయం, బలుపు, మొరవంక, బొద్దు



## అవగాహన - ప్రతిస్పందన

1. చిన్ని శిశువు గేయాన్ని భావయుక్తంగా, రాగయుక్తంగా పాడండి.
2. పిల్లల బాల్యాన్ని మీ సొంత మాటల్లో చెప్పండి.
3. తల్లికి బిడ్డలపై ఎలాంటి మమకారం ఉంటుందో చెప్పండి.

**4. కింది కీర్తనను చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

జో అచ్యుతానంద జోజో ముకుందా
రావె పరమానంద, రామ గోవిందా జోజో జోజో

నందునింటను జేరి నయముమీరంగా
చంద్రవదనలు నీకు సేవచేయంగా
అందముగ వారిండ్ల ఆడుచుండంగా
మందలకు దొంగ మా ముద్దురంగా జోజో జోజో

పాలవారాశిలో పవళించినావు,
బాలుగా మునులకు అభయమిచ్చినావు,
మేలుగా వసుదేవుకుదయించినావు,
బాలుడై ఉండి గోపాలుడైనావూ జోజో జోజో



AP SCERT

### ప్రశ్నలు

1. అన్నమయ్య జోల పాటలో ఎవరిని గురించి వర్ణించాడు?
2. కృష్ణుడు ఎవరి ఇంట పెరిగాడు?
3. కృష్ణుడు ఎవరికి పుత్రుడుగా జన్మించాడు?
4. మునులకు అభయమిచ్చినది ఎవరు?



https://amaravathiteacher.com



## వ్యక్తీకరణ - సృజనాత్మకత



**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. చిన్ని కృష్ణుడు ఎలాంటి ఆభరణాలు ధరించాడు ?
2. అన్నమయ్యను గురించి రాయండి.

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. చిన్ని శిశువు పాఠ్యభాగ సారాంశాన్ని సొంత మాటల్లో రాయండి ?
2. అన్నమయ్య చెప్పిన శిశువుకి మీరు చూసిన శిశువుకి గల పోలికలు రాయండి ?
3. మీరు చూసిన శిశువు గురించి రెండు పేరాలతో వ్యాసం రాయండి.
4. చిన్నపిల్లల చేష్టల గురించి మీ మాటల్లో రాయండి.



## భాషాంశాలు

### i. పదజాలం

**అ) కింది గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంత వాక్యాలు రాయండి.**

ఉదా : ఈ రోజు పైడి ధర పెరిగింది.

పైడి = బంగారం


స్త్రీలకు బంగారు ఆభరణాలు శోభనిస్తాయి.



1. చిన్ని కృష్ణుడికి నవనీతం అంటే ఇష్టం.
2. చిన్న పిల్లల కురులు నిగనిగలాడుతుంటాయి.
3. తల్లికి శిశువు సంరక్షణ ముఖ్యం.
4. గణపతికి ఏనుగు శిరస్సు ఉంటుంది.

**ఆ) కింది వాక్యాలలో సమానార్థక పదాలు (పర్యాయ పదాలు) గుర్తించి రాయండి.**

ఉదా : మేను = దేహం, తనువు, కాయం



1. ఇది పుత్తడి బొమ్మ, అది స్వర్ణ దేవాలయం.

   బంగారం ………………, ………………….

2. కిటికి దర్పణం బాగుంది. రేఖ చేతిలో ముకురం ఉంది.

   అద్దం ………………, ………………….

3. మా అయ్య పొలానికి వెళ్ళాడు. మా స్నేహితుని నాన్న ఉపాధ్యాయుడు.

   తండ్రి ………………, ………………….

4. ఆమె శిరోజాలు పొడవుగా ఉన్నాయి, ఈమె కేశాలు పొట్టిగా ఉన్నాయి.

   కురులు ………………, ………………….

AP SCERT



https://amaravathiteacher.com

**ఇ) కిందివానిలో ప్రకృతి, వికృతులను జతపరచండి.**

| | | |
|---|---|---|
| 1. ఫలం | ( ) | 1. నీరు |
| 2. నీరము | ( ) | 2. కన్నడు |
| 3. భృంగారం | ( ) | 3. పండు |
| 4. కృష్ణుడు | ( ) | 4. సిరి |
| 5. శ్రీ | ( ) | 5. బంగారం |



**ఈ) కింది పదాలకు వ్యతిరేకార్థక పదాలు రాయండి.**

1. చిన్న × ------------
2. వచ్చు × ------------
3. తిని × ------------
4. పైన × ------------
5. వేడి × ------------

**ఉ) కింది పదపట్టికను చదవండి. పట్టిక ఆధారంగా కొన్ని పదాలు రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| శి | శు | వు | వె | న్న |
| ర | కౌ | గి | లిం | చు |
| సు | ము | వ్వ | లు | పా |
| పై | ముం | గు | రు | లు |
| డి | అ | న్న | మ | య్య |

ఉదా : ముఠ్వలు

1. ----------
2. ----------
3. ----------
4. ----------
5. ----------

## ii. వ్యాకరణాంశాలు

**వ్యాకరణం : (ఆగమ సంధులు, బహుళం, వైకల్పికం)**

**విభాగం 1 : కొత్త అంశం – యడాగమం (స్నేహితుడిలా వచ్చి చేరడం)**

పిల్లలూ, మనం ఇదివరకే అత్వ, ఇత్వ, ఉత్వ సంధులను నేర్చుకున్నాం కదా! ఆ సంధులలో, పూర్వ పదం చివరి అచ్చు, పర పదం మొదట్లో ఉన్న అచ్చు రెండింటి స్థానంలో పరపదంలో ఉన్న అచ్చే వచ్చి చేరింది. ఇలా రెండు అక్షరాల స్థానంలో ఒకే అక్షరం శత్రువులా వచ్చి చేరడాన్ని ఏకాదేశం అంటారని తెలుసుకున్నాం కదా! కానీ, కొన్నిసార్లు రెండు అచ్చులు కలవవు. అంటే సంధి జరగదు. ఇప్పుడు దీన్ని శాస్త్రవేత్తలా పరిశీలిద్దాం!



https://amaravathiteacher.com

**ఈ పదాలను పలకడానికి ప్రయత్నించండి :**




- మా + అమ్మ = మా అమ్మ
- నా + ఇల్లు = నా ఇల్లు

ఇలా మా అమ్మ అని మధ్యలో ఆపి పలకడం మన తెలుగు భాషా ప్రవాహానికి ఇబ్బందిగా ఉంది కదూ! ఒకవేళ కలిపి వేగంగా పలికితే (సంధి జరిగితే) మామ్మ అని అర్థం మారిపోతుంది.

- **పరిష్కారం :** మనం సహజంగా మాట్లాడేటప్పుడు, ఆ రెండు అచ్చుల మధ్య ఖాళీని పూరించడానికి, ఒక కొత్త ధ్వనిని స్నేహితుడిలా తెచ్చిపెడతాం. గమనించండి:
- మా + య్ + అమ్మ = మాయమ్మ
- నా + య్ + ఇల్లు = నాయిల్లు

ఇలా, సంధి జరగని చోట, రెండు అచ్చుల మధ్య అదనంగా, ఒక స్నేహితుడిలా 'య్' కారం వచ్చి చేరడాన్నే "యడాగమం" అంటారు.

- యట్ + ఆగమం = యడాగమం. ('యట్' అంటే 'య్' కారం, 'ఆగమం' అంటే 'అదనంగా వచ్చి చేరడం').

ఈ యడాగమాన్ని చిన్నయ సూరి గారు సూత్రంలో ఇలా చెప్పారు **"సంధి లేనిచోట స్వరంబుకంటె పరంబయిన స్వరంబునకు యడాగమంబగు."**

## విభాగం 2: అత్వ సంధి బహుళము.

మనం ఇంతకు ముందు మేన + అత్త = మేనత్త (అత్వ సంధి) అని నేర్చుకున్నాం. కానీ, ఇప్పుడు 'యడాగమం' గురించి కూడా తెలుసుకున్నాం కదా.

శాస్త్రవేత్తలా పరిశీలిద్దాం!

మేన+అత్త అనే పదాలకు రెండు రూపాలు వస్తాయి

1. సంధి జరిగిన రూపం (సంధి జరిగితే) :

   మేన్ + అ + అత్త = మేన్ + అత్త = మేనత్త (ఇది అత్వ సంధి రూపం)

2. సంధి జరగని రూపం (యడాగమం వస్తే) :

   మేన + అత్త = మేన + య్ + అత్త = మేనయత్త (ఇది యడాగమం రూపం)

అంటే, 'అ' కారం వచ్చినప్పుడు సంధి కొన్నిసార్లు జరుగుతుంది (నిత్యం), కొన్నిసార్లు జరగదు (నిషేధం), ఒకసారి జరుగుతుంది, ఒకసారి జరగదు (వైకల్పికం), మరికొన్నిసార్లు వేరేలా కూడా జరుగుతుంది (అన్యవిధం) (**ఉదా:** అమ్మ యిచ్చెను) (యడాగమం వస్తుంది.) చింత + ఆకు = చింతాకు ఇక్కడ యడాగమం రాదు. అంటే ఇక్కడ సంధి నిత్యంగా జరుగుతుంది. అందువల్ల అత్వసంధి బహుళం.

AP SCERT



https://amaravathiteacher.com

### విభాగం 3 : ఇత్వ సంధి వైకల్పికం

అత్వ సంధి బహుళం అని తెలుసుకున్నాం కదా! మరి 'ఇత్వ' సంగతి ఏమిటి? శాస్త్రవేత్తలా పరిశీలిద్దాం! ఏమి + అంటివి అనే పదాన్ని గమనిద్దాం. దీనికి కూడా రెండు రూపాలూ సరైనవే!

1. సంధి జరిగిన రూపం :

   ఏమ్ + (ఇ) + అంటివి = ఏమ్ + అంటివి = ఏమంటివి

2. సంధి జరగని రూపం (యడాగమం వస్తే) :

   ఏమి + అంటివి = ఏమి + య్ + అంటివి = ఏమియంటివి

   ఇక్కడ సంధి జరగలేదు, యడాగమం వచ్చింది.

అంటే, 'ఇ' కారం వచ్చినప్పుడు సంధి జరగడం అనేది "వైకల్పికం".

"వైకల్పికం" అంటే "జరగవచ్చు (సంధి రూపం), లేదా జరగకపోవచ్చు (యడాగమ రూపం)" అని అర్థం.

- **ఉత్వ సంధి :** సంధి జరుగుతుంది. (ఉదా : రాముడతడు ఒక్కరూపమే వస్తుంది.)
- **అత్వ సంధి** : బహుళం (ఉదా : మేనత్త మరియు మేనయత్త రెండూ సాధ్యమే)
- **ఇత్వ సంధి :** వైకల్పికం (ఉదా : ఏమంటివి మరియు ఏమియంటివి రెండూ సరైనవే!)

### విభాగం 4 : వ్యాకరణ అభ్యాసాలు

#### అభ్యాసం 1 : యడాగమం

కింది పదాలు యడాగమం ('య్' చేరడం) వలన ఏర్పడ్డాయి. వాటిని విడదీసి, మధ్యలో చేరిన 'య్' కారాన్ని గుర్తించండి.

1. మాయమ్మ = మా + య్ + అమ్మ
2. తేయాకు = ....................................
3. నాయిల్లు = ....................................
4. పనియేమిటి = ....................................

#### అభ్యాసం 2: అత్వ సంధి బహుళం

కింది పదాలకు సంధి జరిగిన రూపం (అత్వ సంధి) మరియు సంధి జరగని రూపం (యడాగమం) రెండూ రాయండి.

| పదాలు | సంధి జరిగిన రూపం | సంధి జరగని రూపం ('య్' చేరితే) |
|---|---|---|
| ఉదా : మేన + అత్త | మేనత్త | మేనయత్త |
| 1. చూడక + ఉండెను | | |
| 2. రాక + ఏమి | | |
| 3. వేప + ఆకు | | యడాగమం రాదు నిత్యం |

AP SCERT



https://amaravathiteacher.com

### అభ్యాసం 3: ఇత్వ సంధి వైకల్పికం

కింది పదాలకు సంధి జరిగిన రూపం (ఇత్వ సంధి) మరియు సంధి జరగని రూపం (యడాగమం) రెండూ రాయండి.

| పదాలు | సంధి జరిగిన రూపం ('ఇ' మాయం అయితే) | సంధి జరగని రూపం ('య్' చేరితే) |
|---|---|---|
| ఉదా: ఏమి + అంటివి | ఏమంటివి | ఏమియంటివి |
| 1. ఏమి + అనిరి | | |
| 2. అది + ఎట్లు | | |
| 3. మఱి + ఏమి | | |

### అభ్యాసం 4 : తెలుగు సంధులు

కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.

| సంధి పదం | విడదీసిన రూపం (పూర్వపదం ం పరపదం) | సంధి పేరు (ఉత్వ/అత్వ/ఇత్వ) |
|---|---|---|
| ఉదా : చూడమమ్మ | చూడము + అమ్మ | ఉత్వ సంధి |
| 1. రాజతడు | + | |
| 2. భయమేల | + | |
| 3. ఎవరితడు | + | |
| 4. లేదన్నది | + | |
| 5. చూచినప్పుడు | + | |
| 6. చెప్పినిప్పుడు | + | |

### అభ్యాసం 5 : సమాసాలు (ద్వంద్వ, ద్విగు)

ద్వంద్వ (రెండు పదాలూ ముఖ్యమే) మరియు ద్విగు (మొదటి పదం 'సంఖ్య') సమాసాల నియమాలను గుర్తుచేసుకుంటూ, విగ్రహ వాక్యాలు రాసి, సమాసం పేరును గుర్తించండి.

| సమాస పదం | విగ్రహ వాక్యం | సమాసం పేరు (ద్వంద్వ/ద్విగు) |
|---|---|---|
| ఉదా : భార్యాభర్తలు | భార్యయును, భర్తయును | ద్వంద్వ సమాసం |
| 1. పంచభూతాలు | | |
| 2. నవగ్రహాలు | | |
| 3. చదువుసంధ్యలు | | |
| 4. ముప్పదిరెండు వేల సంకీర్తనలు | | |
| 5. ఆలుమగలు | | |
| 6. కష్టసుఖాలు | | |

AP SCERT



https://amaravathiteacher.com

## చమత్కార పద్యం

యోధెవ్వడు కురుబలమున?
మాధవ సఖుడేమి యెక్కి మరి తిరుగాడున్?
సాధించెనెవని రాముడు?
రాధేయుడు నందినెక్కి రావణుగెల్చెన్.



(పై మూడు పాదాలలోని ప్రశ్నలకు సమాధానం చివరి పాదంలోనే ఉంది.)

**భావం :** కౌరవసైన్యంలోయోధుడెవరు? శివుడు ఏ వాహనాన్ని ఎక్కి తిరుగుతాడు? రాముడు ఎవరిపై విజయాన్ని సాధించాడు? కర్ణుడు, నందినెక్కి, రావణాసురుని గెల్చాడు.

## ప్రాజెక్టుపని

1. అన్నమయ్య కీర్తనలను మరికొన్ని సేకరించండి. వాటిని చార్టుమీద రాసి ప్రదర్శించండి.
2. త్యాగయ్య కీర్తనలను సేకరించండి. వాటిని చార్టుమీద రాసి ప్రదర్శించండి.

## మీకు తెలుసా?

| | | | | | |
|---|---|---|---|---|---|
| **చతుర్దశ భువనాలు** | : | 14 లోకాలు (సప్త అథోలోకాలు – 7, సప్త ఊర్ధ్వ లోకాలు – 7) | | | |
| **సప్త అథో లోకాలు** | : | 1. అతలం | 2. వితలం | 3. సుతలం | 4. తలాతలం |
| | | 5. రసాతలం | 6. మహాతలం | 7. పాతాళం | |
| **సప్త ఊర్ధ్వ లోకాలు** | : | 1. భూలోకం | 2. భువర్లోకం | 3. సువర్లోకం | 4. మహర్లోకం |
| | | 5. జనోలోకం | 6. తపోలోకం | 7. సత్యలోకం | |

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | చిన్ని శిశువు గేయాన్ని భావయుక్తంగా, రాగయుక్తంగా పాడగలను. | ఔను / కాదు |
| 2. | కీర్తనలోని భావాలను, సొంత మాటలలో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | కీర్తనలోని పదాలను సొంతవాక్యాలలో ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 4. | చిన్నపిల్లల చేష్టలను గురించి రాయగలను. | ఔను / కాదు |

## ఉపాధ్యాయులకు సూచనలు

1. అన్నమయ్య సంకీర్తనలను సేకరించండి. వాటిని వినండి.
2. అన్నమయ్య సంకీర్తనలను పాడే విధానాన్ని విద్యార్థులకు తెలపండి.

AP SCERT



https://amaravathiteacher.com

చదవండి - ఆనందించండి

## సత్యవ్రతం (ప్రహ్లాదుడు–హరిభక్తి)

“నారాయణ ! నారాయణ ! అని ఉచ్చరిస్తుంటావు.ఎవరీ నారాయణుడు ? ఎక్కడ ఉంటాడు ? అతని గుణాలు ఏమిటి? ఏమి చేయగలడు?” అని హిరణ్యకశిపుడు తన పుత్రుణ్ణి అడిగాడు. ‘తండ్రీ ! నారాయణుడంటే సృష్టికర్త, సర్వశక్తిమంతుడు అన్నాడు ప్రహ్లాదుడు. ‘చాలించు నీ ప్రలాపం’ తండ్రికి కోపం వచ్చింది. ‘లేదు తండ్రీ! ఇది సత్యం. ఆయన సర్వ వ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తి మంతుడు’.

‘నేనే సర్వశక్తిమంతుణ్ణి మూర్ఖుడా! నేనే ఈశ్వరుణ్ణి. నారాయణ, నారాయణ అనే జపం మాని ఇకనుండి నీవు నా నామాన్ని జపించాలి. తెలిసిందా!’ ‘లేదు...లేదు, మీరు నాకు తండ్రి..., పూజ్యులు’ కాని నేను మీ నామాన్ని జపించలేను. మిమ్మల్ని తండ్రిగా గౌరవించగలను’ అన్నాడు ప్రహ్లాదుడు.

రాజైన హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడు చెప్పినట్లు వినలేదని, కష్టాలకు లోనుచేసి చంపవలసినదిగా మంత్రిగారిని ఆదేశించాడు. ప్రహ్లాదుణ్ణి సముద్రంలో ముంచారు. కొండపై నుండి క్రిందకు త్రోశారు. కాని ప్రహ్లాదునికి ఏమీ కాలేదు. హోలికాదేవి ప్రహ్లాదుని తీసుకొని అగ్నిలో దూకింది. ఆమె అగ్నిలో దూకి భస్మం అయింది. కాని ప్రహ్లాదుడు క్షేమంగా ఉన్నాడు. చివరికి మళ్ళీ ప్రహ్లాదునికి నచ్చచెప్పాలని ప్రయత్నించారు. కాని అతను అంగీకరించలేదు. అతని నోటినుండి కేవలం ‘నారాయణ! నారాయణ ! అనే మాటలు మాత్రమే వస్తున్నాయి. అప్పుడు హిరణ్యకశిపుడు ‘ఈ స్తంభంలో నారాయణుణ్ణి చూపించగలవా?’ అని ప్రహ్లాదుణ్ణి ప్రశ్నించాడు.



‘తండ్రీ! నారాయణుడు ఇందుగలడు, అందులేడనే సందేహం వద్దు. అంతటా వ్యాపించి ఉంటాడు’ అని చెప్పాడు. వెంటనే హిరణ్యకశిపుడు తన గదతో ఆ స్తంభాన్ని గట్టిగా కొట్టాడు. అందులో నుండి నృసింహస్వామి ప్రత్యక్షమైనాడు. ఆయన ప్రహ్లాదుని తండ్రియైన హిరణ్యకశిపుని వధించాడు. భక్తుడైన ప్రహ్లాదుణ్ణి ఆశీర్వదించి వరం ఇచ్చాడు. (‘నీవు తేజశ్శాలివి అవుతావు, మహాత్ముడివి అవుతావు. విద్వాంసుడవు అవుతావు’ అలా చెప్పి ఆయన అంతర్ధానమైనాడు.) ప్రహ్లాదుడు ధన్యుడు. అతని హరిభక్తి ధన్యం.

AP SCERT

నిష్కల్మషమైన ప్రేమతో భగవంతుడుకి పూర్తిగా శరణాగతి చెందడమే నిజమైన భక్తి



https://amaravathiteacher.com

# 4 మఱ్ఱిచెట్టు

Q9F3C5

**అభ్యసన ఫలితాలు :**

- పరిసరాలలో ఉండే చెట్లు, జంతువులు, పక్షులు మొదలైన వాటి అనుభవాలను తమంతట తాము ఎలా వివరిస్తాయో తెలుసుకుంటారు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం -1)
- మఱ్ఱిచెట్టు పాఠం లోని వాక్యాలను వాచక, అభినయంతో చదవడం ద్వారా ప్రకృతితో తాదాత్మ్యం చెందుతారు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం -2)
- మఱ్ఱిచెట్టు స్వభావాన్ని , పద విభాగాలు వంటి భాషానియమాలు అనుసరిస్తూ చదవగలరు, రాయగలరు. (పాఠ్యప్రణాళిక లక్ష్యం -3)
- వివిధ రకాల చెట్లను గుర్తించి, వాటి చిత్రాలను గీసి, ప్రదర్శిస్తారు. (పాఠ్య ప్రణాళిక లక్ష్యం-4)
- క్రియా కాలాల ప్రత్యేకతలు గురించి సవివరంగా తెలుసుకుంటారు. (పాఠ్య ప్రణాళిక లక్ష్యం-5)

**వినడం - ఆలోచించి మాట్లాడడం**

1. చిత్రాన్ని గమనించండి. మాట్లాడండి.



**ఉద్దేశం :** నిత్యం మన పరిసరాలలో చెట్లు, జంతువులు, పక్షులు వంటి మూగజీవులను చూస్తుంటాం. వాటికి కూడా కొన్ని ఆలోచనలు - అనుభవాలు - అనుభూతులు ఉంటాయి. వాటిని అవి తమ మాటల్లో వివరిస్తే ఎలా ఉంటుందో చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

**కవి పరిచయం**



**త్రిపురనేని గోపీచంద్**

**(08.09.1910 - 02.11.1962)**

త్రిపురనేని గోపీచంద్ కృష్ణాజిల్లా అంగలూరు గ్రామంలో జన్మించారు. తండ్రి త్రిపురనేని రామస్వామి. తల్లి పున్నమాంబ. ధర్మవడ్డీ, మమకారం, తండ్రులు కొడుకులు, మాకు ఉన్నాయి స్వగతాలు, పోస్టు చేయని ఉత్తరాలు వంటి రచనలు చేశారు. వీరి 'పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా' అనే రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.




https://amaravathiteacher.com

# మఱ్ఱిచెట్టు


నేనిప్పుడే చెరువుగట్టుమీద మొద్దునై పడి ఉన్నాను. నా మొదలు రంపంతో కోసి పైభాగాన్నంతా కట్టెల క్రింద కొట్టారు. పది పన్నెండు కుటుంబాలవాళ్ళు ఆ కట్టెలను లాట్ల క్రింద పంచుకున్నారు. కొన్నిలాట్లు అమ్మి వేశారు. వాళ్ళు నన్ను ముక్కలక్రింద నరకటంలో లభించే లాభాన్నే చూచుకున్నారు కాని, ఒక జీవిని యిట్టే నాశనం చేస్తున్నామే–అని ఆలోచించలేదు.

నేను పుట్టినప్పటి నుంచీ ఈ చెరువు గట్టునే ఉన్నాను. ఈ చెరువుగట్టునే పుట్టాను కూడా. నేను పెరిగి పెద్దదాన్నయిన తరువాత ఊళ్లో రైతులందరూ నా క్రింద కూర్చునే కబుర్లు చెప్పుకుంటూ, ముఖమార్జన చేసేవారు. ఈవూళ్లో యెవరికీ తెలియని సంగతులన్నీ నాకు తెలుసు. ఎవరికివారు తామే ఉన్నామనుకొని చెప్పుకొనే రహస్యాలన్నీ యెంత వొద్దనుకున్నా నా చెవిలో పడుతుండేవి. నేను ఆ రహస్యాలను మనసులో పెట్టుకుని వుండేదాన్నే గాని, ఏ పరిస్థితుల్లోనూ మరొకరి చెవిని పడనిచ్చేదాన్ని కాదు.



AP SCERT

పనులులేని రోజుల్లో గ్రామస్థులకు నేనే ఆశ్రయం. కలిసి కబుర్లు చెప్పుకోడానికి, కాలక్షేపానికి, పట్టణాల్లో పెద్ద పెద్దక్లబ్బులు వుంటాయని నేను విన్నాను. ఈ మధ్య మా గ్రామంలోని కుర్రకారు యెక్కువమంది పట్టణానికి వెళ్ళి రావటం మొదలు పెట్టారు. కొంతమంది చదువునెపంతో అక్కడే వుంటున్నారు. బడి ఉన్నంతకాలం అక్కడే వుండి, సెలవులకు ఇండ్లకు వస్తూండేవారు. క్లబ్బు సంగతి వాళ్ళు చెప్పుకుంటూ వుంటే నేను విన్నాను. ఆ క్లబ్బులో మంచి ఆటలుంటాయట. పెద్ద పెద్ద వాళ్ళందరూ ఒస్తూ వుంటారట. ప్రపంచంలో జరిగే సంగతులన్నీ అక్కడకు వెళ్ళేవాళ్ళకు తెలుస్తూంటాయట. అక్కడ గాలికోసం పెద్ద పెద్ద ఫ్యానులుంటాయట. వాళ్ళ మాటలు వింటూవుంటే వాళ్ళ అమాయకత్వానికి నాకు నవ్వువచ్చేది. క్లబ్బును గురించి యెందుకింత గొప్పగా చెప్పుకుంటారా – అని విస్తుపోయేదాన్ని.





https://amaravathiteacher.com

ఆ క్లబ్బులు చేసేపని తరతరాల నుంచీ నేను చేస్తున్నపనే. పిల్లలు, పెద్దలూ అందరూ కాలక్షేపానికి నా దగ్గరకు వచ్చేవాళ్ళు. నా నీడలో కూర్చుని అనేక విషయాలు చెప్పుకుంటూ వుండేవారు. పులిజూదం మొదలయిన ఆటలు యెన్నో ఆడుకుంటూ వుండేవారు. నేను వారికి శ్రమ కలగకుండా గాలివీస్తూ వుండేదాన్ని. దాహమయితే చెరువులో నీళ్ళు దోసిళ్ళతో త్రాగి మళ్ళీ వచ్చి నా నీడను కూర్చొని విశ్రాంతి తీసుకుంటూ వుండేవారు. నా నీడనూ గాలిని అలవాటు పడినవాళ్ళు యింట్లో ఒక్కక్షణం వుండేవారు కాదంటే మీరు నామాట నిస్సంకోచంగా నమ్మవచ్చు.



ఇక క్రొత్తగా ఈ క్లబ్బులు వచ్చి చేస్తున్నదేమిటో! నేను వాళ్ళ కంటికి అలవాటైపోయినదాన్ని, పైగా ఆశ్రయం యిచ్చినందుకు వాళ్ళను నేనేమి అర్థించను. వాళ్ళతో దమ్మిడీ ఖర్చు పెట్టించను. అందువల్ల నేనంటే వాళ్ళకు విలువలేకుండా పోయింది. దీనికి తగినట్టు యీ కాలం కుర్రకారు, చీటికీ మాటికీ పట్టణంపోయి, ఎక్కువ కాలం అక్కడే గడుపుతున్నారు. అందువల్ల నావంటి వాళ్ళమీద వాళ్ళదృష్టి పడటంలేదు.

నిజానికి, సహజంగా నాకున్న అపేక్షవల్లగాని, ఈ గ్రామస్థులను ఆదరణగా చూడవలసిన అపేక్షలేదు. అంటే నే వారికి ఏ విధంగానూ ఋణపడిలేను – నేను వొకరు నాటగా మొలిచినదాన్ని కాదు. ఎవరో దయదలచి ఇంత ఎరువూ, నీరూ పొయ్యగా పెరిగిన దానినికాదు. ఏ గాలికో, విత్తుగా వుండగా, కొట్టుకువచ్చి ఈ చెరువుగట్టు మీద పడివుంటాను, ఏ కాకిముక్కు నుండో జారిపడివుంటాను. ఎక్కువగా ఊహలేని ఆ చిన్నతనంలో ఏం జరిగిందో ఇదమిద్ధమని చెప్పలేను గాని, నేను నా బ్రతుకు ఎప్పుడూ ఎవ్వరిమీదా ఆధారపడలేదని నాకు స్పష్టంగా జ్ఞాపకం వుంది.

ఒకరిమీద ఆధారపడవలసిన అవుసరం నాకేమి ఉంది! నాకు కావలసింది ఏమంత గనుక! నేను పడిన భూప్రదేశంలో వున్న సత్తువే నాకు చాలు. అప్పుడప్పుడూ పడే వర్షపు జల్లులూ, భూమిలో వున్న నిమ్మేచాలు నాకు. కాస్త పెరిగి పెద్దదాన్నయిన తరువాత నా వేళ్లే నాకు కావలసిన ఆహారాన్ని సమకూర్చి పెట్టినై. మనుష్యుల్లో జరుగుతున్నట్లు నేను బ్రతకటానికి మరొకరిని కష్టపెట్టవలసిన అవసరం నాకు లేదు. ఎవ్వరికీ కించిత్ నష్టం కలిగించకుండా నేను బ్రతుకగలను.

నా బ్రతుకులో స్వార్థంలేదు. నేను యేదికోరీ బ్రతకటంలేదు. నాకేదైనా కోరికవుంటే వీలైనంతవరకు యితరులకు సహాయపడటమే ఆ కోరిక. ఈ కోరిక కూడా నేను తెచ్చిపెట్టుకుంది కాదు. నా స్వభావంలో వుంది.

నా నీడన మనుష్యులు చల్లదనాన్ని అనుభవిస్తూ విశ్రాంతిని పొందుతూ వుండగా నాపైన కొమ్మల్లో రకరకాల పక్షులు గూళ్ళుకట్టుకొని కాపురం చేస్తూ వుండేవి. అవీ నావంటివే. వాటికి స్వార్థం అనేది లేదు. బ్రతుకులోవున్న ఆనందం కోసం ఒకరిని యిబ్బంది పెట్టకుండా బ్రతుకుతున్న నిస్వార్థజీవులు అవి.



https://amaravathiteacher.com
APSCERT

ఒక్కొక్కప్పుడు అటువంటివాటిని కూడా యిబ్బంది పెడుతుండేవారు, మానవులం అనుకునేవారు. అవి తమమీద రెట్టలు వేస్తున్నవనే నెపంతో, రాళ్ళు విసిరి నా ఆశ్రయం నుంచి వాటిని వెళ్ళ గొట్టటానికి ప్రయత్నిస్తూ వుండేవారు. అప్పుడు భయపడిపోయి అవిచేసే గోల వినటానికి నాకు హృదయవిదారకంగా వుండేది. ఒక ప్రక్క వాళ్ళ దెబ్బలను భరించలేక, వేరొకప్రక్క గూళ్ళల్లో వున్న పిల్లలను విడిచిపెట్టి వెళ్ళలేక గుండెలు అవిసిపోయేటట్టు అరుస్తూ రెక్కలు కొట్టుకుంటూ గూళ్ళచుట్టూ ఎగురుతుండేవి. అవి అల్లాడిపోతుంటే రాళ్ళువిసిరే మానవులకు ఆనందంగా వుండేది. ఇతర జీవులబాధ అందులో యితరులకేమాత్రం అపకారం తల పెట్టని జీవులబాధ, గొప్పవాళ్ళు అనుకునే మానవులకు యెట్లా ఆనందం కలిగిస్తూవుందో నాకు అర్థం అయ్యేదికాదు. ముక్కుమీద వేలువేసుకుని చూస్తూ వుండేదానిని.

అటువంటి సమయాల్లో క్రిందవున్న మనుష్యులను, వాళ్ళు చేస్తున్న ఘోరాపచారం తెలియజేసి, మందలించాలని అనిపించేది. కాని మానవులు ఆనాటికే ప్రకృతిలో సహజంగా జీవిస్తున్న ప్రాణి కోటి అభిప్రాయాలను అర్థంచేసుకోలేని స్థితికి దిగజారివున్నారు. ఇక వాళ్ళకు చెప్పుకునేదిఎట్లా?

ఈ మానవులు నా నీడను కూర్చుని అస్తమానం హక్కులసంగతి మాట్లాడుకుంటూ వుండేవారు. అటువంటప్పుడు నా కొమ్మలను ఆశ్రయించుకొని బ్రతుకుతున్న పక్షులను బాధించే హక్కు వీరికి ఎవ్వరిచ్చారో! నా నీడన కూర్చొని కబుర్లు చెప్పుకొనే హక్కు వీరికి వున్నప్పుడు, నా చెట్ల కొమ్మలమీద గూళ్ళు కట్టుకొని నివసించే హక్కు పక్షులకు ఎందుకు లేదు? అసలు ఇంతకీ నా హక్కు మాటేమిటి? నన్నడిగే, వాళ్ళు నా క్రింద కూర్చున్నారంటారా?

అవి రెట్టలు వేస్తున్నవంటారా? నా వొడిలో కూర్చుని వీళ్ళు వూసే ఉమ్ముల మాటేమిటి? వాళ్ళు చేసే అనాకారపు పనులు వాళ్ళకు పట్టవు. వీళ్ళు పగలు పెద్దమనుష్యులుగానీ, రాత్రిళ్ళు చీకటిలో దూరం వెళ్ళటానికి భయపడి, నా చుట్టు ప్రక్కల ఇండ్లవాళ్ళు నా క్రింద అందరూ కూర్చునేచోట చేసే కశ్మలం సంగ తేమిటి? రెట్టను వేసిన పక్షులమీదకు రాళ్ళు రువ్వేటప్పుడు ఆ సంగతులు వాళ్ళకి జ్ఞాపకంరావు.

నా కొమ్మల్లో మిగిలిన పక్షులతో పాటు వొక కాకికూడా గూడుకట్టుకొని వుంది. సాధారణంగా కాకులు మిగిలిన పక్షులతో కలిసివుండవు. ఎందుకనో ఈ కాకి నా అండన జేరింది. మిగిలిన పక్షులకుమల్లేకాక, కాకులకు మానవ సంపర్కం ఎక్కువగా ఉంటుంది. అవి మానవుల ఇండ్లలోనే ఎంగిళ్ళుతింటూ ఎండబోసినవి దొంగిలిస్తూ తిరుగుతూ వుంటవి. అందువల్ల ఆ కాకికి మనుష్యుల లక్షణాలు కొన్ని పట్టుబడ్డవి. దానికి మనిషికి వుండే కసివుండేది. మనుష్యులు అనవసరంగా నా మీద గూళ్ళు కట్టుకొనివున్న పక్షులను హింసించటం సహించలేక అది వొక పని మొదలు పెట్టింది. ఏ మనిషి నా క్రిందకూర్చుని గొప్పగా ఉత్సాహంగా మాట్లాడుతూ వుంటాడో, గురిచూచి అతని మీద తక్కిన రెట్టవేసి, ఎగిరిపోయేది. గొప్పగా మాట్లాడుతున్న ఆ వ్యక్తిముఖం అప్పుడు చూడవలసిందే. అతని కంగారు చూచి మిగిలిన మానవులంతా గుక్కలువట్టి నవ్వేవారు. ఆ కాకి పనికి నాకూ నవ్వు వచ్చేది.

కాని ఆ కాకిమీద పుట్టిన కసిని మానవులు ఇతర పక్షులమీద తీర్చుకోవటానికి ప్రయత్నించేటప్పటికి నా హృదయం ద్రవించుకుపోయేది. రెట్టవేసిన ఆ కాకికి వీళ్ళకీ భేదం ఏమిటా అని ఆలోచించ బుద్ధి అయ్యేది. నన్నాశ్రయించుకున్న పక్షులు మానవులవల్ల ఈ కష్టాలకే కాదు, ఇంతకంటే భయంకరమైన కష్టాలకు కూడా గురి అవుతూవుండేవి. అయితే ఈ కష్టాలు నిత్యం జరిగేవి అయితే అవి ఏటికి కోటికి జరుగుతుండేవి. ఏనాడూ మరుపుకు రానంత జ్ఞాపకం వొస్తే హృదయం ముక్కలయ్యేంత దారుణమైనవి అవి.



AP SCERT
https://amaravathiteacher.com

ఒకరోజు పిట్టలు కొట్టేవాడొకడు నా పరిసర ప్రాంతాల్లో తిరగడం మేమంతా చూశాం. గాలిని బట్టే అటువంటి వాళ్ళని మేం పసిగట్టగలం. గాలి మాకు నేస్తం. అపాయాన్ని ముందుగానే తన అలలమీద మోసుకువచ్చి మా చెవుల్లో ఊదిపోతూ ఉండేవాడు.

పిట్టలు కొట్టేవాడు వస్తున్నాడని పక్షులన్నీ తెలుసుకున్నాయి. కొన్ని పక్షులు భయంతో లేచిపోయినై. వాటిల్లో ఎక్కువ మొగపక్షులే! మిగిలిన పిల్లలు లేని ఆడపక్షులు, పిల్లలున్న ఆడపక్షులు, పిల్లలను విడిచి వెళ్ళలేక బయటకు కనబడకుండా గూళ్ళల్లోనే కూర్చున్నాయి. పిల్లలను దగ్గరకు జేర్చుకొని, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కూర్చున్నాయి! పిట్టలుపట్టేవాడికి గూటిని పొడిచే ఆచారం వున్నదని వాటికి తెలుసు.

ఒక పక్షిమాత్రం భయంతో గూటి దాక వెళ్ళలేక నా కొమ్మ అంటిపెట్టుకు కూర్చుంది. ఆ కొమ్మన ఆకులు కూడా వున్నయి. పిట్టలు కొట్టేవాడు క్రిందా, తాను కొమ్మపైనా, ప్రక్కన నా ఆకులూ వున్నాయి. కనుక అతనికి కనపడననుకుంది పాపం ఆ పక్షి. నేనుకూడా దగ్గరలోవున్న ఆకులతో ఆమెను కప్పటానికి ప్రయత్నించాను. కాని పిట్టలు కొట్టేవాడు ఆ పక్షిని చూడనే చూశాడు. ఆ పక్షిని అంటుకొని పడివున్న నాకొమ్మ చిన్నది. ఆ పక్షి కొంచెం పెద్దది, దాని పొట్టలో కొద్దిభాగం కొమ్మను మించి వచ్చింది. పిట్టలు కొట్టేవాని చేతులలో కొనకు పదునైన బాకుకట్టిన వొక పెద్ద వాసాంవున్నది. ఆ వాసాన్ని పైకెత్తి దాని కొననవున్న బాకుతో క్రింద కనబడుతున్న ఆ పక్షి కడుపును పొడిచాడు. ఆ పక్షి కేరుమని అరిచింది. ఆ బాకు దాని కడుపులోకి దిగబడిపోయింది. వాసాన్ని దింపి బాకున నిలచివున్న పిట్టను వొదిలించుకుని సంచిలో వేసుకొని వెళ్ళిపోయాడు, ఆ పిట్టలవాడు.

ఇదంతా చూస్తూ నిలబడిపోయాను నేను. ఏంచెయ్యను? ఇతని గొంతు నులమటానికి భగవంతుడు నాకు చేతులనివ్వలేదు. నన్ను నేను పెళ్ళగించుకొని, అతనిమీద పడదామనుకున్నాను. ఆ ప్రయత్నంలో నేను మరణిస్తే మాత్రం ఏం? కాని నేను స్పృహలోకి వచ్చేటప్పటికే అతను దాటిపోయాడు.

మానవుల్లో మంచివాళ్ళు లేరనికాదు నా ఉద్దేశం. మంచివాళ్ళే లేకపోతే ఈ లోకం యింకా యెందుకు నిలిచి ఉంటుంది? మానవుల్లో ఎక్కువమంది మంచివాళ్ళే. అయితే వాళ్ళకు మాబోటి వాళ్ళ బాధలను గ్రహించే స్పృహ తగ్గిపోయింది. తాము ఏదో ఒక విధంగా బ్రతకడమే ముఖ్యమైంది.

బ్రతకటానికి ఇన్ని ఘోరాలు చెయ్యాలా? యితర జీవులను ఇంత నిర్దాక్షిణ్యంగా తమ పొట్టను పెట్టుకోవాలా? ఏ ఆకూ దుంపలు తింటే సరిపోదు? కాని యిప్పటి కుర్రవాళ్లు అలా అనుకున్నట్లు కనపడదు. వాళ్ళతో పాటు మాకూ ఈ ప్రపంచంలో బ్రతికే హక్కున్నదనీ, అందరం బ్రతికితేనే ఈ ప్రపంచం అందమనీ, వాళ్ళు అనుకొన్నట్లు కనపడదు.

ఇదివరకు ఎవ్వరైనా మా మీదకు రాళ్ళు విసిరితే "ఎందుకురా దాన్నట్లా కొడతావ్" అనేవారు. తెలియని వాళ్ళు మా కొమ్మలను విరిస్తే "పచ్చనిచెట్టుని విరిస్తే పాపంరా" అనేవారు. మొక్కలను పీకితే "కళ్ళుపోతై" అనేవారు. ఇప్పుడు అటువంటి మాటలు ఎక్కడా వినపడటంలేదు. రోజులలా మారినై. మానవుల దృష్టి మారిపోయింది.

ఇటీవల నరసింహులు అనే యువకుడు మా గ్రామం పంచాయితీ ప్రెసిడెంట్ అయ్యాడు. ఆతనిని నేను చిన్నప్పటినుంచీ ఎరుగుదును - నిన్న మొన్నటివరకూ ఆగతాయితనంగా తిరుగుతుండేవాడు. ఈ చెర్లోనే ఈదులాడుతుండేవాడు. నన్నెక్కి నాకొమ్మలను అనవసరంగా విరిచిపారవేస్తూవుండేవాడు. గోలచేసి గూళ్ళలోని పక్షులను

AP SCERT



https://amaravathiteacher.com

బయటకు తోలుతుండేవాడు. మరీ చిన్నప్పుడు బడికి వెళ్ళకుండా పలకా, పుస్తకాలు పట్టుకొని నా తొర్రలో దాక్కునేవాడు. తనలాంటి వాళ్ళనే ఇంకా నలుగుర్ని పోగుచేసి నా ఊడలు పట్టుకొని ఉయ్యాల లూగుతుండేవాడు.

ఆ నరసింహులు యిప్పుడు పంచాయితీ ప్రెసిడెంట్ అయ్యాడు. అతను ఆ ఉద్యోగంలోకి వచ్చినందుకు నేను చాలా సంతోషించాను. ఎందుకంటే అతను ఎన్ని ఆగతాయిపనులు చేసినా అతనంటే నాకు యిష్టంగానే వుండేది.

ప్రెసిడెంట్ అయినరోజు సాయం కాలమే పదిమంది గ్రామ పెద్దలను వెంట పెట్టుకుని నా దగ్గరకు వచ్చాడు. అప్పుడే గ్రామస్తులు అతనికి సన్మానం చేసినట్టున్నారు – కొత్తబట్టలు ధరించి చూడముచ్చటగా వున్నాడు. తనకు గౌరవ పదవి లభించగానే మాకున్న పరిచయాన్ని పురస్కరించుకొని నన్ను చూడటానికి వచ్చాడనుకొని నేను చాలా సంతోషించాను.

కాని అతను అందుకు రాలేదు. పంచాయితీ ప్రెసిడెంట్ అవటంతో అతనికి యీ చెరువు మీదా, ఈ చెరువు చుట్టూవున్న మామీదా హక్కు ఏర్పడింది, ఆ హక్కు అమలులో పెట్టటానికి వచ్చాడు. ప్రక్కన వున్న వానితో "ఈ చెట్లన్నీ అనవసరం. వీటి వల్ల చెరువుగట్టు పాడవుతూవుంది. చెర్లో నీరు పాడవుతూ వుంది. వీటిని వేలం వేయించి కొట్టించివేస్తే పంచాయితీకి కొంత డబ్బుకూడా వొస్తుంది. అంతగా అవసరం అనుకుంటే చిన్న పార్కు వంటిది వేయించుకోవచ్చు. సర్విచెట్లు వేయిస్తే త్వరగా అక్కరకు వస్తాయి. అమ్ముకుంటే ధరా బాగా పలుకుతుంది" అన్నాడు. అంతా నిజమేనంటే నిజమే అన్నారు. అతని అభ్యుదయ పంథాకు జోహారులు అర్పించారు.


అతని మాటలువింటే నాకు గుండె చెరువయింది; చావటానికి భయపడి కాదు. చావంటే మా జాతికి భయమే లేదు. నా గుండె చెరువయింది, అతని నిర్లక్ష్యానికి. మా ఉద్దేశాలను మేము మానవులకుమల్లే పైకిచెప్పుకోకపోయినా, మాకూ ప్రాణం అనేది వుంటుందని – నాతో యింత పరిచయం వున్న అతనికి తట్టకపోవటం నాకు ఆశ్చర్యం వేసింది. మాకు ప్రారంభం లేకపోతే మేము ఎలా పెరుగుతున్నాం అనుకున్నారు.

మేము నీడనివ్వటంమాట అటుంచి ఈ చెరువుగట్టు యిన్నేళ్ళనుంచీ వర్షానికి కరిగిపోకుండా ఉన్నదంటే దానికి కారణం భూమిలోకి మా వేళ్ళు అల్లు కోవటమే! ఈ సంగతి అతనికి తెలిసినట్లు లేదు. మా పాలూ మా కాయలూ యెన్నో జబ్బులను నయంచేస్తవి. ఈ సంగతి అతనికి తెలిసినట్లులేదు. ఊళ్ళో బీదవాళ్లు ఎంతమందో, నా ఆకులతో విస్తర్లు కుట్టుకొని భోజనాలు చేస్తున్నారు. ఈ సంగతి అతనికి తెలిసినట్లు లేదు. నేనుపోతే నామీద నివసించే ఈ పక్షులన్నీ ఏం కావాలని? నా వేళ్ళను పొయ్యిగా చేసుకొని వంటలు చేసుకునే బీదవాళ్ళంతా యేంకావాలి? అన్నిటికన్నా ముఖ్యంగా మా ప్రాణాలూ అతని ప్రాణాలు వంటివే గదా? మా ప్రాణాలు తియ్యటానికి అతనికేం హక్కుంది. ఎవ్వరు బ్రతకటానికి అర్హులో యెవ్వరు గాదో నిర్ణయించటానికి అర్హుడు తానా?

అయితే అతనిని ఎవ్వరు ఆపగలరు? పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్ అవటంతో మా ప్రాణాలు అతని చేతుల్లోకి వెళ్ళినై. జీవకోటిని హింసించే అధికారం అతనికి వచ్చింది. త్వరగా మా ప్రాణాలు తీసి తనేదో ఘనకార్యం సాధించినట్లు గ్రామస్థులకు కనబడాలనుకున్నాడతను.

మరునాడే వడ్రంగులను వెంటబెట్టుకొని వచ్చాడతను. వాళ్ళు ముందు నా ఊడలను కోసి నా ఆధారాన్ని తప్పించారు. తరువాత నా కొమ్మలను నరికి నన్ను బోసిదాన్ని చేశారు. తరువాత నన్నే మొదట్లో కోసి వేశారు. నా


https://amaravathiteacher.com
AP SCERT



పైభాగం కుప్పమాదిరిగా కూలింది. ప్రస్తుతం నేను వొక మొండెమయి ఉన్నాను. అంటే, నా మొదలు మాత్రమే వుంది, ఈ పని జరిగి నాలుగైదు రోజులైంది. మరునాడే నన్ను సమూలంగా త్రవ్వి వేస్తారు, అనుకున్నా గాని ఎందుకనో ఆ పని జరుగలేదు. సరే, విచారిస్తూ ఊరికేకూర్చోవటం ఎందుకని నేను చిగర్చటానికి ప్రయత్నిస్తున్నాను. కాని మనస్సులో అతను నన్ను మొండెంతో విడిచి పెట్టడని తెలుసు. కట్టెలు కాగలననే ఆశతో నన్ను కుళ్ళగించివేస్తాడని తెలుసు. తెలిసీ నా పని నేను చెయ్యాలనే ఉద్దేశం. చిగర్చటానికి ప్రయత్నిస్తున్నాను. ఒకవేళ అతను నా సంగతి పట్టించుకోకపోయినా పెరిగి పెద్దదాన్నయ్యేదెప్పుడు? ఈ మానవులు యెందుకు యింత క్రూరంగా ప్రవర్తిస్తారో!

ఈ ప్రశ్నలకు పైన భగవంతుడు సమాధానం చెప్పాలి. కొన ఊపిరితో ఉన్నదానికి రంగరించి చిగర్చటానికి ప్రయత్నించటమే నా ధర్మం!

## ఇవి చేయండి

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

ఋణం, కశ్మలం, రహస్యం, గ్రామస్థులు, దోసిళ్ళు, అర్థించు, ఘోరము, పక్షులు, లక్షణము, మార్జనం

## అవగాహన - ప్రతిస్పందన

1. చుట్టూ ఉన్న పరిసరాలలో మానవులకు మేలుచేసే చెట్లు /పక్షులు / జంతువులను గురించి వారి మాటల్లో చెప్పండి.
2. మీరు చూసిన / విన్నటువంటి బాధ / సంతోషం గురించి మీ మాటల్లో చెప్పండి.
3. మఱ్ఱిచెట్టు నిస్వార్థ బుద్ధితో పక్షులకు, మానవులకు ఎలాంటి సహాయాన్ని అందిస్తుందో మీ మాటల్లో చెప్పండి.

AP SCERT



https://amaravathiteacher.com

## 4. కింది వచనం చదివి ప్రశ్నలకు జవాబులు గుర్తించండి.

స్వామి వివేకానంద అమెరికా, బ్రిటన్ వంటి సంపన్నదేశాలను దర్శించారు. భారతదేశానికి తిరిగి ప్రయాణమయినప్పుడు అక్కడి పత్రికా విలేఖరులు "మీ మాతృభూమి పట్ల మీ అభిప్రాయం ఏమిటి?" అని ప్రశ్నించారు. దానికి సమాధానంగా "భారతదేశాన్ని లోగడ ప్రేమించాను. కాని ఇప్పుడు భారతభూమిలోని ప్రతి ధూళికణం నాకు అత్యంత పవిత్రం. అది నాకొక తీర్థస్థానం" అని సగర్వంగా చెబుతారు. ఈవిధంగా కనిపెంచిన తల్లి మీద ఎలాంటి మాతృభావన ఉంటుందో మనకు జన్మభూమి అయిన భారతదేశం మీద కూడా అలాంటి మాతృభావన కలిగి ఉండాలనే ఉద్దేశాన్ని ప్రకటించారు.

### ప్రశ్నలు

1. జన్మభూమి పట్ల ఎలాంటి భావన కలిగి ఉండాలి? ( )

   అ) ప్రేమ ఆ) పవిత్ర ఇ) మాతృభావన ఈ) భక్తి

2. స్వామి వివేకానంద దర్శించిన విదేశాలు ఏవి? ( )

   అ) భారతదేశం ఆ) అమెరికా

   ఇ) బ్రిటన్ ఈ) అమెరికా & బ్రిటన్

3. భారతభూమిలో ప్రతి ధూళి కణం నాకు అత్యంత పవిత్రం అన్నది ఎవరు? ( )

   అ) స్వామి వివేకానంద ఆ) స్వామి రామకృష్ణ పరమహంస

   ఇ) స్వామి శ్రద్ధానంద ఈ) శారదా దేవి

4. స్వామి వివేకానందుని భావనలో తీర్థ స్థానం ఏది? ( )

   అ) కాశీ ఆ) రామేశ్వరం ఇ) భారతదేశం ఈ) తిరుపతి



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

AP SCERT

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. మఱ్ఱిచెట్టు పాఠ్యభాగ రచయిత గురించి మీ సొంతమాటల్లో రాయండి.
2. చెట్ల ప్రయోజనాలు గురించి నాలుగు వాక్యాలు రాయండి.



**ఆ) కింది ప్రశ్నలకు 8 నుంచి 10 వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. మఱ్ఱిచెట్టు హక్కులను గురించి మాట్లాడవలసి వచ్చిన సందర్భాన్ని వివరించండి.
2. మఱ్ఱిచెట్టుకు – గ్రామానికి ఉన్న సంబంధాన్ని ప్రశంసిస్తూ రాయండి.
3. మానవుల వలె చెట్లు / పక్షులు / జంతువులు మాట్లాడగలిగితే ఎలా ఉంటుందో మీ మాటల్లో వివరించండి.



https://amaravathiteacher.com



## భాషాంశాలు

### i. పదజాలం

**అ) కింది వాక్యాలను చదివి గీత గీసిన పదాలకు అర్థాన్ని రాయండి.**

ఉదా: గాల్వన్ లోయలో కల్నల్ సంతోష్ బాబు ధైర్య సాహసాలకు చైనా సైన్యం విస్తుపోయింది.

విస్తుపోవు – ఆశ్చర్యపడు

1. జంతువులు, పక్షులు వంటి ప్రాణుల యెడల నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించరాదు.

   నిర్దాక్షిణ్యం – ------------------

2. జడివానతో వీచే పెనుగాలి చెట్లను పెళ్ళగిస్తుంది.

   పెళ్ళగించు – ------------------

3. దండకారణ్యంలో రాముని సత్తువ రాక్షసులను వణికించింది.

   సత్తువ – ------------------

4. 2025 నాటికి భారతదేశం ఇదమిద్ధంగా విశ్వగురుస్థానాన్ని చేరుతుంది.

   ఇదమిద్ధం – ------------------

**ఆ) కింది పదాలకు పర్యాయపదాలను పద విజ్ఞానం నుండి గ్రహించండి.**

1. నెపం : ____________, ____________
2. ఆశ్రయం : ____________, ____________
3. ఆపేక్ష : ____________, ____________

**ఇ) కింది ప్రకృతి – వికృతులను జతపరచండి.**

| | | | |
|---|---|---|---|
| 1. హృదయము | (      ) | అ) | సత్తువ |
| 2. నిభము | (      ) | ఆ) | ఎద |
| 3. సత్త్వము | (      ) | ఇ) | పత్తనము |
| 4. పట్టణము | (      ) | ఈ) | నెపము |

**ఈ) కింది పదాలతో సొంతవాక్య ప్రయోగం చేయండి.**

ఉదా॥ మా చెల్లి నిరంతరం పుస్తకాలను అంటిపెట్టుకుని ఉంటుంది.

మనసులోపెట్టుకొను – తరతరాలు – విశ్రాంతి – చీటికీ మాటికీ – చూడముచ్చట – చెవిలో పడటం
జ్ఞాపకం – అపేక్ష – ఆశ్రయం – అల్లాడి పోవు – అస్తమానం – మరుపుకురానంత – గొంతునులమటం
ఉయ్యాలలూగు – ఆగతాయి పనులు.

______________________________

______________________________

______________________________

AP SCERT



https://amaravathiteacher.com

ఉ) కింది పదాలను ఏ అర్థంలో – సందర్భంలో ఉపయోగిస్తారో తెలుసుకోండి.

ఉదా॥ కాలక్షేపం : 'సమయాన్ని వృథాగా గడుపుట' అనే అర్థంలో ఉపయోగిస్తారు.

1) హృదయ విదారకం : ...........................................................

2) గుండెలు అలసిపోయేటట్టు : ...........................................................

3) ముక్కు మీద వేలేసుకొను : ...........................................................

4) హృదయం ముక్కలవడం : ...........................................................

5) పొట్టన పెట్టుకును : ...........................................................

## ii. వ్యాకరణాంశాలు

**వ్యాకరణం (క్రియ – కాలాలు)**

ప్రతి వాక్యంలోనూ ఒక 'పని' ఉంటుంది. ఆ 'పని' ని తెలిపే పదాన్నే "క్రియ" అంటాం. దీనిని మనం భాషాభాగాలలో నేర్చుకున్నాం.

**విభాగం 1: ప్రయోగశాల – క్రియ ఏం చెబుతోంది?**

క్రియ కేవలం 'పని' ని మాత్రమే చెబుతుందా? పాఠంలోని ఈ మూడు వాక్యాలను గమనించండి.

1. "వాళ్ళు నన్ను ముక్కలక్రింద నరికారు."
2. "నేను చిగర్చటానికి ప్రయత్నిస్తున్నాను."
3. "మరునాడే నన్ను సమూలంగా త్రవ్వి వేస్తారు."

**మీ పరిశీలన:**

ఈ మూడు వాక్యాలలో 'పని' జరుగుతోంది, కానీ ఆ 'పని' జరిగిన సమయం ఒకేలా ఉందా?

- 'నరికారు' అనగానే ఆ పని జరిగిపోయింది అని తెలుస్తోంది.
- 'ప్రయత్నిస్తున్నాను' అనగానే ఆ పని ఇప్పుడు జరుగుతోంది అని తెలుస్తోంది.
- 'వేస్తారు' అనగానే ఆ పని జరగబోతోంది అని తెలుస్తోంది.

**ముగింపు :**

భేష్! మీరే ఒక ముఖ్యమైన వ్యాకరణ సూత్రాన్ని కనిపెట్టారు. "క్రియ" అనేది కేవలం 'పని'ని మాత్రమే కాదు, ఆ పని ఎప్పుడు జరిగిందో అనే "కాలాన్ని" కూడా తెలియజేస్తుంది!

AP SCERT



https://amaravathiteacher.com

## విభాగం 2: నాలుగు కాలాలు




మనం మాట్లాడేటప్పుడు, "పని" (క్రియ) ఎప్పుడు జరిగిందో చెప్పడానికి తెలుగులో 4 ముఖ్యమైన కాలాలను వాడతాం.

**1. భూతకాలం :**

- **అర్థం :** పని జరిగిపోయింది. అంటే పని ఇంతకుముందు జరిగి ప్రస్తుతం లేనిది.

  **ఉదా :** "ఆ పక్షి కేరుమని అరిచింది."

  అంటే పక్షి ఇంతకుముందు అరిచింది. ప్రస్తుతం అరవడం లేదు. ఇలా పని పూర్తయితే దాన్ని భూతకాలం అంటారు.

**2. వర్తమానకాలం:**

- **అర్థం :** పని ఇప్పుడు జరుగుతోంది. అంటే పని ఎప్పుడో ప్రారంభం అయి ఇప్పటికీ కొనసాగుతూ ఉంటుంది.

  **ఉదా :** "నేను చిగర్చటానికి ప్రయత్నిస్తున్నాను."

  అంటే చిగర్చటానికి ప్రయత్నించడం ఎప్పుడో మొదలై ఇప్పటికీ కొనసాగుతోంది. ఇలా పని ప్రస్తుతం కొనసాగుతూ ఉంటే దాన్ని వర్తమాన కాలం అంటారు.

**3. భవిష్యత్ కాలం:**

- **అర్థం :** పని భవిష్యత్‌లో జరగబోతోంది. అంటే పని ఇంతవరకు మొదలు కాలేదు. తర్వాత మొదలవుతుంది.

  **ఉదా :** 1) సర్విచెట్లు వేయిస్తే త్వరగా అక్కరకు వస్తాయి.

  అంటే వస్తాయి అనే పని మొదలవ లేదు. ఇకముందు మొదలవుతుంది. ఇలా పని మొదలు కాకుండా ఇక ముందు జరగబోతూ ఉంటే దాన్ని భవిష్యత్ కాలం అంటారు.

**4. తద్ధర్మకాలం:**

- **అర్థం :** పని మూడుకాలాలలోనూ జరుగుతుంది లేదా అది ఒక అలవాటు, లేదా ఒక సహజ స్వభావం.

  **ఉదా :** "మానవులు యెందుకు యింత క్రూరంగా ప్రవర్తిస్తారో!"

  ఉదా "సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు." (నిత్యసత్యం)

భవిష్యత్ కాలం, తద్ధర్మ కాలం మధ్య భేదాన్ని ఎలా గుర్తించాలి?

తద్ధర్మార్థక క్రియ మరియు భవిష్యత్ కాల క్రియ రెండూ ఒకేలాంటి ప్రత్యయాలను కలిగి ఉంటాయి కాబట్టి, వాటి మధ్య తేడాను గుర్తించడం కొంచెం కష్టమే. కానీ, మన పద్ధతిలో వాటిని సులభంగా గుర్తించవచ్చు.

**1. భవిష్యత్ కాల క్రియ**

- **అర్థం :** ఇది ఒక్కసారి మాత్రమే జరగబోయే పనిని సూచిస్తుంది.
- **సందర్భం :** భవిష్యత్తులో ఒక నిర్దిష్ట సమయంలో జరుగుతుంది.

AP SCERT



https://amaravathiteacher.com

- **నైపుణ్యం :** వాక్యంలో కాలానికి సంబంధించిన పదాలు (గంట తర్వాత, రేపు, సాయంత్రం, వచ్చే నెల మొదలైనవి) ఉంటే, అది భవిష్యత్ కాలం అయ్యే అవకాశం ఎక్కువ.

**ఉదాహరణలు :**

1. "నేను రేపు సినిమాకి వెళ్తాను." (రేపు ఒక్కసారే వెళ్తాను)
2. "మా నాన్న సాయంత్రం ఊరి నుండి వస్తారు." (ఈ సాయంత్రం ఒక్కసారే)
3. "మేము వచ్చే సంవత్సరం 8వ తరగతికి వెళ్తాము." (ఒక్కసారే జరిగే మార్పు)

## 2. తద్ధర్మార్థక క్రియ

- **అర్థం :** ఇది ఎప్పుడూ జరిగే పనిని (సత్యం) లేదా ఒక అలవాటును (అభిరుచి), సహజ స్థితిని (స్వభావాన్ని) సూచిస్తుంది.
- **సందర్భం :** ఇది నిన్న జరిగింది, ఈరోజు జరుగుతుంది, రేపు కూడా జరుగుతుంది. దీనికి నిర్దిష్ట సమయం ఉండదు.
- **నైపుణ్యం :** ఈ వాక్యంలో ఎప్పుడూ, సాధారణంగా, రోజూ అనే పదాలను చేర్చి చూస్తే అర్థం మారదు.

**ఉదాహరణలు:**

**1. సార్వకాలిక సత్యం :**

- "సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు." (నిన్న, ఈరోజు, రేపు – ఎప్పుడూ ఉదయిస్తాడు)
- "నీరు పల్లం ఎరుగు, నిజం దేవుడెరుగు." (ఇది ఎప్పుడూ నిజమే).

**2. అలవాటు :**

- "మా తాతగారు రోజూ పేపర్ చదువుతారు." (ఇది ఆయన అలవాటు, ఒక్కరోజు పని కాదు).
- "ఆమె బాగా పాటలు పాడుతుంది." (ఇది ఆమె ఎప్పుడూ చేసే పని)

**3. స్వభావం :**

- "కుక్కలు మొరుగుతాయి." (అది వాటి స్వభావం)
- "పక్షులు ఆకాశంలో ఎగురుతాయి." (ఇది వాటి సహజ లక్షణం)

## పాఠం నుండి పరిశీలన

**ఇప్పుడు మన పాఠంలోని వాక్యాలను ఈ నైపుణ్యాలతో పరీక్షిద్దాం :**

1. "మరునాడే నన్ను సమూలంగా త్రవ్వి వేస్తారు."
   - ఇది ఎప్పుడూ జరుగుతుందా? కాదు. 'మరునాడు' (రేపు) ఒక్కసారే జరుగుతుంది.
   - కాబట్టి, ఇది భవిష్యత్ కాలం.
2. "మానవులు యెందుకు యింత క్రూరంగా ప్రవర్తిస్తారు!"
   - మానవులు ఎప్పుడైనా క్రూరంగా ప్రవర్తించవచ్చు. (అని చెట్టు బాధపడుతోంది). ఇది మానవులలో కొంతమంది స్వభావం.
   - కాబట్టి, ఇది తద్ధర్మార్థక క్రియ.

AP SCERT



https://amaravathiteacher.com

## అభ్యాసాలు

**అభ్యాసం 1: కాలాన్ని పట్టుకుందాం!**

కింది క్రియాసహిత వాక్యాలు ఏ కాలంలో ఉన్నాయో గుర్తించి రాయండి. (భూత, వర్తమాన, భవిష్యత్, తద్ధర్మ).

1. "నా మొదలు రంపంతో కోశారు." = ..................... కాలం
2. "......కుర్రకారు యెక్కువమంది పట్టణానికి వెళ్ళి రావటం మొదలు పెట్టారు." = .................. కాలం
3. "మానవులు యెందుకు యింత క్రూరంగా ప్రవర్తిస్తారో!" = .................... కాలం
4. "నాకు నవ్వు వచ్చేది." = .................... కాలం
5. "నేను చిగర్చటానికి ప్రయత్నిస్తున్నాను." = .................... కాలం
6. "మరునాడే నన్ను సమూలంగా త్రవ్వి వేస్తారు." = .................... కాలం
7. "...కొంతమంది చదువునెపంతో అక్కడే వుంటున్నారు." = .................... కాలం
8. "...నా వేర్లే నాకు కావలసిన ఆహారాన్ని సమకూర్చి పెట్టాయి" = .................... కాలం

**అభ్యాసం 2 : కింది వాక్యాలు ఏ కాలంలో ఉన్నాయో గుర్తించి రాయండి.**

1. "ఆత్మానందుడనే వృద్ధయోగి ఉండేవాడు." (...................... కాలం)
2. కోకిల వసంత కాలంలో కూస్తుంది. (...................... కాలం)
3. "లోయలోకి దొర్లి పడిపోయాడు." (...................... కాలం)
4. నేను ప్రతిరోజు ఉదయాన్నే పాలు తాగుతాను. (...................... కాలం)
5. "చండీదత్తుడు వాటిని అదుపులో పెట్టలేకపోయాడు." (...................... కాలం)
6. నేను వచ్చేవారం అమరావతికి వెళ్తాను. (...................... కాలం)
7. వారు కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తారు. (...................... కాలం)
8. నీతిబాహ్యమైన పనులకు పురి కొల్పుతుంది. (...................... కాలం)

**అభ్యాసం 3 :**

| సంధి పదం | విడదీసిన రూపం (పూర్వపదం + పరపదం) | సంధి పేరు (ఉత్వ /అత్వ /ఇత్వ / యడాగమం) |
|---|---|---|
| ఉదా : అయినప్పుడు | అయిన + అప్పుడు | అత్వ సంధి |
| 1. అటువంటప్పుడు | | |
| 2. అనవసరమని | | |
| 3. నరసింహులిప్పుడు | | |
| 4. భయంకరమైన | | |
| 5. నాకిష్టం | | |
| 6. మాయిల్లు | | |

AP SCERT




https://amaravathiteacher.com

## ప్రాజెక్టుపని

**చుట్టూ వున్న పరిసరాలలో మానవులకు మేలు చేసే(వేప/రావి/తులసి/తుమ్మ)ఏదైనా చెట్టు చిత్రాన్ని గీయండి. దాని గురించి రాయండి.**

## సుభాషితం

మేలైనను గీడైనను
శీలవతీ! మనుజుడెద్ది సేయు బరులకున్
వాలయంబుగ నది ఫల
కాలంబున గుడుచు వేరుగలుగదు చెపుమా!



**భావం:** మంచి గుణము కలిగినవారా! మానవుడు ఇంకొకరికి మేలు చేసినా, కీడు చేసినా దానికి సంబంధించిన ఫలితాన్ని అనుభవించి తీరుతాడు. ఫలితం అనుభవించుటలో ఇంకో విధంగా జరగనే జరగదు.

AP SCERT

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పాఠాన్ని అర్థం చేసుకొని సొంత మాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పాఠాన్ని ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. | రచయిత పాఠంలో చేసిన వాక్యప్రయోగాన్ని గ్రహించి అనుసరించగలను. | ఔను / కాదు |
| 4. | పరిసరాలలో ప్రాణులను గమనిస్తూ, వాటి బాధను గురించి రాయగలను. | ఔను / కాదు |

## ఉపాధ్యాయులకు సూచనలు

1. 'మాకూ ఉన్నాయి స్వగతాలు' రచనను సేకరించండి. చదవండి.
2. 'నీతి చంద్రిక' కథలను విద్యార్థులతో చదివించండి.



https://amaravathiteacher.com

## చదవండి - ఆనందించండి

### నది స్వగతం



నేను నదిని. ఈ భూమికి గుండె చప్పుడును. ఎన్నో వేల సంవత్సరాలుగా ఈ దేశంలో, వివిధ పేర్లతో ప్రవహిస్తున్నాను. మానవ నాగరికతలన్ని నా ఒడిలోనే పెరిగాయి. నా స్పర్శతో నేల సస్యశ్యామలమైంది. నేను సర్వ ప్రాణికోటికి ఆధారం. మానవులతో పాటు జంతువులకు, పక్షులకు దాహార్తిని తీర్చే అమ్మను.

నన్ను నమ్ముకుని ఎంతోమంది జీవనం సాగిస్తున్నారు. ఎంతో మంది పవిత్రతకు కారణం నాలో స్నానం చేయడమేనని భావిస్తారు. నాఉద్దేశం ఒక్కటే, భూమిపై ప్రాణులన్నీ సంతోషంగా బ్రతకడమే! కాలం మారింది. మనుషుల్లో స్వార్థం పెరిగింది. పవిత్రమైన నన్ను అపవిత్ర కార్యక్రమాలకు ఉపయోగించడం ప్రారంభించారు. నన్ను తల్లిగా భావించే ఈదేశంలో మురికికూపంగా మార్చారు.



నగరాల్లోని మురుగునీరు, పరిశ్రమల నుండి వచ్చే విషపూరిత రసాయన వ్యర్థాలు, నా స్వచ్ఛతను నాశనం చేశాయి. వ్యర్థాలతో నా రంగు మారింది, తాగడానికి పనికి రాకుండా పోయాను. నాలో నివసించే జలచరాలు చనిపోతున్నాయి. ఇప్పుడు నేను ఒక కన్నీటి ధారగా మారాను.

మీరు స్వార్థం తో కలుషితం చేస్తే, గుక్కెడు నీళ్లకోసం రేపటి తరాలు యుద్ధాలు చేయాల్సి వస్తుంది. ఎందుకంటే నేను లేకపోతే, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. వర్షాలు తగ్గుతాయి, భూమి ఎండిపోతుంది. మీ అత్యాశకు ప్రకృతి బలై పోతుంది. చెట్లు నాటి, నా తీరాలను కాపాడండి. నేను తిరిగి స్వచ్ఛంగా, సజీవంగా ప్రవహిస్తేనే, ఈ ప్రపంచం సురక్షితంగా, సుసంపన్నంగా ఉంటుంది. నా స్వగతం మీలో మార్పును తీసుకురావాలని ఆశిస్తున్నాను.

AP SCERT

**పర్యావరణాన్ని పరిరక్షించండి - ప్రాణాలను కాపాడుకోండి.**



https://amaravathiteacher.com

# 5 పద్య పరిమళం

W8I5U1

**అభ్యసన ఫలితాలు :**


- శతక కవులు గురించి తెలుసుకొని, పాఠంలోని కవులు గురించి వివరిస్తారు. (పాఠ్య ప్రణాళిక లక్ష్యం-1)
- వివిధ శతకాలలోని పద్యాలను భావ సహితంగా, శ్రావ్యంగా పాడి, అభినందిస్తారు. (పాఠ్య ప్రణాళిక లక్ష్యం-2)
- పద్య భావాలు సొంతమాటల్లో చెప్పగలరు, రాయగలరు. (పాఠ్య ప్రణాళిక లక్ష్యం-3)
- శతక కవులు వివరాలు సేకరించి, విషయాలను పట్టిక రూపంలో తయారు చేయగలరు. (పాఠ్య ప్రణాళిక లక్ష్యం-4)



## వినడం - ఆలోచించి మాట్లాడడం



తలనుండు విషము ఫణికిని
వెలయంగాఁ దోఁకనుండు వృశ్చికమునకున్
తల తోక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ!



1. చిత్రాన్ని గమనించండి. చిత్రంలో ఎవరెవరున్నారు?
2. మీకు తెలిసిన ఇలాంటి నీతి పద్యాలు చెప్పండి.
3. పాముకు విషము ఎక్కడ ఉంటుంది?
4. వృశ్చికము అనగా నేమి?

**ఉద్దేశం :** లోకంలో మంచి చెడులను, లోక ధర్మాలను, లోకరీతులను తెలియజేసి, విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడం. వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఈ పాఠం ఉద్దేశం.

| క్ర.సం. | కవి | కాలం | రచన |
|---|---|---|---|
| 1 | పోతన | 15వ శతాబ్దం | భాగవతము |
| 2. | పక్కి అప్పల నరసయ్య | 16వ శతాబ్దం | కుమార శతకం |
| 3. | మారద వెంకయ్య | 16వ శతాబ్దం | భాస్కర శతకం |
| 4. | పోతులూరి వీరబ్రహ్మం | 17వ శతాబ్దం | కాళికాంబ సప్తశతి |
| 5. | గువ్వల చెన్నడు | 17వ శతాబ్దం | గువ్వల చెన్న శతకం |
| 6. | ఏనుగు లక్ష్మణ కవి | 18వ శతాబ్దం | సుభాషిత రత్నావళి |
| 7. | చుక్కా కోటి వీరభద్రమ్మ | 20వ శతాబ్దం | నగజా శతకం |
| 8. | గద్దల శామ్యూల్ | 20వ శతాబ్దం | హితోక్తి శతకం |
| 9. | జెండామాన్ ఇస్మాయిల్ | 20వ శతాబ్దం | ఆంధ్రపుత్ర శతకం |

AP SCERT



https://amaravathiteacher.com

# పద్య పరిమళం




1


క ॥ క్షమ గలిగిన సిరి గలుగును
క్షమ గలిగిన వాణి గలుగు సౌఖ్యము లెల్లన్
క్షమ గలుగఁ దోన కలుగును
క్షమ కలిగిన మెచ్చు శౌరి సదయుఁడు తండ్రీ!

– ఆంధ్ర మహాభాగవతం

2

క ॥ ధనమే మైత్రినిఁదెచ్చును
ధనమే వైరమును దెచ్చు ధనమే సభలన్
ఘనతను దెచ్చును నెంతటి
గొనముల కుప్పలకునైన గువ్వలచెన్నా !

– గువ్వల చెన్న శతకం





3

క ॥ వృద్ధ జన సేవఁజేసిన
బుద్ధి విశేషజ్ఞుఁడనుచుఁబూత చరితుడున్
సద్ధర్మశాలియని బుధు
లిద్దరఁ బొగడెదరు ప్రేమయెసఁగు కుమారా!

– కుమార శతకం

4

ఆ.వె ॥ పరుల దిట్ట నోరు పాప పంకిల మౌను
పెద్దలను నుతింప శుద్ధియగును
నోటి మంచి తనము పాటించు సుజ్ఞాని
కాళికాంబ! హంస కాళికాంబ !


– కాళికాంబ సప్తశతి



AP SCERT



https://amaravathiteacher.com



5


కం॥ సత్యమె యశముకు మూలము
సత్యమె భవమోహపాశ సంసృతి బాపున్
సత్యమె శీలము నిలుపును
సత్యముతో నెట్టివ్రతము చాలదు నగజా

– *నగజా శతకం*


6

కం॥ గురుభక్తియు విద్యలపై
తరగని విశ్వాస సంపద వినయము నిరం
తర సాధన, ధారణ పున
శ్చరణము విద్యార్థికి యవసర లక్షణముల్

– *హితోక్తి శతకం*



AP SCERT



7

ఆ.వె ॥ చూడనగ్నిఁ గాలి సుత్తి దెబ్బలకోర్చి
మేలి సొమ్ములగుచు మెరియుఁ బసిడి
బాధలోర్చుకున్న భవిత వర్ధిల్లురా
అఖిల లోకమిత్ర! ఆంధ్రపుత్ర!

– *ఆంధ్రపుత్ర శతకం*

8

ఉ ॥ చేసిన దుష్టచేష్ట నదిచెప్పక, నేర్పునఁగప్పిపుచ్చి తా
మూసినయంతటన్, బయలుముట్టక యుండదదెట్లు, రాగిపై
బూసిన బంగరుం జెదరి పోవగడంగిన నాడు నాటికిన్
దాసిన రాగి గానబడదా జనులెల్ల రెఱుంగ భాస్కరా !

– *భాస్కర శతకం*





https://amaravathiteacher.com



# 9

i చ ॥ కరమున నిత్యదానము, ముఖంబున సూనృతవాణి, యౌఁదలం
గురుచరణాభివాదన, మకుంఠిత వీర్యము దోర్యుగంబునన్
వరహృదయంబునన్ విశదవర్తన, మంచితవిద్య వీనులన్
సురుచిరభూషణంబులివి శూరులకున్ సిరి లేనియప్పుడున్

– సుభాషిత రత్నావళి

## శతకం

నూరు పద్యాల రచనను 'శతకం' అంటారు. మకుట నియమం, సంఖ్యా నియమం, ఛందో నియమం, ముక్తకం శతక పద్యాల లక్షణాలు. వీటిలో ఏ పద్యానికి ఆ పద్యమే స్వతంత్ర భావం కలిగి ఉంటుంది. శతకపద్యాలు మానవ జీవిత మూలాలను తెలియజేస్తాయి.

## సారాంశం

**1వ పద్యభావం :** ఓ తండ్రీ! ఓర్పు కలిగి ఉంటే సంపద కలుగుతుంది. ఓర్పు ఉంటే విద్య అబ్బుతుంది. ఓర్పు ఉంటే సుఖములన్నీ కలుగుతాయి. సహనం కలిగి ఉంటే దయామయుడైన శ్రీహరి కూడా సంతోషిస్తాడు.

**2వ పద్యభావం :** ఓ గువ్వలచెన్నా! ధనము స్నేహాన్ని పెంచుతుంది. శత్రుత్వాన్ని కలుగజేస్తుంది. సభలలో గొప్పతనాన్ని తెచ్చిపెడుతుంది. ఇలా లోకంలో ఎన్నో గుణాలకు ధనమే కారణమవుతుంది.

**3వ పద్యభావం :** ఓ కుమారా! పెద్దలను సేవిస్తే బుద్ధి వికసిస్తుంది. ప్రవర్తన పవిత్ర మౌతుంది. సంస్కారం ధర్మబద్ధమవుతుంది. అలాంటి వారిని లోకంలో పండితులు కూడా కీర్తిస్తారు.

**4వ పద్యభావం :** ఓ కాళికాంబ! ఇతరులను నిందిస్తూ ఉండే నోటికి పాపం అనే బురద అంటుకుంటుంది. పెద్దలను గౌరవిస్తూ మాట్లాడితే పుణ్యం కలుగుతుంది. జ్ఞానవంతుడు ఎక్కడైనా, ఎప్పుడైనా మంచి మాటలనే మాట్లాడతాడు.

AP SCERT



https://amaravathiteacher.com

**5వ పద్యభావం :** ఓ నగజా! సత్యం కీర్తికి మూలం. సత్యం కోరికలను, భవబంధాలను నశింపజేస్తుంది. సత్యం శీలాన్ని కాపాడుతుంది. సత్యాన్ని మించిన పూజ లేదు.

**6వ పద్యభావం :** గురువులపట్ల భక్తి, చదువులపట్ల అపార నమ్మకం. పెద్దలపట్ల వినయం, నిరంతరం కష్టపడేతత్వం, ఏదైనా అంశాన్ని గ్రహించి నిలుపుకోవడం (ధారణ), నేర్చుకున్న అంశాన్ని వల్లెవేసుకోవడం అనే సుగుణాలు విద్యార్థికి చాలా అవసరం.

**7వ పద్యభావం :** ఓ ఆంధ్ర పుత్రుడా! బంగారం అగ్నిలో కాలి, సుత్తి దెబ్బలకు ఓర్చుకొని విలువైన ఆభరణంగా తయారవుతుంది. అదే విధంగా బాధలను తట్టుకొని మనుగడ సాగిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది.

**8వ పద్యభావం :** ఓ భాస్కరా! ఎంత రహస్యంగా ఉంచినా, చేసిన చెడ్డపని బయటపడక మానదు. రాగి పైన బంగారంతో ఎంతచక్కగా పూతపూసినా, క్రమంగా బంగారం అరిగిపోయినకొలదీ రాగి బయటపడుతుంది కదా!

**9వ పద్యభావం :** చేతులతో నిత్యం దానం చేయడం, ఎప్పుడూ సత్యాన్నే మాట్లాడడం, గురువు పాదాలకు తలవంచి నమస్కరించడం, తిరుగులేని విజయాన్ని కలిగించే భుజబలం కలిగి ఉండడం, నిర్మలమైన మనస్సు కలిగి ఉండడం, చెవులతో శాస్త్రాలు వినడం అనే ఈ గుణాలు మహాత్ములకు ఐశ్వర్యం లేని సమయంలో కూడా మంచి అలంకారాలుగా ప్రకాశిస్తాయి.

APSCERT



## ఇవి చేయండి

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

క్షమ – సౌఖ్యము – మోక్షం – మైత్రి – ఘనత – పంకిలం –మేలిమి – కాళికాంబ – సూనృతవాణి – సఖ్యము – ధారణ – వైరం – నిత్యదానము – సత్యము – శీలము – వ్రతము – పసిడి – గురుభక్తి – భాస్కరా – పునశ్చరణము – వర్ధిల్లు – విశేషజ్ఞుడు – సుజ్ఞాని – ఆంధ్రపుత్ర – విద్యార్థి





https://amaravathiteacher.com

## అవగాహన - ప్రతిస్పందన

1. పాఠంలోని పద్యాలను రాగంతో, భావానికి తగినట్లుగా పాడండి.
2. మానవ జీవితంలో ధనం యొక్క అవసరాన్ని గురించి మీ మాటల్లో చెప్పండి.
3. వృద్ధులకు సేవ చేయవలసిన అవసరాన్ని గురించి మీ మాటల్లో చెప్పండి.
4. కింది అపరిచిత పద్యం చదివి సమాధానాలు రాయండి.

చందమామ ఇచ్చు చల్లని వెన్నెల
తేనెటీగ ఇచ్చు తీపి మధువు
మనిషివైన నీవు మరి ఏమి తక్కువ
మంచిమాట లెపుడు మరువవద్దు !



అ) తేనెటీగ ఏమి ఇస్తుంది?
ఆ) చల్లని వెన్నెల ఇచ్చేది ఏది?
ఇ) మనిషి ఏది మరువకూడదు?

5. కింది పరిచిత పద్యం చదివి భావం రాయండి.

క ॥ వృద్ధ జన సేవఁజేసిన
బుద్ధి విశేషజ్ఞుఁడనుచుఁబూత చరితుడున్
సద్ధర్మశాలియని బుధు
లిద్ధరఁ బొగడెదరు ప్రేమయెసఁగ కుమారా! – కుమార శతకం

**భావం :**

........................................................................................................
........................................................................................................
........................................................................................................
........................................................................................................

## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. శతక ప్రక్రియను గురించి రాయండి.
2. "బాధలోర్చుకున్న భవిత వర్ధిల్లురా" అనే విషయాన్ని కవి ఎలా తెలియజేశారు?


**ఆ) కింది ప్రశ్నలకు 8 నుంచి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. "రాగిపై పూసిన బంగారం చెదిరిపోవును" అని కవి అనడంలో ఆంతర్యం ఏమిటి ?
2. మహాత్ములకు ఉండవలసిన సహజ లక్షణాలు ఏవి?
3. ఈ పాఠంలోని పద్యాల ఆధారంగా మీరు నేర్చుకున్న మంచి లక్షణాలను రాయండి.
4. మీరు చదివిన శతక పద్యాల ఆధారంగా మంచి లక్షణాలను ప్రశంసిస్తూ రాయండి.

AP SCERT



https://amaravathiteacher.com



## భాషాంశాలు

### i. పదజాలం

**అ) కింది వాక్యాలను చదవండి. గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.**

ఉదా: మనిషికి ధనంపై మోహం ఉండరాదు.

మోహం = కోరిక

1. క్షమ వలన సిరి లభిస్తుంది.

   క్షమ = ..................................................................

2. స్నేహితులతో వైరం మంచిదికాదు.

   వైరం = ..................................................................

3. తామరలు పంకిలం నుండి వికసిస్తాయి.

   పంకిలం = ..................................................................

4. భాస్కరుడు లోకానికి వెలుగునిస్తాడు.

   భాస్కరుడు = ..................................................................

**ఆ) కింది వాక్యాలలో సమానార్థక పదాలను (పర్యాయ పదాలు) గుర్తించి రాయండి.**

1. కరముతో అన్నం తింటాము. హస్తములో రేఖలుంటాయి.

   చేయి = ................................, ................................

2. ధనమే అన్నింటికీ మూలం. ద్రవ్యం లేక పేదలు ఆకలితో పస్తులుంటున్నారు.

   సిరి = ................................, ................................

3. ఆడపిల్ల చదువు అవనికే వెలుగు. భూకంపం వల్ల పుడమి కుంగుతుంది.

   భూమి = ................................, ................................

4. పసిడితో చేసిన ఆభరణాలు అందంగా ఉంటాయి. అందుకే పుత్తడికి ధర ఎక్కువ.

   కనకం = ................................, ................................

**ఇ) కింది పదాలకు వ్యతిరేక పదాలను రాయండి.**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఉదా: | పాపం | × | పుణ్యం | 5. | సత్యం | × | .................... |
| 1. | ధర్మం | × | .................... | 6. | మైత్రి | × | .................... |
| 2. | సుజ్ఞాని | × | .................... | 7. | చిన్న | × | .................... |
| 3. | విద్య | × | .................... | 8. | స్వ | × | .................... |
| 4. | చెడు | × | .................... | | | | |

AP SCERT



https://amaravathiteacher.com

## ఈ) ప్రకృతి – వికృతి :

**కొందరు చిన్న విషయాలకే <u>అగ్గి</u>మీద గుగ్గిలం అవుతుంటారు. (జవాబు : ఇ (అగ్ని)**

అ) అగ్గి ఆ) మంట ఇ) అగ్ని ఈ) ఆజ్యం

**కింది ప్రకృతి – వికృతి పదాలను జతపరచండి.**



| | | | | |
|---|---|---|---|---|
| 1. | విద్య | (     ) | అ) | అంచ |
| 2. | ధర్మము | (     ) | ఆ) | విద్దె |
| 3. | హంస | (     ) | ఇ) | మొగము |
| 4. | ముఖము | (     ) | ఈ) | దమ్మము |

## పదకేళి

**ఉ) కింది పదపట్టిక ఆధారంగా శతకాలను, శతక కర్తలను గుర్తించండి. వాటి చుట్టూ గీతగీసి ఖాళీలలో రాయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| కా | ళి | కాం | బ | శ | కు |
| ళ | తె | హం | ద్దె | న | మా |
| హ | లు | స | భా | స్క | ర |
| స్త్రీ | గు | ధి | ర | శ | దా |
| శ్వ | పూ | క | రు | ణ | శ్రీ |
| ర | లు | ఏ | ను | గు | శ్రీ |

..............................................

..............................................

..............................................

..............................................

..............................................

**ఉదా :** పక్కి అప్పల నరసయ్య రాసిన శతకం? = కుమార శతకం

| | | | |
|---|---|---|---|
| 1. | ధూర్జటి రాసిన శతకం? | = | ............................ |
| 2. | వీరబ్రహ్మం గారు రాసిన శతకంలోని మకుటం | = | ............................ |
| 3. | మారద వెంకయ్య రాసిన శతకం? | = | ............................ |
| 4. | తెలుగుబాల శతక కర్త? | = | ............................ |
| 5. | కంచర్ల గోపన్న రాసిన శతకం? | = | ............................ |
| 6. | సుమతీ శతకం రాసిందెవరు? | = | ............................ |
| 7. | నార్ల చిరంజీవి రాసిన శతకం? | = | ............................ |
| 8. | సిరిసిరి మువ్వ శతక కర్త? | = | ............................ |
| 9. | కాళికాంబ సప్తశతి శతక కర్త ఎవరు? | = | ............................ |
| 10. | సుభాషిత రత్నావళి కర్త? | = | ............................ |

AP SCERT



https://amaravathiteacher.com

## ii. వ్యాకరణాంశాలు

**వ్యాకరణం : (సంస్కృత సంధులు, తత్పురుష సమాసాలు)**

మనం గత పాఠాల్లో ఉత్వ, అత్వ, ఇత్వ, యడాగమం నేర్చుకున్నాం కదా! వాటిని తెలుగు సంధులు అంటారు. మన తెలుగు భాషలో చాలా తత్సమ పదాలు (సంస్కృత భాష నుండి తెలుగు భాషలోనికి వచ్చిన పదాలు) ఉండడం చేత మనం సంస్కృత సంధులను కూడా నేర్చుకోవాలి. ఈ పాఠంలోని పద్యాలు, కవుల పేర్లు గమనించారా? వీటిలో చాలా పదాలు సంస్కృతం నుండి వచ్చినవి.

### విభాగం 1 : కొత్త సంధి పరిచయం – సవర్ణదీర్ఘ సంధి

శాస్త్రవేత్తలా పరిశీలిద్దాం!

**పరిశీలన 1 : ఈ పదాన్ని గమనించండి.**

రత్నావళి = రత్న + ఆవళి

- పూర్వపదం (మొదటి పదం) చివరి అచ్చు : రత్న = త్న్ + అ = (అ)
- పరపదం (రెండవ పదం) మొదటి అచ్చు : ఆవళి = (ఆ)
- ఏం జరిగింది? : అ + ఆ కలిసినప్పుడు, ఆ రెండూ పోయి, వాటి స్థానంలో వాటికి సవర్ణమైన (ఒకే వర్ణం) దీర్ఘం (ఆ) వచ్చింది.
- ఫలితం : రత్న్ + ఆ + వళి = రత్నావళి

**పరిశీలన 2 : ఇంకో ఉదాహరణ చూద్దాం.**

మహాత్ములకు = మహా + ఆత్ములకు

- పూర్వ స్వరం : మహా = హ్ + ఆ = (ఆ)
- పర స్వరం : ఆత్ములకు = (ఆ)
- ఏం జరిగింది? : ఆ + ఆ = ఆ (దీర్ఘం వచ్చింది)

**పరిశీలన 3 : ఇతర ఉదాహరణలు:**

కవీంద్రుడు = కవి + ఇంద్రుడు = ఇ + ఇ = ఈ,

భానూదయం = భాను + ఉదయం = ఉ + ఉ = ఊ

మాతౄణం = మాతృ + ఋణం = ఋ + ఋ= ౠ

**ముగింపు (నిర్వచనం) :**

అ, ఇ, ఉ, ఋ లకు అవే అచ్చులు (సవర్ణాలు) పరమైనప్పుడు, ఆ రెండింటి స్థానంలో వాటి దీర్ఘం ఏకాదేశంగా రావడాన్ని "సవర్ణదీర్ఘ సంధి" అంటారు.

- అ/ఆ + అ/ఆ = ఆ
- ఇ/ఈ + ఇ/ఈ = ఈ
- ఉ/ఊ + ఉ/ఊ = ఊ
- ఋ/ ౠ + ఋ/ ౠ = ౠ

AP SCERT



https://amaravathiteacher.com

## విభాగం 2 : కొత్త సంధి పరిచయం – గుణ సంధి

శాస్త్రవేత్తలా పరిశీలిద్దాం!

**పరిశీలన 1: ఈ పదాన్ని గమనించండి.**

హితోక్తి = హిత + ఉక్తి

- పూర్వ స్వరం : హిత = త్ + అ = (అ)
- పర స్వరం : ఉక్తి = (ఉ)
- ఏం జరిగింది? : అ + ఉ కలిసినప్పుడు, ఆ రెండూ పోయి, కొత్తగా (ఓ) అనే అచ్చు వచ్చింది.
- ఫలితం : హిత్ + ఓ + క్తి = హితోక్తి

**పరిశీలన 2 : ఇంకో ఉదాహరణ :**

మహేశ్వరుడు = మహా + ఈశ్వరుడు

- పూర్వ స్వరం : మహా = హ్ + ఆ = (ఆ)
- పర స్వరం : ఈశ్వరుడు = (ఈ)
- ఏం జరిగింది? : ఆ + ఈ కలిసినప్పుడు, ఆ రెండూ పోయి, కొత్తగా (ఏ) అనే అచ్చు వచ్చింది.


**పరిశీలన 3 : ఇంకో ఉదాహరణ:**

మహర్షి = మహా + ఋషి

- పూర్వ స్వరం : మహా = హ్ + ఆ = (ఆ)
- పర స్వరం : ఋషి = (ఋ)
- ఏం జరిగింది? : ఆ + ఋ కలిసినప్పుడు, ఆ రెండూ పోయి, కొత్తగా (అర్) వచ్చింది.
- మహ్ + అ + ర్ + షి = మహర్షి

**ముగింపు (నిర్వచనం):**

**అ/ఆ** లకు **ఇ/ఈ** లు పరమైతే **'ఏ'** కారం **ఉ/ఊ** లు పరమైతే **'ఓ'** కారం **ఋ/ ౠ** లు పరమైతే **'అర్'** ఏకాదేశంగా వస్తాయి. **ఏ, ఓ, అర్ లకు "గుణములు"** అని పేరు, అందువలన దీనిని **"గుణ సంధి"** అంటారు.




AP SCERT

## విభాగం 3: కొత్త సమాసం – తత్పురుష సమాసం

పిల్లలూ, మనం 6వ తరగతిలో సమాసం, సమాస పద ప్రాధాన్యం గురించి తెలుసుకున్నాం కదా, 'విభక్తులు' పునశ్చరణ చేశాం కదా!

ఇప్పుడు ఆ విభక్తి ప్రత్యయాలు ఉండి అవి లోపించిన సమాసపదాలను పరిశీలిద్దాం. ఇలా విభక్తి ప్రత్యయాలు ఉండే సమాసాలను తత్పురుష సమాసాలు అంటారు. తత్పురుష సమాసం ఉత్తరపద ప్రాధాన్యం కలది.

**పరిశీలన 1:**

- సమాస పదం : వృద్ధజన సేవ. ఇది వాక్యంలో ప్రయోగిస్తే వాడు వృద్ధజన సేవ చేశాడు. సేవ అనే పదం చేశాడు అనే క్రియాపదంతో అన్వయం చెందుతోంది కాబట్టి ఇది ఉత్తరపద ప్రాధాన్యం కలది. ఇప్పుడు ఎవరి యొక్క సేవ చేశాడు అని ప్రశ్నిస్తే "వృద్ధ జనుల యొక్క సేవ" చేశాడు అని సమాధానం వస్తుంది.



https://amaravathiteacher.com

- విగ్రహవాక్యం : వృద్ధజనుల యొక్క సేవ
- ఏం జరిగింది? : యొక్క అనే విభక్తి ప్రత్యయం లోపించింది.
- దీని పేరు : 'యొక్క' అనేది "షష్ఠీ విభక్తి". కాబట్టి ఇది "షష్ఠీ తత్పురుష సమాసం".

**పరిశీలన 2 :**

- సమాస పదం : పాప పంకిలము
- విగ్రహ వాక్యం : "పాపము చేత పంకిలము" (పంకిలము = బురద)
- ఏం జరిగింది? : చేత అనే విభక్తి ప్రత్యయం లోపించింది.
- దీని పేరు : 'చేత' అనేది "తృతీయా విభక్తి". కాబట్టి ఇది "తృతీయా తత్పురుష సమాసం".

**పరిశీలన 3:**

- పదం: గురుభక్తి
- విగ్రహ వాక్యం : "గురువు యందు భక్తి"
- ఏం జరిగింది? : అందు అనే విభక్తి ప్రత్యయం లోపించింది.
- దీని పేరు : 'అందు' అనేది "సప్తమీ విభక్తి". కాబట్టి ఇది "సప్తమీ తత్పురుష సమాసం".

**ముగింపు (నిర్వచనం) :**

సమాసంలో రెండవ పదం (ఉత్తర పదం) యొక్క అర్థం ప్రధానంగా ఉండి, మొదటి పదం (పూర్వ పదం) యొక్క విభక్తి ప్రత్యయం లోపించి కనిపిస్తే, దానిని "తత్పురుష సమాసం" అంటారు. ఏ విభక్తి ప్రత్యయం లోపిస్తే ఆ విభక్తి పేరుతో ఆ సమాసాన్ని పిలుస్తారు.

## అభ్యాసాలు

### అభ్యాసం 1 : సంధులను విడదీద్దాం!

కింది పదాలను విడదీసి, అది ఏ సంస్కృత సంధో (సవర్ణదీర్ఘ / గుణ) గుర్తించండి.

| సంధి పదం | విడదీసిన రూపం (పూర్వపదం + పరపదం) | సంధి పేరు (సవర్ణదీర్ఘ / గుణ) |
|---|---|---|
| ఉదా : కాళికాంబ | కాళిక + అంబ | సవర్ణదీర్ఘ సంధి |
| 1. హితోక్తి | + | |
| 2. గురుచరణాభివాదనము | + | |
| 3. నరేంద్రుడు | + | |
| 4. గురూపదేశం | + | |
| 5. దేవర్షి | + | |

AP SCERT



https://amaravathiteacher.com

**అభ్యాసం 2 : తెలుగు సంధులను గుర్తించండి.**

| సంధి పదం | విడదీసిన రూపం (పూర్వపదం + పరపదం) | సంధి పేరు |
|---|---|---|
| ఉదా : నిలువెల్ల | నిలువు + ఎల్ల | ఉత్వ సంధి |
| 1. ప్రేమయెసంగు | + | |
| 2. మూసినయంతటన్ | + | |
| 3. మేలది | + | |

**అభ్యాసం 3 : విగ్రహ వాక్యం రాసి సమాసాలను గుర్తించండి.**

| సమాసం | విగ్రహవాక్యం | సమాసం పేరు |
|---|---|---|
| ఉదా : గురుచరణాభివాదనము | గురువు చరణములకు అభివాదము | షష్ఠీతత్పురుష సమాసం (కు షష్ఠీవిభక్తి ప్రత్యయం) |
| 1. సుత్తిదెబ్బ | | |
| 2. దేశభక్తి | | |
| 3. లోకమిత్ర | | |
| 4. ఆంధ్రపుత్ర | | |

AP SCERT



## ప్రాజెక్టుపని

శతక కవులకు సంబంధించిన విషయాలను సేకరించి కింది పట్టికను తయారుచేయండి.

| క్రమ సంఖ్య | కవి పేరు | కాలం | శతకం పేరు | ఇతర రచనలు |
|---|---|---|---|---|
| | | | | |



## చమత్కార పద్యం

చలన శక్తి గలదు జంతువు గాదది
చేతులెపుడు తిప్పు శిశువు గాదు
కాళ్ళు లేవు సర్వకాలంబు నడచును
దీని భావమేమి? తిరుమలేశ !






## మీకు తెలుసా?

**శౌరి :** శ్రీకృష్ణుని తండ్రి వసుదేవుడు. వసుదేవుని తండ్రి శూరుడు. శ్రీకృష్ణుడు శూరుని మనుమడు కాబట్టి ఆయనకు 'శౌరి' అని పేరు వచ్చింది.

**భవమోహపాశములు :** 'భవము' అనగా పుట్టుక, ఉనికి అని, 'మోహము' అనగా వలపు, భ్రాంతి అని, 'పాశము' అనగా త్రాడు, బంధము అని అర్థాలు. ఈ మూడింటిని కలిపి భవమోహపాశములు అంటున్నారు. పుట్టుకతో వచ్చే కోరిక సంబంధ బాంధవ్యాలను 'భవమోహపాశములు' అంటారు.



https://amaravathiteacher.com

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పాఠంలోని పద్యాలను రాగయుక్తంగా, భావయుక్తంగా పాడగలను. | ఔను / కాదు |
| 2. | పద్యభావాలను సొంత మాటలలో చెప్పగలను, రాయగలను. | ఔను / కాదు |
| 3. | పాఠంలోని పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 4. | పాఠంలోని ప్రశ్నలకు జవాబులు సొంతమాటలలో రాయగలను. | ఔను / కాదు |

## చదవండి - ఆనందించండి

### ఆశాపాత్ర



విశాల రాజ్యానికి రాజు ఇంద్రసేనుడు. ఒకరోజు మహారాజు అంతఃపురం పైనుంచి కిందికి చూశాడు. ఒక బిచ్చగాడు చెట్టు కింద కూర్చుని కనిపించాడు. అతని స్థితిని చూసి రాజు ఎంతో బాధపడ్డాడు. నేను ఎంతో చక్కగా పరిపాలిస్తున్నాను, రాజ్యంలో అందరూ సిరి సంపదలతో వర్ధిల్లాలి కదా! మరి నా ఎదురుగానే ఒక బిచ్చగాడు కనబడడమేమిటి? అనుకున్నాడు. గబగబా అంతఃపురం నుంచి బయటికి వచ్చాడు. మంత్రులందరూ అతనిని అనుసరించారు. రాజు బిచ్చగాడిని సమీపించాడు. రాజు ఎదురుగా నిలబడడంతో బిచ్చగాడు భయం భయంగా లేచి నిల్చున్నాడు.

ఇంద్రసేనుడు అతనితో " ఏం కావాలో కోరుకో" అని అన్నాడు. అప్పుడు బిచ్చగాడు నేను కోరుకున్నది మీరు ఇవ్వలేరు మహారాజా అన్నాడు. రాజుకు పౌరుషం వచ్చింది. ఏం కావాలన్నా ఎంత కావాలన్నా ఇస్తాను అన్నాడు. జోలె నుంచి భిక్షాపాత్రను తీశాడు. బిచ్చగాడు ఖాళీ పాత్ర రాజుకి చూపించాడు. ఈ పాత్ర నిండుగా దానం చేయండి చాలు మహాప్రభు అన్నాడు.




"వెండి వరహాలు తెచ్చి నిండుగా పోయండి" అని రాజు తన పరివారాన్ని ఆజ్ఞాపించాడు. దోసిళ్ళతో వరహాలు తీసుకు వచ్చారు. రాజుగారి ఆజ్ఞ నెరవేర్చడానికి మంత్రులు పోటీపడ్డారు. ఒక దోసెడు చాలు పాత్ర నిండిపోతుంది అంటూ ఓ మంత్రి వైపు దానం చెయ్యమన్నట్టుగా రాజు చూశాడు. ఆ మంత్రి భిక్షాపాత్రలో వరహాలు పోశాడు. దోసెడు వరహాలకు పాత్ర నిండిపోవాలి. కానీ నిండలేదు. పోసిన వరహాలు పోసినట్టే మాయమైపోయాయి.

**నీతి :** ఏ పాత్రనైనా నింపవచ్చుగానీ మానవుని మస్తిష్కంలోని ఆశాపాత్రను నింపడం ఎవ్వరికీ సాధ్యం కాదు.

APSCERT



https://amaravathiteacher.com

# 6 మన విశిష్ట ఉత్సవాలు


(ఉపవాచకము)

Y1R6K3

మన తెలుగు రాష్ట్రాలలో వివిధ ఉత్సవాలు, జాతరలు జరుగుతుంటాయి. అవి ఆయా ప్రాంత ప్రజల చరిత్ర, సంస్కృతి వారసత్వ సంపదకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. విభిన్న అలవాట్లు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రజల మధ్య ఐకమత్యాన్ని నెలకొల్పుతున్నాయి. మనదేశ మూలభావం భిన్నత్వంలో ఏకత్వం. ఈ భావాన్ని పెంపొందిస్తూ మన రాష్ట్రంలో జరిగే కొన్ని ఉత్సవాల గురించి తెలుసుకుందాం....

## 1. సిరిమానోత్సవం

సిరిమాను అంటే సంపదలిచ్చే పెద్ద చెట్టు. పైడితల్లి అమ్మవారు ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు. ఆ అమ్మవారి సిరిమానోత్సవం విజయనగరంలో జరుగుతుంది. ఈ ఉత్సవంలో మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలనుండి కూడా లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు.



పైడితల్లి అమ్మవారి జాతరలో భాగంగా జరిగే ఈ సిరిమానోత్సవంలో చారిత్రక అంశాలు మిళితమై ఉన్నాయి. ఒకసారి విజయనగరాన్ని పరిపాలించే విజయరామరాజు యుద్ధానికి సిద్ధమవుతాడు. యుద్ధానికి వెళ్ళవద్దని అతని చెల్లెలు పైడిమాంబ బ్రతిమాలింది. అయినప్పటికీ చెల్లెలు మాట పెడచెవిన పెడతాడు. యుద్ధానికి వెళ్తాడు. యుద్ధరంగంలో ఉన్న అన్నని చూడడానికి పైడిమాంబ బయలుదేరుతుంది. అక్కడికి చేరేలోపే తాండ్ర పాపారాయుడి చేతిలో తన అన్న హతమయ్యాడన్న వార్త తెలిసి స్పృహ కోల్పోతుంది. పరిచారికలు పరిచర్యలు చేశాక పైడిమాంబ కోలుకుంటుంది. తన అన్న లేకుండా తాను జీవించలేనంటుంది. అక్కడే ఉన్న పెద్ద చెరువులో ఆత్మార్పణ చేసుకుంటుంది. కొంతకాలానికి స్నేహితురాళ్ళకు కలలో కనిపిస్తుంది. పెద్ద చెరువులో తాను విగ్రహమై వెలుస్తానంటుంది. తనను వెలికితీసి గుడి కట్టాలని చెప్పింది. దానితో బెస్తవారు వలలతో గాలించి అమ్మవారి విగ్రహాన్ని బయటికి తీశారు. చెరువుగట్టుపై పైడిమాంబ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

విజయదశమి తరువాత వచ్చే మొదటి మంగళవారం నాడు విగ్రహ ప్రతిష్ఠ చేస్తారు. అప్పటి నుండి దసరా తర్వాత వచ్చే మొదటి మంగళవారంనాడు పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం జరుగుతోంది. సిరిమానోత్సవం జరగడానికి 15 రోజుల ముందుగానే పైడితల్లి అమ్మవారి సిరిమానును ఎక్కడినుండి తేవాలనే విషయాన్ని పూజారి ఆలయ ధర్మకర్తలకు తెలియజేస్తాడు. పూజారి సూచన మేరకు వారు సిరిమాను ఉన్న చోటికి వెళ్తారు. స్థల యజమాని అనుమతితో సిరిమానును తీసుకువస్తారు.




APSCERT
https://amaravathiteacher.com

సుమారు 60 అడుగుల పొడవు ఉండే సిరిమాను చివర ఆసనం ఏర్పాటు చేస్తారు. దానిపై పూజారిని కూర్చోబెడతారు. గుడిపూజారిని పైడిమాంబ అమ్మవారి ప్రతిరూపంగా భావిస్తారు. ఆయనను ఆ ఆసనంలో కూర్చోబెడతారు. ఆలయం నుండి విజయనగర రాజుల రాజప్రాసాదం వరకు మూడుసార్లు ఊరేగిస్తారు. ఆ సిరిమానుకు ముందుభాగంలో బెస్తవారి వల, అంజలిరథం (దేవతల రథం) నడుస్తాయి. సిరిమానోత్సవం అంగరంగవైభవంగా జరుగుతుంది. అమ్మవారు వెలిసిన తర్వాత ఈ ప్రాంత ప్రజలు ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలకు గురికాలేదు. అదంతా అమ్మవారి దయ అని ఈ ప్రాంత ప్రజలు భావిస్తారు. జాతరలో భాగంగా అమ్మవారి ఘటాలు రాజ మహల్‌కి తీసుకువెళ్తారు. తిరిగి చదురు గుడికి చేరుకుంటారు. రాబోయే సంవత్సర కాలంలో జరిగే మంచి చెడులను పైడితల్లి అమ్మవారు పూజారి రూపంలో చెబుతుందని భక్తుల విశ్వాసం. ఆ సమయంలో పూజారి ధాన్యపు గింజలను ఇస్తాడు. వాటిని తమ పొలాల్లో మొదటి విత్తుగా నాటుకుంటే మంచి పంట పండుతుందని రైతుల నమ్మకం.

## 2. గుణదల మేరీమాత ఉత్సవం

దక్షిణ భారతదేశంలో ఉన్న పెద్ద చర్చిలలో గుణదల మేరీమాత చర్చి ఒకటి. ఇక్కడ ఫ్రాన్స్ దేశంలోని లూర్దు నగరం చర్చిలో ఉన్న మేరీమాత విగ్రహాన్ని పోలిన విగ్రహం ఉంది. ఇది గుహలో ఉంటుంది. విజయవాడ సమీపంలోని గుణదల చర్చిలో కూడా మేరీమాత విగ్రహం కొండ గుహలోనే ఉంటుంది. అందువల్ల ఈ చర్చి ప్రసిద్ధి చెందింది.



ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 9,10,11 తేదీలలో గుణదల మేరీమాత ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాల వెనుక ఒక కథ ఉంది. లూర్ధునగర శివారులో ఉన్న కొండ దిగువకు వంట చెరకు ఏరుకోడానికి బెర్నాడెట్ అనే బాలిక వెళ్లింది. ఆమెకు మేరీమాత ఒక స్త్రీ రూపంలో దర్శనమిచ్చి, మాట్లాడింది. ఆ బాలిక ఇదే విషయం తల్లితోనూ ఇతరులతోను చెప్పింది. ఇది విని అందరూ ఆశ్చర్యపోయారు. మేరీమాత కనిపించిన ఫిబ్రవరి 11వ తేదీని గుర్తుచేసుకుంటూ, ప్రతి సంవత్సరం అక్కడ మేరీమాత ఉత్సవాలు జరుగుతాయి. గుణదలలో కూడా 1924 నుండి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 11న మేరీమాత ఉత్సవాలు జరుగుతున్నాయి.

1924 వ సంవత్సరంలో బ్రిటిష్ ప్రభుత్వం గుణదలలో "సెయింట్ జోసెఫ్స్ ఇన్స్టిట్యూట్" అనే అనాథ శరణాలయం ఏర్పాటు చేసింది. ఇటలీకి చెందిన ఫాదర్ పి. ఆర్లాటి దానికి రెక్టార్‌గా నియమితుడయ్యాడు. ఆయన అదే సంవత్సరం గుణదల కొండపై ఉన్న గుహలో మేరీమాత విగ్రహాన్ని నెలకొల్పాడు. అప్పటి నుండి మేరీమాత పూజలందుకుంటోంది.




https://amaravathiteacher.com

1946 లో అప్పటి చర్చి ఫాదర్ బియాంకి, ఇతరులు కలిసి నూతన మేరీమాత విగ్రహాన్ని, బలిపీఠాన్ని నిర్మించదలిచారు. అత్యవసరంగా ఫాదర్ బియాంకి ఇటలీ వెళ్ళాడు. మిగిలినవారు చర్చి నిర్మాణాన్ని కొనసాగించారు. అకస్మాత్తుగా వచ్చిన వరదలలో అప్పటి వరకు సిద్ధమైన నిర్మాణాలన్నీ కొట్టుకుపోయాయి. తిరిగి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఫాదర్ బియాంకి ఇటలీ నుండి తిరిగి వచ్చేనాటికి (1947)చర్చి నిర్మాణం పూర్తయ్యింది. అప్పటి నుండి ప్రతి శుక్ర, శని, ఆది వారాల్లోనూ, క్రిస్మస్, జనవరి1, గుడ్ ఫ్రైడే వంటి క్రైస్తవ పర్వదినాల్లోనూ ప్రజలు మేరీమాతను దర్శించుకుని దీవెనలు పొందుతున్నారు.

భక్తుల తాకిడి పెరగడంతో గుణదల మేరీమాత ఉత్సవాలు ఒకే రోజు కాకుండా మూడు రోజులపాటు జరుపుకుంటారు. ఈ ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు హాజరవుతారు. కొండవద్ద సహజసిద్ధంగా ఏర్పడ్డ గుహనుండి కొండపై నిర్మించిన శిలువకు ఇప్పుడు మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేశారు. ఈ కాలిబాటలో క్రైస్తవులు పవిత్రంగా భావించే వయాడోలరోసా అనే 14 స్థలాల విశిష్టతను తెలిపే క్రీస్తు జీవిత ఘట్టాలను ఏర్పాటు చేశారు. నవంబర్ నుండి డిసెంబర్ వరకు జరిగే ప్రత్యేక ప్రార్థనలకు రాష్ట్రం నలుమూలల నుండి క్రైస్తవ భక్తులు వేలాదిగా వస్తారు.

## 3. కోటప్పకొండ ప్రభల తిరునాళ్ళు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రసిద్ధిచెందిన శైవక్షేత్రాలలో కోటప్పకొండ ఒకటి. ఇది గుంటూరు జిల్లాలోని నరసరావుపేట సమీపంలో ఉంది. ఇది ఎల్లమంద కొండకావూరుకు మధ్య గల పర్వత ప్రాంతం. 1500 ఎకరాల వైశాల్యం ఎనిమిది మైళ్ళ చుట్టుకొలతతో ఈ ప్రాంతం విస్తరించి ఉంటుంది. ఈ కొండ చుట్టూ రాళ్ల మధ్యలో చిన్నచిన్న గుంటలు (దొనలు) ఉంటాయి. వీటితో పాటు కొండ మధ్యలో 'పాపనాశనం' అనే తీర్థం ఉంది. ఇది స్వయంగా శివుడు తన త్రిశూలంతో కొట్టగా ఏర్పడిందంటారు. వీటిలో స్నానం చేస్తే పాపాలు నశిస్తాయని భక్తుల నమ్మకం.



ఈ కొండను ఏ వైపు నుంచి చూసినా మూడు కూటములు (శిఖరములు) కనిపిస్తాయి. వీటి మీద మూడు శివలింగాలు ఉన్నాయి. అందుకే కోటప్పకొండ త్రికూటాచలంగానూ, మధ్య శిఖరం మీద ఉన్న శివుడు త్రికూటేశ్వరుడిగా పూజలందుకుంటున్నాడు. కొండ కింది భాగంలో గొల్లభామ గుడి ఉంది. ఈమె పరమ భక్తురాలైన ఆనందవల్లి. ఈమెను ముందుగా దర్శించిన తరువాత కోటయ్యను దర్శిస్తారు. స్థలపురాణం ప్రకారం దక్షయజ్ఞం తరువాత పరమశివుడు ఇక్కడ పన్నెండు సంవత్సరాల బాలునిగా అవతరించాడు. శ్రీ మేధా దక్షిణామూర్తి రూపంలో దేవతలతో నివసించాడని చెబుతారు.

AP SCERT



https://amaravathiteacher.com

కోటప్పకొండ అనగానే మహాశివరాత్రినాడు జరిగే ప్రభల ప్రదర్శన గుర్తుకు వస్తుంది. ప్రభలు అనగా వెదురు కర్రలతో దీర్ఘచతురస్రాకారంగా పొడవైన ఆకారాలు నిర్మిస్తారు. దానికి పై భాగంలో త్రికోణపు ఆకారాన్ని ఏర్పాటు చేస్తారు. రంగు రంగుల గుడ్డలతోను కాగితాలతోను కప్పుతారు. రకరకాల బొమ్మలను అతికిస్తారు. ప్రభల అంచులను చిరుగంటలతో విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. ఇవి పది నుండి వంద అడుగుల ఎత్తు వరకు ఉంటాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రభలలో ఒకదానిని మించిన ప్రభ మరొకటి ఎంతో ఎత్తయినది. వీటిని ఎడ్లబండ్లపైన, ట్రాక్టర్ల పైన ఉంచి మేళతాళాల మధ్య కొండకు ఊరేగింపుగా తీసుకువస్తారు.

మొక్కుబడులు ఉన్నవారు చిన్న ప్రభలను తమ భుజాలపై ఉంచుకొని కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. ప్రజలు ఆయా గ్రామాల నుండి ఊరేగింపుగా వచ్చేటప్పుడు స్త్రీలు కడవలతో వారు పోస్తారు. ప్రభల ముందు భాగంలో జంగమ దేవరలు కత్తులు చేతపట్టి "శివ శివ మూర్తివి గణనాథా – నీవు శివుని కుమారుడవు గణనాథా" అంటూ భక్తితో దండకాలు చదువుతారు. "చేదుకో కోటయ్య చేదుకో.... చేదుకో మల్లయ్య చేదుకో..." అని స్వామిని భక్తి భావంతో పిలుస్తూ కొండను ఎక్కడం నేటికీ ఇక్కడ చూడవచ్చే విశేషం.

వ్యవసాయంలో ముఖ్య భూమిక పోషించే ఎద్దులను ఈ ప్రాంత రైతులు కన్న బిడ్డలవలె సాకుతారు. కోడెదూడలు, ఎద్దులు, రైతుల ఇళ్ళలోని బిడ్డలు ఏవిధమైన అనారోగ్యం పాలవ్వకుండా క్షేమంగా ఉండాలని మొక్కుకుంటారు. మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా అత్యంత జనసందోహంతో జరిగే జాతరగా కోటప్పకొండ ప్రభల తిరునాళ్ళు ప్రసిద్ధి చెందాయి. కోటప్పకొండ ప్రభల ఉత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది.

## 4. రొట్టెలపండుగ

హిందూ ముస్లింలు ఐకమత్యంతో జరుపుకునే పండుగలలో రొట్టెలపండుగ ఒకటి. ఇది నెల్లూరులో ఉన్న స్వర్ణాలచెరువు వద్ద జరుగుతుంది. దీనిని ప్రతి సంవత్సరం మొహర్రం నెలలో నెలవంక కనిపించిన పదకొండవరోజు నుండి మూడురోజుల పాటు నిర్వహిస్తారు. ఈ రొట్టెలపండుగలో మనరాష్ట్రం నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా కులమతాలకు అతీతంగా లక్షలాదిగా ప్రజలు పాల్గొంటారు.

ఈ పండుగలో మహిళలు అత్యధికంగా పాల్గొంటారు. నెల్లూరు జిల్లా గండవరం వద్ద జరిగిన పవిత్ర యుద్ధంలో 12 మంది ఇస్లాం వీరులు మరణించారు. వీరి మొండాలను వారి గుర్రాలు దర్గామిట్ట చెరువు వద్దకు చేర్చాయి. మొండాలు అక్కడే ఖననం అయ్యాయి. కాలక్రమంలో ఈ పన్నెండు మొండాలకు స్థానికులు సమాధులు నిర్మించారు. ఆ స్థలానికి బారా షహీద్ (బారహ్ అనగా పన్నెండు.. షహీద్ అనగా వీరుడు) అని పేరు పెట్టారు. మరణించిన 12 మంది తలలలో ఏడుగురి తలలు మాత్రమే యుద్ధం జరిగినచోట లభ్యమయ్యాయి. ఈ ఏడు తలలు లభ్యమైన ప్రదేశాన్ని సాతోషహీద్ అంటారు.

నెల్లూరు ప్రాంతాన్ని పరిపాలించిన ఆర్కాటు నవాబు భార్య తీవ్రమైన అనారోగ్యంతో బాధపడేది. ఆ రోగనివారణకు నవాబు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించలేదు. దర్గామిట్ట చెరువు వద్ద రజక దంపతులకు ఈ పన్నెండుమంది యుద్ధవీరులు కలలో కనిపించారు. సమాధులపై ఉన్న మట్టిని నవాబు భార్యకు లేపనంగా పూస్తే ఆమె ఆరోగ్యం కుదుట పడుతుందని తెలిపారు. ఆ దంపతులు ఈ విషయాన్ని నవాబు ఆస్థానంలోని రాజగురువుకి చేరవేసారు. రాజగురువు ద్వారా విషయం తెలుసుకున్న నవాబు బారాషహీద్ నుండి మట్టి తీసుకువచ్చి తన భార్యకు లేపనం చేస్తాడు. దానితో నవాబు భార్య ఆరోగ్యాన్ని తిరిగి పొందుతుంది.

APSCERT



https://amaravathiteacher.com

దీనికి కృతజ్ఞతగా ఆర్కాటు నవాబు భార్యా సమేతంగా బారాషహీద్‌ను సందర్శించాడు. ప్రార్థనలు నిర్వహించి రొట్టెలు నైవేద్యంగా సమర్పించాడు. అక్కడ ఉన్న ప్రజలకు ఆ రొట్టెలు పంచాడు. బారాషహీద్ దర్గాను అభివృద్ధి చేసాడు.



అప్పటి నుండి ప్రజలు తమకు ఎలాంటి కోరికలు ఉన్నా బారహ్ షహీద్ దర్గాను సందర్శించడం ప్రారంభించారు. వారి కోరిక తీరితే తర్వాత సంవత్సరం దర్గాను సందర్శించి రొట్టెలు పంచుతామని మొక్కుకుంటారు.

అలా కోరిక తీరినవారు మరుసటి సంవత్సరం జాతరకు వస్తారు. రొట్టెల పండుగ నాడు వారు తెచ్చిన రొట్టెలను ఇతరులతో పంచుకుంటారు. రొట్టెల పండుగ మొదటిరోజు షహదత్‌తో ప్రారంభమవుతుంది. రెండవరోజు గంధోత్సవం జరుగుతుంది. గంధోత్సవంలో భాగంగా కోటమిట్టలోని అమీనియా మసీదు నుండి గంధాన్ని తీసుకువస్తారు. ఈ 12 సమాధులకు గంధం పూస్తారు. మిగిలిన గంధాన్ని భక్తులకు ప్రసాదంగా ఇస్తారు. మూడవరోజు రొట్టెలపండుగ. ఆ రోజు భక్తులు స్వర్ణాల చెరువులో దిగి రొట్టెలు ఒకరికొకరు ఇచ్చిపుచ్చు కుంటారు.

AP SCERT

## 5. అహోబిలం పార్వేట ఉత్సవం

"హరినామమే కడు ఆనందకరము" అని నిత్యం తనని పూజించే భక్తుడు ప్రహ్లాదుణ్ణి రక్షించడానికి శ్రీమహావిష్ణువు నరసింహునిగా అహోబిలంలో అవతరించాడు. అహోబిలం కర్నూలు జిల్లాలో ఉంది. స్వామి వారి రూపాన్ని చూసిన దేవదానవులు అహో బలం ....అహో బలం అని ఆశ్చర్యపోయారు. ఇదే కాలక్రమేణా 'అహోబిలం' అనే పేరుతో స్థిరపడింది. ఇక్కడ కొలువైన నరసింహస్వామివారి దేవేరి చెంచులక్ష్మి.

ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు నరసింహుని కళ్యాణోత్సవం వైభవంగా జరుగుతుంది. ప్రతి దేవాలయంలోను కళ్యాణోత్సవం జరగడం ఆనవాయితీగా వస్తుంది. కాని అహోబిలంలో జరిగే కళ్యాణోత్సవానికి ఒక ప్రత్యేకత ఉంది. సంక్రాంతి వరకు దేవాలయంలో ఉన్న స్వామివారు కనుమనాడు ఉత్సవ మూర్తిగా దేవాలయం వెలుపలకి వస్తారు. ఈ క్రమంలో అహోబిలం చుట్టుప్రక్కల ఉన్న 35 గ్రామాలలో 41 రోజులపాటు ప్రతీ ఇంటిని సందర్శిస్తాడు. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు జరిగే తన కళ్యాణోత్సవానికి రమ్మని ప్రజలను ఆహ్వానిస్తాడు.





https://amaravathiteacher.com

ఈ సందర్భనలో కులమతాల ప్రసక్తిగానీ, ధనిక బీద తారతమ్యాలు కాని ఉండవు. ఆయా గ్రామాల పొలిమేరలకు స్వామివారి పల్లకి వస్తుంది. అక్కడి గ్రామాధికారులు, ప్రజాప్రతినిధులు ఎదురేగి స్వామి వారికి స్వాగతం పలుకుతారు. గ్రామంలోకి తోడ్కొనివెళ్తారు. 35 గ్రామాల ప్రజలూ తమ గ్రామానికి స్వామి వారి పల్లకి రాగానే సంబరాలు చేసుకుంటారు. స్వామివారి పల్లకి గ్రామంలో ఉన్నంతసేపు గ్రామం అంతా పండుగ వాతావరణం నెలకొంటుంది. ఈ విధంగా స్వామి వారు గ్రామాలు సందర్శించడాన్నే పార్వేట ఉత్సవం అంటారు. ఆయా గ్రామాలలోని తన ఆస్తులను స్వామి వారు చూసుకుంటారని అక్కడి వారి నమ్మకం.

పారువేట ఒక దేవ ఉత్సవం. 'పరి' అనగా గుర్రం, 'వేట' అనగా దుష్టశిక్షణ, శిష్టరక్షణ గురించి జరిగేది. దీనికై స్వామివారు అహోబిలం చుట్టుప్రక్కల సంచరిస్తారని నమ్మకం. సుమారు 600 సంవత్సరాల నుండి పార్వేట ఉత్సవాలు జరుగుతున్నాయి. స్వయంగా బ్రహ్మదేవుడు స్వామివారి కళ్యాణోత్సవం జరిపిస్తాడు. సకల దేవతలు స్వామి వారి కళ్యాణానికి హాజరవుతారని ప్రతీతి. దేవతలతో పాటు ప్రజలు కూడా హాజరై కళ్యాణోత్సవాన్ని తిలకిస్తారు. ఈ క్షేత్రంలో కొండపై ఉగ్ర నరసింహునిగా కొండ దిగువన శాంతమూర్తిగా, మొత్తం క్షేత్రం అంతా 9 రూపాలతో నవ నారసింహులుగా కొలువై ఉన్నారు. శ్రీమహావిష్ణువు నరసింహుని అవతారంగా ఉద్భవించిన స్తంభం కూడా ఇక్కడ ఉంది. 108 వైష్ణవ క్షేత్రాలలో అహోబిలం ప్రసిద్ధమైన 97వ క్షేత్రం. స్వామివారి కళ్యాణోత్సవానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

## 6. లేపాక్షి ఉత్సవాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపురం జిల్లాలోని లేపాక్షి ఒక చారిత్రక ప్రదేశంగా పేరొందింది. "లేపాక్షి ఉత్సవాలు" రాష్ట్ర పర్యాటకరంగ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయి. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి,మార్చి నెలలో అనుకూలమైన ఏవైనా రెండు రోజుల్లో ప్రభుత్వం ఈ ఉత్సవాలు నిర్వహిస్తుంది. లేపాక్షి ఉత్సవాల సందర్భంగా ఈ రెండు రోజులూ అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. ప్రతి ప్రదర్శన కన్నులకు కట్టేదిగా ఉంటుంది. లేపాక్షి ఆలయాలకు సంబంధించిన యక్ష, హరికథా గానాలు ప్రదర్శిస్తారు. లేపాక్షి చరిత్రా సంస్కృతులను తెలియజెప్పే నృత్య, గాన, సంగీత ప్రదర్శనలు ప్రేక్షకులను ఆనందింపజేస్తాయి. లేపాక్షి ఆలయాలను, చారిత్రక కట్టడాలను ఉత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా అలంకరిస్తారు.

విజయనగర రాజులు తమ పరిపాలనా కాలంలో ఇక్కడ ఎన్నో ఆలయాలు, కట్టడాలు నిర్మించారు. లేపాక్షి పట్టణంలోకి ప్రవేశించేటప్పుడు దేశంలోనే అతిపెద్ద ఏకశిలా నంది విగ్రహం చూడవచ్చు. ఇది ఠీవీగా పర్యాటకులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఉంటుంది. దీనినే లేపాక్షి బసవయ్య అంటారు. ఇది 8.1 మీటర్ల పొడవు, 4.5 మీటర్ల ఎత్తు కలిగిఉంటుంది. ఈ బసవయ్య మెడలో పూసలహారాలు, గంటలు ఉంటాయి. బసవయ్య విగ్రహం



లేపాక్షి బసవయ్య

AP SCERT



https://amaravathiteacher.com

రిక్కించిన చెవులతో, లేచి ఉరకబోడానికి కాళ్ళను సరిచేసుకుంటున్న భంగిమతో ఉంటుంది. మెడలో గల హారంలో వేలాడే రెండు గరుడ పక్షులు, వాటి ముక్కున వ్రేలాడే ఏనుగులు ఉంటాయి. ఇది ఆనాటి శిల్పుల అద్భుత శిల్పకళాసౌందర్యానికి ప్రతీక అని చెప్పవచ్చు. ప్రముఖకవి అడవి బాపిరాజు లేపాక్షి బసవన్నను ఉద్దేశించి రాసిన గేయం...




'లేపాక్షి బసవయ్య – లేచి రావయ్య
కైలాస శిఖరంలా – కదిలి రావయ్య....'

చాలా ప్రసిద్ధి చెందింది. ఈ విగ్రహానికి సమీపంలోనే మధ్యయుగం నాటి నిర్మాణకళతో కూడిన వీరభద్రస్వామి ఆలయం ఉంది. దీనినే 'లేపాక్షి' ఆలయం అంటారు. ఈ ఆలయం ఆధ్యాత్మికంగా ఎంతో ప్రత్యేకత సంతరించుకుంది. శివకేశవులకు భేదం లేదని చెబుతూ శివకేశవులను ఎదురెదురుగా ప్రతిష్ఠించారు. ఇక్కడ వెలసిన మూలవిరాట్టు వీరభద్రుడు. ఇదే ఆలయంలో స్తంభం పై దుర్గాదేవి విగ్రహం ఉంటుంది. గణపతి, నాగేంద్రుని పెద్ద రాతి విగ్రహాలు పర్యాటకులను ఆకర్షిస్తుంటాయి. లేపాక్షి ఆలయంలో రాతి పలకలు, స్తంభాలు, రాతి దూలాలు ఒకటేమిటి ప్రతి అణువూ అత్యద్భుతంగా నాటి శిల్పులు తీర్చిదిద్దారు. గోడలు, పై కప్పులపై చిత్రించిన వర్ణ చిత్రాలు అప్పటి చిత్రకారుల కళానైపుణ్యానికి దర్పణం పడతాయి.

ఆలయంలో చిత్రించిన రామాయణం, మహాభారతం, శివపురాణం, శివపార్వతుల కళ్యాణం, దశావతారాలు మొదలైన చిత్రాలు చూసి తీరవలసిందే. ఇక్కడ ప్రతి నిర్మాణం రాతితో నిర్మించినదే. వ్రేలాడే రాతి స్తంభం ఇక్కడ మరొక ప్రత్యేకత. లేపాక్షి చూడదగిన చారిత్రక ప్రదేశం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా లేపాక్షి ఉత్సవాలు నిర్వహిస్తోంది.



## ప్రశ్నలు–జవాబులు

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి?**

1. గుణదల మేరిమాత ఉత్సవానికి మూలం ఏమిటో తెలపండి?
2. కోటప్పకొండ తిరునాళ్ళ ప్రత్యేకతను వివరించండి.
3. అహోబిలం పార్వేట ఉత్సవం ప్రత్యేకత ఏమిటి?
4. లేపాక్షి ఉత్సవాల గురించి మీ సొంత మాటల్లో రాయండి.

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. సిరిమానోత్సవం జాతర గురించి రాయండి?
2. 'మత సామరస్యానికి ప్రతీక రొట్టెల పండుగ' ఎందుకో రాయండి?
3. సంస్కృతి సంప్రదాయాలను మన వారసత్వ సంపదగా తరువాతి తరానికి ఎలా అందించాలో తెలియ చేయండి?

AP SCERT



https://amaravathiteacher.com

# పద విజ్ఞానం

**అ**

అంచిత - గౌరవింపదగిన

అకస్మాత్తు - ఉన్నట్టుండి

అక్కు - రొమ్ము , గుండె

అణువు - స్వల్పం

అదృశ్యం - కనిపించనిది

అప్ప - తండ్రి

అపేక్ష - కోరిక

అభివాదం - నమస్కారం

అభ్యంతరం - ఆటంకం

అవని - భూమి

అక్షరం - నశింపు లేనిది

**ఆ**

ఆచారం - నడవడి, ఆచరణ

ఆనవాయితీ - ఆచారం, సంప్రదాయం

ఆశ్రయం - ఆధారం

**ఇ**

ఇల - నేల

ఇలవేల్పు - కులదైవం

**ఋ**

ఋణం - అప్పు

**ఔ**

ఔదల - తల, శిరస్సు

**క**

కంబళి - గొంగళి

కనకం - బంగారం

కనుమ - కొండల సందు

కరము - చెయ్యి

కల - స్వప్నం

కవాతు - కసరత్తు

కశ్మలం - మలినం, మురికి

కుదుటపడు - స్థిమితపడు, తేరుకొను

కురులు - వెంట్రుకలు, జుట్టు, ముంగురులు

క్షమా - ఓర్పు, సహనం

**ఖ**

ఖననం - పాతి పెట్టడం, తవ్వడం

**గ**

గద్దించు - అరచు, మందలించు

గవాక్షం - కిటికి

**ఘ**

ఘటము - కుండ

**చ**

చరణం - పాదం

చారలు - గీతలు

చెలగి - ప్రకాశించి

చేష్ట - పని, ప్రవర్తన

**జ**

జడలగము - వెంట్రుకల అల్లిక

**త**

తహతహ - ఆసక్తి, పోరాటం

తావు - స్థానం, చోటు

తూగు - ఊగు

**ద**

దర్పణం - అద్దం

దుష్టుడు - చెడ్డవాడు

దోహదం - తోడ్పాటు, సహకారం

ధారణ - జ్ఞాపకశక్తి

AP SCERT



https://amaravathiteacher.com

### న

నిట్టూరుపు – దీర్ఘశ్వాస

నిద్దము – నునుపు, చక్కదనం

నెపము – కారణం

### ప

పంకిలం – బురద గలది

పరిచర్య – పూజ, ఆరాధన, సేవ

పాయక – విడువక

పొరాడు – పిల్లలు ప్రాకు

పాశం – బంధం

పృథివి – భూమి

పైడి – బంగారం

ప్రదక్షిణం – ఎడమ నుంచి కుడి వైపుకు గుండ్రంగా తిరుగుట

ప్రలోభం – లోబరుచుకోవడానికి వేసే వల

### బ

బలుపు – బలము, పుష్టి

బాకు – కత్తి

బాహ్యము – బయట, వెలుపల

బుధులు – పండితులు

బొద్దు – లావైన, హస్తాభరణవిశేషం

### భ

భంగం – ఆటంకం

భంగిమ – తీరు, అంగ విన్యాసం

భవము – పుట్టుక

భ్రష్టుడు – చెడినవాడు

### మ

మలినం – మురికైనది

మహత్తు – గొప్పతనం

మార్జనం – తుడుచుట, తోమడం

మిళితం – కూడుకొనిన, కలసిన

ముచ్చట – కోరిక, సంభాషణం

ముప్పు – ఆపద

మైత్రి – స్నేహం

మొక్కు – నమస్కరించు

మొరవంక – వంకరైన

మోహం – కోరిక, ఆశ

### య

యశము – కీర్తి

### ర

రూఢి – ప్రసిద్ధి, నిశ్చయం

రిక్కించు – నిక్కపొడుచు

### ల

లేపనం – పూత, అలకడం

### వ

వాణి – మాట, పలుకు, సరస్వతి

విశ్వాసం – నమ్మకం, శ్రద్ధ

విస్తరించు – వ్యాపింప చేయు, వివరించు

వైరము – శత్రుత్వం

వృద్ధులు – పెద్దవారు

### శ

శయనం – నిద్ర

శరము – బాణం

శ్రేయస్సు – శుభం

### స

సంకోచము – సంశయం

సంసృతి – సంసారం

సాక్ష్యం – ఋజువు, ప్రత్యక్షంగా చూసింది

సుతులు – కొడుకులు

### హ

హాని – కీడు

హీనం – చెడు

AP SCERT



https://amaravathiteacher.com

## పర్యాయపదాలు

| | | |
|---|---|---|
| అద్దం | – | దర్పణం, ముకురం |
| అమ్మ | – | తల్లి, జనని |
| అపేక్ష | – | కోరిక, కాంక్ష |
| అవని | – | భూమి, పుడమి |
| ఇల | – | భూమి, వసుధ |
| ఆశ్రయం | – | ఊత, ఆధారం |
| కత్తి | – | కరవాలం, ఖడ్గం |
| కనకం. | – | బంగారం, పైడి |
| కన్ను | – | నేత్రం, దృష్టి |
| చేయి | – | కరం, హస్తం |
| నిద్ర | – | శయనం, సుప్తి |
| నెపము | – | మిష, వంక |
| పర్వతం | – | శైలము, గిరి |
| పాదం | – | అడుగు, కాలు |
| భూషణం | – | నగ, అలంకారం |
| మైత్రి | – | స్నేహం, చెలిమి |
| మేను | – | శరీరము, కాయం |
| రాజు | – | భూపాలుడు, నరేంద్రుడు |
| రాత్రి | – | నిశ, యామిని |
| వైరం | – | పగ, విరోధం |
| శరము | – | బాణం, అమ్ము |
| శిశువు | – | బిడ్డ, చంటిపాప |
| శౌరి | – | శ్రీహరి, విష్ణువు |
| సిరి | – | కలిమి, శ్రీ |
| సుతుడు | – | కుమారుడు, కొడుకు |

## లేపాక్షి బసవయ్య లేచి రావయ్య....

– అడవి బాపిరాజు

లేపాక్షి బసవయ్య లేచి రావయ్య
కైలాస శిఖరిలా కదలిరావయ్య!
హుంకరించిన దెసలు ఊగిపోయేను
ఖురముతో దువ్వితే కులగిరులె వణికేను ॥లేపాక్షి॥

ఆకాశగంగకై అర్రెత్తి చూస్తేను
పొంగేటి పాల్కడలి గంగడోలాడేను ॥లేపాక్షి॥

నంది పర్వతజాత నవపినాకిని జలము
నీ స్నాన సంస్పర్శ నిలువునా పులకించె ॥లేపాక్షి॥

వంగోలు భూమిలో పెనుగొండ సీమలో
నీ వంశ మీనాడు నిలిచింది గర్వాన ॥లేపాక్షి॥

'మన విశిష్ట ఉత్సవాలు' ఉపవాచకంలో 'లేపాక్షి ఉత్సవాలు' పాఠం ఉంది. అందులో 'లేపాక్షి బసవయ్య లేచిరావయ్య...' గేయం ప్రస్తావన వచ్చింది. ఇప్పుడు విద్యార్థుల కోసం పూర్తి గేయం.

AP SCERT



https://amaravathiteacher.com

# భావనా పటం - 7వ తరగతి

**(పాఠ్యప్రణాళికా లక్ష్యం-1)**
**(భాషానైపుణ్యాల అభివృద్ధి)**

1. వచనకవిత్వం గురించి తెలుసుకొని, రావినూతల ప్రేమకిషోర్ గురించి వివరిస్తారు.
2. అక్షరం గొప్పతనాన్ని, అమ్మప్రేమను చెప్పగలరు.
3. కథను విని, మాయాకంబళి వంటి జానపద కథలు గురించి తెలుసుకొని ఆనందిస్తారు.
4. పదకవులు గురించి తెలుసుకొని, చిన్నిశిశువు పాఠ్యభాగ కవి గురించి వివరిస్తారు.
5. పరిసరాలలో ఉండే చెట్లు, జంతువులు, పక్షులు మొదలైనవి తమంతటతాము వాటిగురించి అవి ఎలా వివరిస్తాయో తెలుసు కుంటారు.(స్వగతాలు)
6. శతక కవులు గురించి తెలుసుకొని పాఠంలోని కవులు గురించి వివరిస్తారు.

**(పాఠ్యప్రణాళికా లక్ష్యం-2)**
**(సాహిత్య, సాంస్కృతిక అభినందన)**

1. అక్షరంకవిత చదివి, వచన కవిత్వాన్ని అభినందిస్తారు.
2. జానపద కళలను అవగాహన చేసుకుని అద్భుత కల్పనలను తెలుసుకొని భిన్నమైన భావనలు వ్యక్త పరచగలరు.
3. సంకీర్తనను అభినయిస్తూ, రాగయుక్తంగా పాడగలరు.
4. మర్రిచెట్టు పాఠంలోని వాక్యాలను వాచిక అభినయంతో చదవడం ద్వారా ప్రకృతితో తాదాత్మ్యం చెందుతారు.
5. వివిధ శతకాలలోని పద్యాలను భావసహితంగా, శ్రావ్యంగా పాడి, అభినందిస్తారు.



**(పాఠ్యప్రణాళికా లక్ష్యం-3)**
**(భాషానిర్మాణ వినియోగం)**

1. చదువువిలువను గురించి చెప్పగలరు, రాయగలరు.
2. మాయాకంబళి కథ సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలరు,రాయగలరు.
3. చిన్నిశిశువు సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలరు, రాయగలరు.
4. మర్రిచెట్టు (స్వగతం) పాఠం లోని వాక్యాలలోని భాగాలను చదవగలరు, రాయగలరు.
5. పద్య పరిమళంలోని పద్యాలకు భావాలను చెప్పగలరు,రాయగలరు.

**(పాఠ్యప్రణాళికా లక్ష్యం-4)**
**(సమీక్ష, గ్రంథాలయ వినియోగం)**

1. అమ్మ గురించి, అక్షరాల గురించి గేయం, పాట, కవితలు సేకరించి ప్రదర్శిస్తారు.
2. లింగము, వచనము భాషాభాగాలు, విభక్తులు తెలుసుకొని అభినందిస్తారు.
3. పదకవితలను సేకరించి ప్రదర్శిస్తారు.
4. వివిధ రకాల చెట్లు గుర్తించి వాటి చిత్రాలను గీసి ప్రదర్శిస్తారు.
5. శతక కవులు వివరాలు సేకరించి కవికాలాదులను పట్టిక రూపంలో తయారు చేయగలరు

**(పాఠ్యప్రణాళికా లక్ష్యం-5)**
**(భాషా ప్రత్యేకతల అభినందన)**

1. అక్షరం పాఠంలోని హల్లులలో రకాలను గుర్తిస్తారు.
2. అద్భుత కథల్లోని పదప్రయోగాలు, పదాలు వాడుకను మౌఖిక, లిఖిత, భాష ద్వారా ఆకర్షణీయంగా వినియోగిస్తారు.
3. ఆగమ, వైకల్పిక సంధులను గురించి నేర్చుకుంటారు.
4. పాఠంలోని క్రియా కాలాలు ప్రత్యేకతల గురించి సవివరంగా తెలుసుకుంటారు.
5. సంస్కృతసంధులు, తత్పురుషసమాసాలు తెలుసుకుంటారు.

APSCERT



https://amaravathiteacher.com

## తెలుగు ప్రాజెక్టు - నమూనా (అవగాహన కొరకు)

| | | |
|---|---|---|
| విద్యార్థి పేరు | : | గాయత్రి వర్షిణి |
| తరగతి | : | 7వ |
| పాఠశాల పేరు | : | జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా. |
| అంశం | : | గ్రామీణ వాతావరణాన్ని తెలిపే చిత్రపటాలను గీచి తరగతి గదిలో ప్రదర్శించుట. |
| శీర్షిక | : | గ్రామ చిత్రపటాలు |
| సమాచారం సేకరించిన తేదీ | : | 17.11.2026 |
| ప్రదర్శించిన తేది | : | 22.11.2026 |


**ప్రాజెక్టు వర్క్ -1**

1) వనరులు : చార్టు, కలర్ పెన్నులు మొ//వి.

2) పరిశీలన వనరులు : వివిధ చిత్రకారుల చిత్రాలు

3) సేకరించిన విధానం : ఈ ప్రాజెక్టు పని నిమిత్తం గ్రామీణ వాతావరణాన్ని తెలిపే చిత్రాల సేకరణకై నేను గ్రామంలోని అంతర్జాల కేంద్రానికి వెళ్ళి, చిత్రాలను పరిశీలించి, నైపుణ్యాలను గురించి తెలుసుకున్నాను. నా జట్టు సభ్యులతో కలసి మా ఉపాధ్యాయుల సలహాలతో కొన్ని అంశాలకు సంబంధించిన విషయాలలో సూచనలను పొంది, చిత్రాలను సేకరించి/గీచి తరగతిగదిలో ప్రదర్శించాను.

**నివేదిక :**





**ప్రాజెక్టు ద్వారా నేర్చుకున్న అంశాలు :** పల్లె తల్లి వంటిది. గ్రామం అనేది ప్రకృతి సోయగాలతో నిండిన ప్రశాంతమైన నివాసస్థలం. ఇక్కడ ప్రజలు ఎక్కువగా వ్యవసాయం, పశుపోషణ వంటి వృత్తులతో జీవనం సాగిస్తారు. గ్రామాలలో మనుషులు పరస్పరం సహకరించుకుంటూ స్నేహభావంతో జీవిస్తారు. స్వచ్ఛమైన గాలి, పచ్చనిచెట్లు మరియు సరళమైన జీవనవిధానం గ్రామాల ప్రత్యేకత. ఎక్కడి నుంచి వచ్చిన వారినైనా అక్కునచేర్చుకుని ఆదరించడం గ్రామాల లక్షణం.

**ముగింపు :** గ్రామాల చిత్రాల సేకరణ ద్వారా గ్రామ జీవన సౌందర్యం, సంప్రదాయాలు మరియు సంస్కృతిని మనం స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఈ ప్రాజెక్టు గ్రామాల ప్రాముఖ్యతను అర్థం చేసుకునేలా చేసి, వాటి పరిరక్షణ మనందరి బాధ్యత అని తెలియజేయడమే ఈ ప్రాజెక్టు ముఖ్యఉద్దేశం.

APSCERT



https://amaravathiteacher.com